17 . 04. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

శుక్రవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి : 07 సంచిక : 304 , పేజీలు : 12 వెల : రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

## ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య కాల్పుల విరమణ.. ప్రకటించిన ట్రంప్

- ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ
- ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో హెజ్బొల్లాపై దాడుల నిలిపివేత
- దశాబ్దాల తర్వాత అమెరికా మధ్యవర్తిత్వంతో ఇరు దేశాల చర్చలు
- దక్షిణ లెబనాన్‌లో 642 మంది భారత శాంతి సైనికులు



3లో



2లో

## అమెరికా నౌకలను హర్మూజ్‌లోనే ముంచేస్తాం

– ఓడరేవులను ముట్టడిస్తే ఖబడ్దార్



2లో

## ఆ బిల్లులు దురుద్దేశపూరితమైనవి - కొన్ని రాష్ట్రాలకు అపారమైన నష్టం : కాంగ్రెస్

## డీజీపీ శివధర్ రెడ్డికి లేఖ రాసిన మంత్రి పొన్నం ప్రభాకం

2లో

# తెలంగాణలో టాప్ 3 కులాలు ఇవే...

# నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం


- తెలంగాణ కుల సర్వే అధికారిక గణంకాలను విడుదల చేసిన ప్రభుత్వం
- రాష్ట్రంలో 56.36 శాతంతో బీసీలదే అగ్రస్థానం అని వెల్లడి
- జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో ఓసీల్లో రెడ్డి, ఎస్టీల్లో లంబాడీల జనాభా అత్యధికం
- దాదాపు 4 శాతం మంది ప్రజలు తమకు కులం లేదని వెల్లడించిన వైనం



2

**హైదరాబాద్, వెలుతురు ఏప్రిల్ 16 :** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వేకు సంబంధించిన అధికారిక గణంకాలను విడుదల చేసింది. ఈ సర్వే ప్రకారం రాష్ట్ర జనాభాలో వెనుకబడిన తరగతులు (బీసీలు) 56.36 శాతంతో అతిపెద్ద సామాజిక వర్గంగా నిలిచారు. జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. దేశంలోనే ఆదర్శవంతంగా, అత్యంత పారదర్శకంగా ఈ సర్వే ప్రక్రియను పూర్తి చేశామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ భారీ కసరత్తు కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.03 లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేశారు. ప్రజల నుంచి 'సెల్ఫ్ డిక్లరేషన్' పద్ధతిలో వివరాలను సేకరించారు. ఈ సర్వేలో భాగంగా మొత్తం 1,12,36,849 కుటుంబాలను సర్వే బృందాలు సందర్శించి, 3,55,50,759 మంది జనాభా వివరాలను నమోదు చేసినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో తెలిపింది.

## దేశ పార్లమెంటరీ చరిత్రలో ఈరోజును మరిచిపోలేం- దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు



- మహిళలకు అవకాశం ఇస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారన్న ప్రధాని మోదీ
- మహిళల బిల్లు విషయంలో అందరూ కలిసి రావాలని పిలుపు

**ఢిల్లీ, వెలుతురు ఏప్రిల్ 16 :** మహిళా రిజర్వేషన్ల అమలు కోసం తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ లక్ష్య సాధనలో మహిళల పాత్ర చాలా కీలకమని వివరించారు. మహిళలకు అవకాశం ఇస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారని పేర్కొన్నారు. గతంలో మహిళా రిజర్వేషన్ల బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు ఇచ్చిన విషయం గుర్తుచేసిన ప్రధాని రిజర్వేషన్లను త్వరగా అమలుచేసేందుకు చేస్తున్న ప్రయత్నానికి ఇప్పుడు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.
మహిళా బిల్లును వ్యతిరేకించే వారిని మహిళలు క్షమించరన్న ప్రధాని మోదీ, సమయం చూసి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. దేశ పార్లమెంటరీ చరిత్రలో ఈరోజును మరిచిపోలేమన్న మోదీ, ఈ చారిత్రక సమయంలో పాలుపంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నాని అన్నారు. దేశ రాజకీయాల్లో మహిళల పాత్ర కీలకమని, వారిని కలుపుకుని ముందుకెళ్తున్నామని చెప్పారు. మహిళలకు

మిగతా 2లో



2

## తెలంగాణ ఏర్పాటుపై.. బీజేపీ ఎంపీ వ్యాఖ్యలు అజ్ఞానానికి పరాకాష్ట: మంత్రి జూపల్లి కృష్ణారావు

## తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు జోహార్లు..

- తెలంగాణ పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తేజస్వి సూర్య వెంటనే తన మాటలను వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి.
- స్పీకర్ ఓం బిర్లా కి లేఖ ద్వారా పిర్యాదు చేస్తున్న తెలంగాణ పై అవహేళనగా మాట్లాడిన తేజస్వి సూర్య పార్లమెంట్ సభ్యత్వాన్ని తొలగించి బర్తరఫ్ చేయాలి..
- తేజస్వి మాటలు పార్లమెంట్ రికార్డుల నుండి తొలగించాలి
- గాంధీభవన్ మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



2లో

## తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తే సహించే ప్రసక్తే లేదు

- స్వరాష్ట్ర కాంక్ష కోసం అగ్నికి ఆహుతులైన బిడ్డల త్యాగాలను పార్లమెంట్ వేదికగా అవమానిస్తారా..?
- నాలుగు కోట్ల ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడడం దుర్మార్గం
- తెలంగాణ ఏర్పాటును ఇండియా - పాకిస్థాన్ విభజనతో పోల్చడం హేయనీయం
- డా.బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపర్చిన ఆర్టికల్ 3 ద్వారా తెలంగాణ రాష్ట్ర కల సాకారమైంది
- తెలంగాణ రాష్ట్రం రాజ్యాంగ బద్దంగా పార్లమెంట్ ప్రక్రియ ద్వారా ఏర్పాటు అయింది
- బీజేపీ ఎంపీ అజ్ఞానపు మాటలపై లోక్ సభ స్పీకర్ చర్యలు తీసుకోవాలి
- ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్న బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలపై మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మండిపాటు..



**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 16:** పార్లమెంట్ వేదికగా బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్–పాకిస్థాన్ విభజనతో పోలుస్తూ చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయమైనవని, ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని

మిగతా 2లో

## తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించండి



2లో

- ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో రాష్ట్రం 'అవకాశాల ఖని'
- ఏటా వృద్ధి రేటు 30 శాతం, ఎగుమతుల్లో 103 శాతం నమోదు
- 'యూఎస్ నేషనల్ కాలేజ్ వార్' ప్రతినిధుల భేటీలో మంత్రి శ్రీధర్ బాబు

## రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన నితిన్ నబిన్ గారికి శుభాకాంక్షలు చెప్పిన బొక్క బాల్ రెడ్డి



**న్యూఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 16:** గురువారం రోజున రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసి దేశ సేవలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిన బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ గారికి హృదయపూర్వక అభినందనలు తెలిపిన బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి భారతీయ జనతా పార్టీని యువతకు మరింత చేరువ చేస్తూ, కొత్త దిశగా ముందుకు తీసుకెళ్తారని ఆశిస్తూ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

## నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డికి అభినందనలు తెలియజేసిన హార్కర వేణుగోపాల్ రావు

**పార్లమెంట్, న్యూఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 16:** న్యూఢిల్లీలో నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హార్కర వేణుగోపాల్ రావు మర్యాదపూర్వకంగా కలుసుకొని అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో పాటు రాష్ట్రానికి చెందిన మంత్రులు, సలహాదారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మరియు ముఖ్య నాయకులు పాల్గొని తమ హృదయపూర్వక శుభాకాంక్షలను తెలియజేశారు.



## లోక్‌సభ ముందుకు మూడు బిల్లులు- వాడీవేడి చర్చ



3లో

- బిల్లులపై సభ్యులు ఎన్ని గంటలు కోరినా చర్చ జరపవచ్చు: లోక్‌సభ స్పీకర్
- డీలిమిటేషన్ బిల్లు ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించిన విపక్షాలు




3లో

## 40ఏళ్లుగా ఇజ్రాయెల్ యుద్ధం కోసం ప్రయత్నిస్తోంది- ఇప్పుడు అమెరికాను ఒప్పించగలిగింది: ఇరాన్

- నెతన్యాహూ దశాబ్దాలుగా ఇరాన్‌పై యుద్ధానికి ప్రయత్నించారని ఆరోపణ
- అమెరికా-ఇజ్రాయెల్ చర్యలపై ఇరాన్ ప్రతినిధి తీవ్ర విమర్శలు
- చర్చలు సీరియస్‌గా జరగలేదని వ్యాఖ్య

## మహిళా రిజర్వేషన్ బిల్లుతో ఎవరికీ నష్టం లేదు, మహిళలకు 272 సీట్లు లభిస్తాయి: కేంద్రమంత్రి




3లో

- మహిళా రిజర్వేషన్‌తో ఏ రాష్ట్రానికి, ఏ పురుషుడికి అన్యాయం జరగదన్న కేంద్రమంత్రి
- పార్లమెంటు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు అన్న అర్జున్ రామ్ మేఘ్ వాల్
- లోక్ సభ స్థానాలు 50 శాతం పెంచేలా నిర్ణయం తీసుకున్నామన్న కేంద్రమంత్రి

## తెలంగాణ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజలు రోడ్లపైకి వస్తారు: కవిత

- డీలిమిటేషన్‌లో తెలంగాణకు అన్యాయం జరగకుండా చూడాలన్న కవిత
- రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ
- దక్షిణాది రాష్ట్రాలను డీలిమిటేషన్ పేరుతో శిక్షించడం సరికాదని వ్యాఖ్య

3లో



## కేరళలో లోక్ సభ స్థానాలను తగ్గించమని రేవంత్ రెడ్డి కోరాలి: రాంచందర్ రావు

- కేరళలో 20 లోక్ సభ స్థానాలు ఉంటే తెలంగాణలో 17 ఉన్నాయన్న రాంచందర్ రావు
- ముందు కేరళలో సీట్లు తగ్గించాలని అడగాలని సవాల్
- కాంగ్రెస్ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలకు తక్కువ సీట్లు ఇచ్చిందని ఆరోపణ

3లో



# తెలంగాణలో టాప్ 3 కులాలు ఇవే...
# నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం

**సామాజిక వర్గాల వారీగా జనాభా వాటా :** సర్వే ఫలితాల ప్రకారం, రాష్ట్ర జనాభాలో బీసీల తర్వాత షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు) 17.42 శాతం, అగ్రవర్ణాలు (ఓసీలు) 15.79 శాతం, షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) 10.43 శాతం చొప్పున ఉన్నారు.
మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సుమారు 4 శాతం మంది ప్రజలు తమకు ఎలాంటి కులం లేదని (No Caste) తమ డిక్లరేషన్‌లో పేర్కొనడం గమనార్హం.

**కులాల వారీగా ప్రధాన వర్గాలు :** రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కులాల జాబితాను పరిశీలిస్తే, 36.58 లక్షల మందితో (10.3 శాతం) మాదిగ సామాజిక వర్గం మొదటి స్థానంలో నిలిచింది.
ఆ తర్వాత 27.96 లక్షల మందితో (7.9 శాతం) షేక్ ముస్లింలు రెండో స్థానంలో, 26.39 లక్షల జనాభాతో (7.4 శాతం) ముదిరాజ్ సామాజిక వర్గం మూడో స్థానంలో ఉన్నాయి.

**ఓసీ వర్గాల్లో:** రెడ్డి సామాజిక వర్గం 4.8 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో కోమటి (1.4 శాతం), కమ్మ (1.0 శాతం), బ్రాహ్మణ (0.9 శాతం), కాపు/నాయుడు (0.7 శాతం), వెలమ (0.4 శాతం) ఉన్నారు.

**బీసీ వర్గాల్లో:** షేక్ ముస్లింలు (7.9 శాతం) అత్యధిక జనాభాతో ముందంజలో, ముదిరాజ్ (7.4 శాతం), యాదవ (5.7 శాతం), గౌడ్ (4.6 శాతం), మున్నూరుకాపు (3.9 శాతం) తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఎస్సీ వర్గాల్లో: మాదిగ (10.3 శాతం) సామాజిక వర్గం అత్యధిక జనాభా కలిగి ఉండగా, మాల (4.1 శాతం), బేడా (0.5 శాతం), మాల సేల్ (0.5 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

**ఎస్టీ వర్గాల్లో:** లంబాడీలు 6.8 శాతం జనాభాతో అగ్రస్థానంలో నిలిచారు. కోయ (1.2 శాతం), గోండ్ (1.1 శాతం), ఎరుకుల (0.5 శాతం) వారి తర్వాత ఉన్నారు. ఈ సర్వే ద్వారా వెల్లడైన గణంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల రూప కల్పన, రాజకీయ సమీకరణాల్లో కీలక పాత్ర పోషించనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో ఎస్సీ దక్కలి కులం అత్యధికంగా, కాపు కులం అతి తక్కువగా వెనకబడి ఉన్నట్లు స్వతంత్ర నిపుణుల కమిటీ విశ్లేషించింది. ఎస్సీ, ఎస్టీలు ఓసీల కన్నా సుమారు మూడు రెట్లు వెనకబడి ఉన్నట్లు తెలిపింది. సుమారు 67 శాతం జనాభా, రాష్ట్ర సగటు కన్నా ఎక్కువ వెనకబాటు తనంతో ఉన్నట్లు వివరించింది. ఎస్టీల్లో 99 శాతం, ఎస్సీల్లో 97 శాతం, బీసీల్లో 71 శాతం రాష్ట్ర సగటు కన్నా వెనకబడి ఉన్నారని, ఇది కులాల మధ్య అసమానతలను స్పష్టంగా వెల్లడిస్తోందని కమిటీ పేర్కొంది.

**గతేడాదిలో నిపుణుల కమిటీ ఏర్పాటు :** రాష్ట్ర ప్రభుత్వం చేసిన సీపెక్ సర్వే ఆధారంగా స్వతంత్ర నిపుణుల కమిటీ పలు ఆసక్తికర విశ్లేషణలతో పాటు ప్రభుత్వానికి కీలక సిఫార్సులు చేసింది. సీపెక్ సర్వేను అధ్యయనం చేసి, సిఫార్సులు చేసేందుకు జస్టిస్ సుదర్శన్ రెడ్డి నేతృత్వంలో స్వతంత్ర నిపుణుల కమిటీని గతేడాది మార్చి 12న రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఐదు సమావేశాలు నిర్వహించిన నిపుణుల కమిటీ, గతేడాది జులై 19న ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. సామాజిక, ఆర్థిక పరిస్థితులను పరిగణలోకి తీసుకొని 8 విభాగాల్లో 42 పారామీటర్ల ఆధారంగా కులాల వారీగా వెనకబాటు తనాన్ని అంచనా వేసింది. ఎక్కువ స్కోరు ఉంటే ఎక్కువ వెనకబడినట్లుగా పేర్కొంది.

**116 పాయింట్లతో అత్యంత వెనకబడిన ఎస్సీ దక్కలి :** దాని ప్రకారం రాష్ట్రంలో 116 పాయింట్లతో ఎస్సీ దక్కలి కులం అత్యంత వెనకబడిందని, 12 పాయింట్లతో కాపు కులస్తులు అతి తక్కువగా వెనకబడినట్లు విశ్లేషించింది. ఎస్టీలు 96 పాయింట్లతో వెనకబడి ఉండగా, ఎస్సీలు 95 పాయింట్లతో, బీసీలు 86, ఓసీలు 31 స్కోరుతో ఆ తర్వాత వరుసలో ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీలు ఓసీ కులాల కన్నా సుమారు మూడు రెట్లు వెనకబడి ఉన్నట్లు కమిటీ విశ్లేషించింది.
ఉన్నత విద్య, ఆంగ్ల మాధ్యమంలో ఓసీ కులాల కన్నా ఎస్సీ, ఎస్టీ, బీసీలు వెనకబడి ఉన్నట్లు పేర్కొంది.
ఎస్సీ, ఎస్టీలు ఎక్కువగా రోజువారీ కూలీ, వ్యవసాయ పనులు చేస్తుండగా, జనరల్ కులాలు వ్యాపార, వృత్తిపరమైన ఉద్యోగాల్లో ఆధిపత్యంలో ఉన్నట్లు కమిటీ వివరించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీలు తక్కువ స్థాయి జీవన ప్రమాణాలతో నివసిస్తున్నారని పేర్కొంది. జనరల్ కులాల వారికి మెరుగైన నాణ్యత గల భూములు, ఆస్తులు ఉన్నట్లు నివేదించింది.

**ఎక్కువగా లబ్ధి పొందుతున్న ఓసీలు :** సుమారు లక్ష కోట్లకు పైగా ఖర్చు చేస్తున్న 11 పథకాలను స్వతంత్ర నిపుణుల కమిటీ విశ్లేషించగా, సుమారు 30 శాతం మంది లబ్ధిదారులు మాత్రమే రాష్ట్ర సగటు కన్నా తక్కువ వెనకబాటు తనంతో ఉన్నారని కమిటీ వెల్లడించింది. ఎస్సీ, ఎస్టీలు ఉచిత గృహ పథకాలు, మహిళలు ఉచిత బస్సు ప్రయాణం పథకాల్లో ఎక్కువగా లబ్ధి పొందుతున్నారని తెలిపింది. రైతు భరోసా, రైతు బీమా, ఉచిత విద్యుత్ వంటి వ్యవసాయ పథకాల్లో ఎక్కువగా ఓసీలు లబ్ధి పొందుతున్నట్లు వివరించింది.

**వెనకబాటు తనంతో 107 కులాలు :** రాష్ట్ర సగటు స్కోరును 81గా పేర్కొన్న కమిటీ, మొత్తం 242 కులాలు 135 సగటు కన్నా ఎక్కువ స్కోరుతో వెనకబడి ఉన్నాయని తెలిపింది. వాటిలో 69 బీసీ, 41 ఎస్సీ, 25 ఎస్టీ కులాలు ఉన్నాయని, రాష్ట్ర జనాభాలో 67 శాతం వెనకబడి ఉన్నట్లు పేర్కొంది. రాష్ట్ర సగటు కన్నా తక్కువ వెనకబాటు తనంతో 107 కులాలు ఉన్నాయని, వాటిలో 64 బీసీలు, 18 ఎస్సీ, ఏడు ఎస్టీ కులాలు ఉన్నట్లు కమిటీ వెల్లడించింది. ఎస్టీల్లో 99 శాతం, ఎస్సీల్లో 97 శాతం, బీసీల్లో 71 శాతం రాష్ట్ర సగటు కన్నా వెనకబడి ఉన్నారని, ఇది కులాల మధ్య అసమానతలను స్పష్టంగా వెల్లడిస్తోందని పేర్కొన్నారు.

**స్వతంత్ర నిపుణుల కమిటీ సిఫార్సు :** రాష్ట్రంలోని 4 శాతం అంటే సుమారు 14 లక్షల మంది తమది ఏ కులం కాదని సర్వేలో చెప్పారు. ఎక్కువగా హైదరాబాద్‌లోని తక్కువ వెనకబాటుతనం ఉన్న వర్గాలకు చెందిన విద్యా వంతులు, ఉద్యోగులు తమకు కులం లేదని పేర్కొన్నారు. అయితే సర్వేలో తమది నో కాస్ట్ అని చెప్పిన వారిలో దాదాపు 43.3 శాతం మంది వద్ద కుల ధ్రువీకరణ పత్రాలు ఉన్నట్లు కమిటీ విశ్లేషించింది. జనాభా ప్రాతిపదికన కాకుండా వెనకబాటు తనం ఆధారంగా సామాజిక న్యాయం జరగాలని స్వతంత్ర నిపుణుల కమిటీ సిఫార్సు చేసింది. కులాల వెనకబాటు తనం ప్రామాణికంగా సంక్షేమ విధానాలు రూపొందించాలని తెలిపింది.

## తెలంగాణ ఏర్పాటుపై.. బీజేపీ ఎంపీ వ్యాఖ్యలు
## అజ్ఞానానికి పరాకాష్ట: మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, వెలుతురు ఏప్రిల్ 16 :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్తాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ఈ వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని, అమరవీరుల త్యాగాలను అవమానించడమేనని మండిపడ్డారు. బీజేపీ నేతలకు తెలంగాణ ఉనికి అన్నా, ఇక్కడి ప్రజల అస్తిత్వం అన్నా మొదటి నుంచి కడుపుమంట అని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం.. ఈ నేల వందలాది మంది యువకుల బలిదానాలు, దశాబ్దాల సుదీర్ఘ పోరాట ఫలితం.రాజ్యాంగబద్ధంగా పార్లమెంటు ఆమోదించిన ప్రక్రియను దేశ విభజనతో పోల్చడం ఎంపీ అజ్ఞానానికి పరాకాష్ట. గతంలో ప్రధాని మోదీ కూడా 'తల్లిని చంపి బిడ్డను వేరు చేశారు' అని మాట్లాడారు. ఆ విద్వేష భావజాలమే ఇప్పుడు ఎంపీ తేజస్వీ సూర్య మాటల్లో ప్రతిబింబిస్తోంది అని మంత్రి దుయ్యబట్టారు. రాజకీయ లాభాపేక్షను బేరీజు వేసుకోకుండా, తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షను గుర్తించి సోనియా గాంధీ ధైర్యంగా నిర్ణయం తీసుకున్నారని మంత్రి గుర్తు చేశారు. ఒక తల్లి మనసుతో తెలంగాణ బిడ్డల ఆవేదనను అర్థం చేసుకున్న వ్యక్తి సోనియా గాంధీ. కానీ బీజేపీ నేతలు మాత్రం నిత్యం విషం చిమ్ముతూనే ఉన్నారు. ఓట్ల కోసం ఇక్కడి ప్రజలను వాడుకుంటూ, మనసులో మాత్రం తెలంగాణ పట్ల విద్వేషాన్ని నింపుకున్నారని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చిన్న రాష్ట్రమైన తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంటే... ఓర్వలేకనే బీజేపీ నేతలు ఇలాంటి వివాదాలకు తెరలేపుతోందని జూపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఎంపీ తేజస్వీ సూర్య తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అస్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడితే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని మంత్రి హెచ్చరించారు.

## తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తే
## సహించే ప్రసక్తే లేదు

**హైదరాబాద్, వెలుతురు ఏప్రిల్ 16 :** దెబ్బతీయడమేనని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా ఖండించారు."తెలంగాణ రాష్ట్రం వందలాది మంది విద్యార్థులు, యువకుల ప్రాణత్యాగాల ఫలితం. దశాబ్దాల పోరాటం, ప్రజాస్వామ్యబద్ధంగా పార్లమెంట్‌లో ఆమోదించిన చట్టం ద్వారా ఏర్పడిన రాష్ట్రాన్ని, రక్తపాతంతో కూడిన దేశ విభజనతో పోల్చడం తేజస్వి సూర్య అజ్ఞానానికి పరాకాష్ట. ఇది అమరుల త్యాగాలను కించపరచడమే." అని మంత్రి మండిపడ్డారు. "భారత రాజ్యాంగం ప్రకారం జరిగిన రాష్ట్ర విభజనకు తేడా తెలియని వారు పార్లమెంట్‌లో ఉండటం దురదృష్టకరం. కోట్లాది మంది ప్రజలను అవమాన పరిచేలా మాట్లాడిన తేజస్వి సూర్యపై లోక్ సభ స్పీకర్ గారు చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేస్తున్న. రాజకీయ లబ్ధి కోసం దేశ సమగ్రతను, ప్రాంతీయ సామరస్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం భావ్యం కాదు."
"తెలంగాణ సమాజాన్ని కించపరిచిన తేజస్వి సూర్య తన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలి. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు ఆయన బహిరంగంగా క్షమాపణ చెప్పాలి". తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీజేపీ ఇలాంటి విషపూరిత వ్యాఖ్యలు చేస్తోందని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని మంత్రి హెచ్చరించారు.

## తెలంగాణ రాష్ట్ర సాధన కోసం
## ప్రాణాలర్పించిన అమరవీరులకు జోహార్లు..

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 16:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై లోక్ సభ , రాజ్యసభ లో పాస్ చేసిన బిల్లులు అవమానపరుస్తుంటే తెలంగాణ నుండి ఎంపికైన 8 మంది బిజెపి పార్లమెంట్ సభ్యులు చీము నెత్తురు లేకుండా వాటిని విని ఎంజాయ్ చేసే దౌర్భాగ్య పరిస్థితి ఉంటే తెలంగాణ తల్లి రోదించే పరిస్థితి ఉంది. తెలంగాణ పై బీజేపీ ఎంపీ తేజస్వి మాట్లాడిన మాటలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, అమరవీరులకు అవమానపరచడమే కాదు ఉద్యమస్ఫూర్తికి విఘాతం కలిగించేలా మాట్లాడారు.. తెలంగాణ రాష్ట్రం రాజ్యాంగంగా ఏర్పడలేదా..? దీర్ఘకాలిక సమస్య కు కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకొని బీజేపీ నేతలు కీర్తిశేషులు సుష్మా స్వరాజ్ తెలంగాణ బిల్లుకు మద్దతు ఇస్తే ఇప్పుడు ప్రధాని నుండి మొదలుకొని మొన్న టీడీపీ ఆంధ్రా ఎంపీ పార్లమెంట్ గురించి తెలంగాణ ఏర్పాటు గురించి మాట్లాడుతున్నారు.. ప్రతి ఒక్కరికి చులకనవులతుంది..బిడ్డ జాగ్రత్త విభజన తరువాత ఎవరి బతుకులు వాళ్ళ బతకాలనుకుంటే జ్ఞనం లేకుండా అజ్ఞానంతో పార్లమెంట్ వ్యవస్థలో రాజ్యాంగాన్ని అవమానపరిచే విధంగా బీజేపీ ఎంపీ తేజస్వి మాట్లాడిన మాటలు దేశ ప్రజాస్వామ్యానికి అగౌరవం.. ప్రధాన మంత్రి గారు వాటిని వినాలి.. మా నాయకుడు రాహుల్ గాంధీ గారికి మెయిల్ చేశాం.. తేజస్వి మాట్లాడిన మాటలు పార్లమెంట్ రికార్డుల నుండి తొలగించాలి లోకసభ స్పీకర్ స్పందించి పార్లమెంట్ ద్వారా పాస్ అయిన బిల్లును అవహేళన చేస్తున్న మాటలపై రికార్డుల నుండి తొలగించడమే కాదు అతని పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న.. తెలంగాణ రాష్ట్రం కోసం ఆత్మ త్యాగాలు చేసి ప్రజాస్వామికంగా చట్టాల ద్వారా తెచ్చుకున్నాం.. బీజేపీ నేతలు ఇష్టారీతిన మాట్లాడితే ఎవరు ఎందుకు స్పందించడం లేదు.. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు గారికి ఇప్పటికైనా మీకు తెలంగాణ రక్తం ఉంటే..కిషన్ రెడ్డి, బండి సంజయ్,లక్ష్మణ్ ,8 మంది ఎంపీలు మీరు తెలంగాణ బిడ్డలు అయితే తెలంగాణ తల్లిని అవమానపరుస్తుంటే చూస్తూ ఊరుకుంటే మంచిదా.. ఇప్పటికైనా మీరు మాట్లాడకుండా ఉంటే తల్లికి ద్రోహం చేసినవారిగా మిగులుతారు ఆనాడు తెలంగాణ కోసం రాజీనామా చేయకుండా పరారైన వ్యక్తి ..తెలంగాణ కు ప్రాధాన్యం వహిస్తున్న కేంద్ర మంత్రిగా తెలంగాణ ఏర్పాటు ను కించపరుస్తూ ప్రధాని మాట్లాడితే మంత్రి పదవి నుండి తొలగిస్తారేమో అని మీరు బయటపడ్డారనుకున్న.. అమిత్ షా మాట్లాడిన ,టీడీపీ ఎంపీ తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడిన , ఈరోజు బీజేపీ ఎంపీ మాట్లాడిన మీరు ఎందుకు స్పందించలేదు.. తెలంగాణ ఏర్పాటు పై ఇంత అక్కసు వివక్ష మంచిది కాదు.. తెలంగాణ ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడింది. ప్రజాస్వామిక ఫెడరల్ సిస్టమ్ లో తెలంగాణ విభజనను అవహేళన చూస్తుంటే మీరెందుకు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు.. తెలంగాణ ఏర్పాటు జరిగిన లోకసభ లోనే అవహేళన గా మాట్లాడుతున్నారు. బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు,బీజేపీ ఎంపీలు ఈ అంశాన్ని తేలికగా తీసుకుంటే మంచిది కాదు.. తెలంగాణ ఏర్పాటు ను అవమానపరుస్తుంటే వారికి చట్ట రీత్యా బుద్ధి చెప్పే ప్రక్రియ జరగాలి.. తెలంగాణపై అవమానకరంగా మాట్లాడే పార్టీ నాయకులు తెలంగాణలో తిరగగలుగుతున్నారంటే ప్రజాస్వామ్యం లో లా అండ్ ఆర్డర్ బాగుంది ఆలోచన చేస్తున్నాం.మీరు కన్నతల్లికి ద్రోహం చేసి తిరుగుతున్నట్టుగా భావిస్తాం తెలంగాణ ఏర్పాటు ను ఇండియా పాకిస్తాన్ ఏర్పాటుగా భావించిన ఎంపీని వెంటనే పార్లమెంట్ సభ్యత్వం నుంచి భర్తరాఫ్ చేయాలి.. ఆయన మాట్లాడిన మాటలు రికార్డుల నుండి తొలగించాలి..తెలంగాణ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు వెంటనే స్పందించాలి. తెలంగాణ ఉద్యమకారులు , అమరవీరుల కుటుంబాలు ఈ అంశం మీద స్పందించాలి.. లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా గారికి లేఖ ద్వారా పంపిస్తున్న.. ఎంపీ తేజస్వి పై చర్యలు తీసుకోవాలి. మాజీ పార్లమెంట్ సభ్యులం నేరుగా స్పీకర్ కు కలిసి ఫిర్యాదు చేస్తాం. రాష్ట్ర ఏర్పాటు ను ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని అవమానపరచడమే బిల్లు పాస్ అయిన విధానాన్ని వ్యతిరేకించడం అప్రజా స్వామికమే.. ఇది భారతీయ జనతా పార్టీ విధానం
తెలంగాణ ప్రజల్లో భారతీయ జనతా పార్టీ వైఖరి చెప్పే ప్రయత్నం చేస్తాం. తెలంగాణ కోసం కొట్లాడినా ప్రతి వ్యక్తి రాజకీయాలకు అతీతంగా మాట్లాడాలితేజస్వి సూర్య డి లిమిటేషన్ మీద మహిళా రిజర్వేషన్ మీద కాంగ్రెస్ పార్టీ విధానాల మీద మాట్లాడిన అభ్యంతరం లేదు తెలంగాణ పట్ల అక్కసు తో మాట్లాడారు. వారి వ్యాఖ్యలకు మద్దతు ఇస్తే వారిని తెలంగాణ బిడ్డగా గుర్తించం.. వారికి తెలంగాణ రక్తం లేదు గా భావిస్తాం.. కాకినాడ తీర్మానం మీరే కదా చేసింది.. మూడు రాష్ట్రాలు ఏర్పడినప్పుడు తెలంగాణ ఎందుకు ఏర్పాటు చేయలేదు.. అమరవీరులు చనిపోవడానికి మీ పార్టీ విధానాలే కారణం..

## దేశ పార్లమెంటరీ చరిత్రలో ఈరోజును మరిచిపోలేం
## - దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు : ప్రధాని మోదీ

అవకాశం ఇస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారని కొనియాడారు. "ఎవరైతే రాజకీయ కోణంలోనే ఆలోచిస్తారో, నేను వారికి ఒక సలహా ఇవ్వాలనుకుంటున్నా. ఒక మిత్రుడిగా సలహా ఇస్తున్నాను. ఇది అందరికీ ఉపయోగపడుతుంది. మహిళా బిల్లును వ్యతిరేకించే వారిని మహిళలు క్షమించరు. మన దేశంలో ఎప్పటి నుంచి అయితే మహిళా రిజర్వేషన్ల చర్చ జరిగిందో, ఆ తర్వాత ఎప్పుడెప్పుడు ఎన్నికలు వచ్చాయో, ప్రతి ఎన్నికల్లోనూ మహిళలకు లభించే ఈ హక్కును ఎవరెవరైతే వ్యతిరేకించారో, దేశంలోని మహిళలు వారిని క్షమించలేదు. వారి పరిస్థితి అధ్వాన్నం కంటే అధ్వాన్నంగా మార్చారు. 2024 ఎన్నికల్లో మాత్రం అలా జరగలేదు. ఎందుకు జరగలేదు? ఎందుకంటే 2024లో అందరూ ఏకాభిప్రాయంతో దీనిని ఆమోదించారు. కాబట్టి ఇది ఒక అంశంగానే మిగలలేదు. ఎవరి పక్షాన రాజకీయ లబ్ధి కలగలేదు. ఎవరికీ నష్టం కూడా కలగలేదు. సహజ సిద్ధంగా ఏయే అంశాలు ఉన్నాయో ఆ అంశాల ఆధారంగానే ఎన్నికలు జరిగాయి. ఎందుకంటే 2024లో అందరూ కలిసి ఉన్నారు. చరిత్ర సాక్షిగా ఈ రోజు కూడా నేను ఒకటి చెబుతున్నాను. ఒకవేళ మనం అందరం కలిసి ఈ నిర్ణయం తీసుకుంటే అది ఏ ఒక్క పార్టీ విజయం కాకుండా దేశ ప్రజాస్వామ్యానికే గొప్ప విజయంగా మారుతుంది."
మహిళా బిల్లుపై కొందరు ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన రాజకీయాలు చేస్తున్నారని ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని తేల్చిచెప్పారు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం అనే భేదాలు మాకు లేవని స్పష్టం చేశారు. "దేశం విషయంలో మనమంతా ఒక్కటవ్వాలి. దేశానికి మేలు చేసే ప్రతి విషయంలో సభ్యులంతా కలవాలి. ఈ బిల్లు తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన తీసుకువస్తున్నారు. విభజన రాజకీయాలు చేసే వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం అనే భేదాలు మాకు లేవు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం. ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని వాగ్దానం చేస్తున్నాం. అనేక పార్టీలు మహిళల హక్కులను ఇన్నాళ్లూ అడ్డుకున్నాయి. దాన్ని గుర్తించే మేం ఇప్పుడు మహిళలకు వారి హక్కులు కల్పిస్తున్నాం. అనేక కారణాలు చూపించి గతంలో మహిళా బిల్లును అడ్డుకున్నారు. సాంకేతిక కారణాలు చూపించి 30 ఏళ్లపాటు మహిళా బిల్లును అడ్డుకున్నారు. మహిళా బిల్లుకు పార్టీలన్నీ ఏకగ్రీవంగా మద్దతివ్వాలి. మహిళలు తమ హక్కులపై 30 ఏళ్లుగా గొంతు విప్పుతున్నారు. క్షేత్రస్థాయిలో మహిళలు 30 ఏళ్లుగా పోరాడుతున్నారు. రాజకీయాల్లో శక్తిసామర్థ్యాలు చూపించేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశం ఇస్తేనే కదా వారి సామర్థ్యం తెలుస్తుంది. మహిళా బిల్లుకు మద్దతిచ్చే పార్టీలకే మనుగడ ఉంటుంది. దేశ రాజకీయాల్లో, వివిధ రంగాల్లో మహిళలను కలుపుకుని వెళ్లాల్సిందే. దేశ ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నాం. మహిళల పురోగతిని కొన్ని పార్టీలు ఎందుకు అడ్డుకుంటున్నాయి? మహిళల శక్తిసామర్థ్యాలు తెలుసు కనుకే వారిని ప్రోత్సహిస్తున్నాం. మహిళా బిల్లు క్రెడిట్ మేం మాత్రమే తీసుకోం. మహిళా బిల్లు క్రెడిట్ అందరికీ దక్కుతుంది. మహిళా బిల్లుపై అన్ని పార్టీల నేతల ఫొటోలూ వేసుకోండి."

## తెలంగాణ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజలు రోడ్లపైకి వస్తారు: కవిత

**హైదరాబాద్, వెలుతురు ఏప్రిల్ 16 :** తెలంగాణ ప్రాతినిధ్యాన్ని దెబ్బతీసేలా కేంద్రం అడుగులు వేస్తే చూస్తూ ఊరుకోబోమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో కేంద్రం ప్రతిపాదించిన మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లులపై ఆమె తీవ్రంగా స్పందించారు. దేశవ్యాప్తంగా నియోజకవర్గాల సంఖ్య పెంచే ప్రక్రియలో భాగంగా తెలంగాణ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజలు రోడ్లపైకి వస్తారని, ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం పార్లమెంట్‌లో తెలంగాణకు ఉన్న 3.13 శాతం ప్రాతినిధ్యాన్ని బేస్‌లైన్‌గా పరిగణించాలని, పునర్విభజన తర్వాత కూడా ఈ శాతం తగ్గకుండా చూడాలని కవిత డిమాండ్ చేశారు. నియోజకవర్గాల సంఖ్య పెరిగినప్పటికీ, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ ప్రాతినిధ్యం తగ్గితే అది ప్రాంతీయ అసమానతలకు దారితీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్న దక్షిణాది రాష్ట్రాలను డీలిమిటేషన్ పేరుతో శిక్షించడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడంపై కవిత అసహనం వ్యక్తం చేశారు. మహిళా బిల్లును ఓబీసీ రిజర్వేషన్లతో ముడిపెట్టాలని, 33 శాతం కోటాలో ఓబీసీ మహిళలకు ప్రత్యేక వాటా కల్పిస్తేనే నిజమైన సామాజిక న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కేంద్రం వ్యవహరిస్తే వీధుల నుంచి పార్లమెంట్ వరకు పోరాటం చేస్తామని ఈ సందర్భంగా ఆమె ప్రకటించారు.

## తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించండి



**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 16 :** ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా దూసుకెళ్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామిక వేత్తల్ని ప్రోత్సహించాలని, ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, ఏరోస్పేస్ కాంపోనెంట్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, స్పేస్ టెక్నాలజీ, ఏఐ ఇన్ డిఫెన్స్, శాటిలైట్స్ సిస్టమ్స్ అండ్ అడ్వాన్స్ కమ్యూనికేషన్స్ లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో గురువారం 'యూఎస్ నేషనల్ కాలేజ్ వార్' బృంద సభ్యులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఇక్కడి అనుకూలతలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీలు మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వివరించారు. రాకెట్ల తయారీ నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు, యుద్ధ విమానాల విడిభాగాల నుంచి శాటిలైట్ల వరకు... అన్నింటిలోనూ 'మేడిన్ తెలంగాణ' మార్క్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందన్నారు. ఈ రంగం(ఏరోస్పేస్; డిఫెన్స్, స్పేస్)లో తెలంగాణ ఏటా 30 శాతానికి పైగా వృద్ధిని రేటును నమోదు చేస్తోందన్నారు. అలాగే... 2024-26 మధ్య కాలంలో ఎగుమతుల్లో 103 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్(సీఏజీఆర్) నమోదయ్యిందన్నారు. లాక్హీడ్ మార్టిన్, బోయింగ్, సాఫ్రాన్, ఎయిర్ బస్, డస్సాల్ట్ ఏవియేషన్ తదితర ప్రపంచ దిగ్గజ ఏరోస్పేస్ కంపెనీలతో డీఆర్డీవో, భెల్, మిధాని, బీడీఎల్,ఆర్ సీఐ, హాల్ తదితర కేంద్ర రంగ ప్రభుత్వ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఇవీ కాకుండా... ప్రిసిషన్ ఇంజనీరింగ్, డ్రోన్లు, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 1,500 కంటే ఎక్కువ ఎంఎస్ఎంఈలు 'తెలంగాణ బ్రాండ్'ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. ఫైనాన్షియల్ టైమ్స్ ఎఫ్ డీఏ ర్యాంకింగ్స్ ప్రకారం, ప్రపంచంలోనే అత్యంత 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వరుసగా ఐదుసార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును గెలుచుకుని 'గ్లోబల్ ఏరోస్పేస్ మ్యాప్'లో తెలంగాణ ఒక శక్తిమంతమైన కేంద్రంగా మారిందన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు అవసరమైన ఎకో సిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీజీ ఐపాస్ ద్వారా 15 నుంచి 30 రోజుల్లోగా అనుమతులు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఈ రంగానికి అవసరమైన 'రెడీ టూ స్కిల్ వర్క్ ఫోర్స్'ను అందిస్తున్నామన్నారు. పెట్టుబడులకు మాత్రమే కాదు, సాంకేతికత, పరిశోధన, తయారీ, నైపుణ్యాభివృద్ధిలో అమెరికాకు ఒక నమ్మకమైన దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామిగా నిలిచేందుకు 'తెలంగాణ' సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, అడ్వాన్స్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, స్పేస్ టెక్నాలజీ తదితర రంగాల్లో అమెరికా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలతో కలిసి పని చేస్తామన్నారు. 'తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, రాబోయే రోజుల్లో ఆ దిశగా అడుగులు వేస్తాం. అమెరికా - తెలంగాణ మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు చొరవ చూపుతాం' అని స్టేట్ డిపార్ట్ మెంట్ మినిస్టర్ కౌన్సిలర్ పాల్ నరైన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కెప్టెన్ ఫ్రాంక్ ఒకటా(నేవీ), రెనో బామ్‌ఫోర్డ్(డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ), లెఫ్టినెంట్ కల్నల్ జాన్ కయాంగ్యాంగ్(ఆర్మీ), రెబెక్కా కింగ్(డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ), లెఫ్టినెంట్ కల్నల్ మైఖేల్ కూబ్(ఎయిర్ నేషనల్ గార్డ్), జోస్ సలాస్(డిఫెన్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఏజెన్సీ), టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ డైరెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ బిల్లులు దురుద్దేశపూరితమైనవి- కొన్ని రాష్ట్రాలకు అపారమైన నష్టం : కాంగ్రెస్

- పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో భాగంగా లోక్‌సభ ముందుకు మూడు ప్రధాన బిల్లులు
- ఈ బిల్లుల వల్ల పలు రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని కాంగ్రెస్ మండిపాటు
- వీటిపై ప్రతిపక్షానికి తీవ్రమైన ఆందోళనలు ఉన్నాయని వెల్లడి

**హైదరాబాద్, వెలుతురు ఏప్రిల్ 16 :** మహిళా రిజర్వేషన్లను అమల్లోకి తేవడానికి వీలుగా కేంద్రం తీసుకొస్తున్న మూడు బిల్లులపై కాంగ్రెస్ స్పందించింది. ఈ బిల్లులను మహిళా రిజర్వేషన్ల కోసం తీసుకున్న చర్యలుగా కేంద్రం చెబుతున్నప్పటికీ, వాటి అసలు ఉద్దేశం డీలిమిటేషన్‌పైనే ఉందని ఆరోపించింది. ఈ బిల్లులు రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య సమతుల్యతను గణనీయంగా మార్చగలవని విమర్శించింది. డీలిమిటేషన్ బిల్లుపై ప్రతిపక్షానికి తీవ్రమైన ఆందోళనలు ఉన్నాయని పేర్కొంది. ప్రస్తుత లోక్‌సభ సభ్యులలో మూడింట ఒక వంతు స్థానాలను ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన మహిళలకు రిజర్వ్ చేయాలని డిమాండ్ చేసింది. ఇది రాజ్యాంగ విలువలకు అనుగుణంగా ఉండే ప్రజాస్వామ్యయుతమైన విధానమని అభిప్రాయపడింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

**బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రాలకు అనుకూలంగా డీలిమిటేషన్ : జైరాం రమేశ్**
"లోక్‌సభలో మూడు బిల్లులు పరిశీలనకు రానున్నాయి. వాటిని మహిళా రిజర్వేషన్లనే కోసమే తీసుకొచ్చామని చెబుతున్నారు. కానీ వాటి అసలు ఉద్దేశం మాత్రం నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించినదే. ప్రస్తుతం బీజేపీ బలంగా ఉన్న కొన్ని అధిక జనాభా గల రాష్ట్రాలకు అనుకూలంగా ఉన్న ఈ పునర్విభజన ప్రతిపాదనలపై దేశవ్యాప్తంగా అనేక ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ బిల్లుతో లోక్‌సభలో పలు రాష్ట్రాల బలం తగ్గుతుంది. అసోం, జమ్ముకశ్మీర్‌లలో నియోజకవర్గాల పునర్విభజన జరిగిన తీరు, మోదీ-షా ద్వయం ఎంత ఘోరంగా పనిచేస్తుందో మనకు తెలియజేస్తుంది. ఈ బిల్లుల అసలు ఉద్దేశం దురుద్దేశపూరితమైనది. వాటిలోని అంశాలు మోసపూరితమైనవి. ఈ బిల్లుకు కలిగించే నష్టం అపారమైనది. వాటిని పూర్తిగా తిరస్కరించాలి. లోక్‌సభలోని ప్రస్తుత 543 స్థానాలలో మూడింట ఒక వంతు స్థానాలను మహిళలకు రిజర్వ్ చేయాలి. మహిళా రిజర్వేషన్ల బిల్లు పార్లమెంట్‌లోకి వచ్చినప్పుడు 2023లో ప్రతిపక్షం ఇదే వైఖరిని తీసుకుంది. ఇప్పుడు అంతే." అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

**ఈ బిల్లు దేశ రాజకీయ వ్యవస్థకు హానికరం, వినాశకరం : మనీశ్ తివారీ**
డీలిమిటేషన్ బిల్లును కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ తప్పుపట్టారు. ఈ బిల్లు దేశ రాజకీయ వ్యవస్థకు హానికరం, నష్టదాయకం, వినాశకరమని పేర్కొన్నారు. "నేను మహిళలకు 33 శాతం రిజర్వేషన్లకు మద్దతు ఇస్తున్నాను. ప్రమాదకరమైన ఈ నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకిస్తున్నాను. ఎందుకంటే దీని పర్యవసానాలు మన రాజకీయ వ్యవస్థకు హానిచేస్తాయి. అలాగే నష్టపరుస్తాయి. ప్రభుత్వ ప్రణాళిక లోక్‌సభలో ప్రాతినిధ్య సమతుల్యతను మార్చేస్తుంది. అని మనీశ్ తివారీ స్పష్టం చేశారు.

**బిల్లును వీగిపోయేలా చేస్తాం :** విపక్ష పార్టీలన్నీ మహిళా రిజర్వేషన్‌కు మద్దతు ఇస్తుండగా, మోదీ ప్రభుత్వం మాత్రం డీలిమిటేషన్ సవరణ బిల్లును తీసుకువస్తోందని టీఎంసీ ఎంపీ సాగరిక ఘోష్ మండిపడ్డారు. ఈ బిల్లు ప్రతిపక్షపాలిత రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించి, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సీట్లను పెంచుతుందని ఆరోపించారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు 2026కు వ్యతిరేకంగా ఓటేసి, ఈ బిల్లును వీగిపోయేలా చేస్తామన్నారు.

**కనిమొళి కీలక నిర్ణయం :** మరోవైపు, మహిళా రిజర్వేషన్ తక్షణ అమలు, నియోజకవర్గాల పునర్విభజన, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో అసెంబ్లీ సీట్ల పెంపునకు సంబంధించిన మూడు బిల్లులను కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో డీఎంకే ఎంపీ కనిమొళి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

# లోక్‌సభ ముందుకు మూడు బిల్లులు- వాడీవేడి చర్చ

**ఢిల్లీ, వెలుతురు ఏప్రిల్ 16 :** పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో భాగంగా లోక్‌సభ ముందుకు మూడు కీలక బిల్లులు వచ్చాయి. దేశంలో మహిళా రిజర్వేషన్లు అమలు చేసే దిశగా కేంద్రం తీసుకొచ్చిన మూడు కీలక బిల్లులపై లోక్ సభలో వాడీవేడి చర్చ జరిగింది. మొదట ఈ బిల్లులను సభలో ప్రవేశపెట్టడాన్ని విపక్షాలు వ్యతిరేకించాయి. మహిళా రిజర్వేషన్లను నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టడాన్ని తప్పుపట్టాయి. విపక్షాల వాదనను అధికార పక్షం తోసిపుచ్చింది. ఈ క్రమంలో రాజ్యాంగ సవరణ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో ప్రభుత్వానికి అనుకూలంగా మెజార్టీ వచ్చింది. అనంతరం 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చ నెలకొంది.

**నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ప్రవేశపెట్టిన మేఘ్వాల్**

మహిళా రిజర్వేషన్లకు సంబంధించి 131వ రాజ్యాంగ చట్ట సవరణ బిల్లును న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు. అనంతరం నియోజకవర్గాల పునర్విభజన బిల్లును కూడా ఆయన సభ ముందుకు తీసుకొచ్చారు. అంతకుముందు కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లును హోంమంత్రి అమిత్‌షా ప్రవేశపెట్టారు. "ఈ రోజు పార్లమెంటు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖితమైంది. 2023లోనే నారీశక్తి వందన్ అధినియం బిల్లును ఆమోదం పొందింది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లపై ఇప్పటికే పార్లమెంటు ఆమోదం పొందగా, ఇప్పుడు వాటిని అమలు చేయాల్సిన సమయం వచ్చింది. కొన్ని బిల్లులను భావితరాలు మరువలేవు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 368 (2) ప్రకారం ప్రజాహిత నిర్ణయాలు తీసుకోవచ్చు. ఆర్టికల్ 368 ద్వారా ప్రజాహిత నిర్ణయాలకు పార్లమెంటుకు రాజ్యాంగం శక్తి ఇచ్చింది. ఈ క్రమంలోనే మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టాం. బిల్లు ద్వారా మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుంది. మహిళలకు సామాజిక న్యాయం కోసం కేంద్రం అనేక పథకాలు తెచ్చింది. మహిళలకు శౌచాలయాలు, ఉజ్వల యోజన అమలు చేశాం. ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక న్యాయం జరగాల్సిందే. మహిళలకు జన్‌ధన్ ఖాతాలు, పీఎం ముద్రా యోజన అమలు చేశాం. సుకన్య సమృద్ధి యోజన, లఖ్‌పతీ దీదీ వంటి పథకాలు అమలు చేశాం. స్వయం సహాయక సంఘాల మహిళలకు చేయూత నిచ్చాం."

**131వ రాజ్యాంగ సవరణ బిల్లును వ్యతిరేకించిన పలు పార్టీలు :** అయితే 131వ రాజ్యాంగ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టడాన్ని విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, టీఎంసీ, కేరళ రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ, MIM, CPI, ఇతర విపక్షాలు బిల్లును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ బిల్లు ద్వారా ప్రభుత్వం బుల్డోజ్ చేస్తోందని మండిపడ్డాయి. "అప్రజాస్వామిక బిల్లును ఉపసంహరించుకోవాలి. జనాభా గణనపై ప్రభుత్వం ఎందుకు ఆసక్తి చూపట్లేదు? కేంద్రం ఉద్దేశపూర్వకంగా ముస్లింలను మినహాయిస్తోంది. మూడు బిల్లులను కేంద్రం ఉపసంహరించుకోవాలి." అని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ డిమాండ్ చేశారు.

**విపక్షాల ఆరోపణలకు అమిత్ షా కౌంటర్ :** ఈ క్రమంలోనే విపక్షాల ఆరోపణలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. ప్రజల్లో ఆందోళన కలిగించేలా విపక్షాల వ్యాఖ్యలున్నాయని ఆయన మండిపడ్డారు. జనగణన ఎందుకు చేపట్టలేదని విపక్షాలు చెప్పడం సరికాదన్న ఆయన, ఆ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం అయ్యిందని వివరించారు.

ప్రస్తుతం ఇళ్ల గణన జరుగుతోందని, ఇళ్లకు ఎలాంటి జాతి ఉండదని పేర్కొన్నారు. వ్యక్తుల గణన సమయంలో జాతి ప్రస్తావన ఉంటుందని స్పష్టం చేశారు.

**మూడు బిల్లులపై శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఓటింగ్ :**

అనంతరం రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలా వద్దా అనే అంశంపై విపక్షాలు డివిజన్ కోరాయి. ఆ మేరకు జరిగిన ఓటింగ్‌లో బిల్లు ప్రవేశపెట్టడానికి అనుకూలంగా 251 మంది ఓటు వేశారు. బిల్లు ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ 185 మంది సభ్యులు ఓటేశారు. ఫలితంగా విపక్షాల డివిజన్ వీగిపోయింది. రాజ్యాంగ సవరణ బిల్లుతో కలిపి రెండు సాధారణ బిల్లులను తీసుకురావడాన్ని కాంగ్రెస్ తప్పుపట్టగా ప్రభుత్వం ఆ వాదనని తోసిపుచ్చింది. అనంతరం 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై స్పీకర్ చర్చకు అనుమతిచ్చారు. ఓటింగ్‌కు ముందు బిల్లులపై సుదీర్ఘ చర్చ జరుగుతుందని లోక్‌సభ స్పీకర్ వెల్లడించారు. బిల్లులపై సభ్యులు ఎన్ని గంటలు కోరినా చర్చ జరపవచ్చని, సభలో సభ్యులందరికీ సమయం ఇస్తామని చెప్పారు. ఈ మూడు బిల్లులపై శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఓటింగ్ జరుగుతుందని తెలిపారు.

# కేరళలో లోక్ సభ స్థానాలను తగ్గించమని రేవంత్ రెడ్డి కోరాలి: రాంచందర్ రావు

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 16:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సవాల్ విసిరారు. కేరళలో 20 లోక్ సభ స్థానాలు ఉంటే, తెలంగాణలో 17 మాత్రమే ఉన్నాయని గుర్తు చేశారు. మొదట కేరళలో లోక్ సభ సీట్లను తగ్గించాలని రేవంత్ రెడ్డి అడగాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలకు తక్కువ సీట్లు ఇచ్చారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌లు అమలు చేయాలని, డీలిమిటేషన్ చేపట్టాలని లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ కొత్త పార్లమెంటు భవనంలోనే కోరారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు వారే వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు. 543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ ఇప్పుడు కోరడం విడ్డూరంగా ఉందని అన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల జనాభా తగ్గిందని, ఉత్తరాదిన పాటించలేదని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి వింత వాదన చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుతో ఎవరికీ నష్టం లేదు, మహిళలకు 272 సీట్లు లభిస్తాయి: కేంద్రమంత్రి

మహిళా రిజర్వేషన్ బిల్లుతో ఎవరికీ నష్టం జరగదని, ఈ బిల్లు ద్వారా లోక్ సభలో మహిళలకు 272 సీట్లు లభిస్తాయని కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్ వాల్ తెలిపారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు వీలుగా కేంద్రం మూడు బిల్లులను లోక్ సభలో ప్రవేశపెట్టింది. అనంతరం వీటిపై చర్చ ప్రారంభించారు. అర్జున్ రామ్ మేఘ్ వాల్ మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ల అమలుతో ఏ రాష్ట్రానికి లేదా ఏ పురుషుడికి నష్టం జరగబోదని స్పష్టం చేశారు. పార్లమెంటు చరిత్రలో ఇది సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు అన్నారు. మహిళా రిజర్వేషన్లను అమలు చేయాల్సిన సమయం వచ్చిందని ఆయన వ్యాఖ్యానించారు. కొన్ని బిల్లులను భవిష్యత్తు తరాలు మరవలేవని, అందులో ఈ బిల్లు ఉంటుందని అన్నారు. ఆర్టికల్ 368 ద్వారా ప్రజలకు ఉపయోగకరమైన నిర్ణయాలు తీసుకోవడానికి పార్లమెంటుకు రాజ్యాంగం శక్తిని ఇచ్చిందని అన్నారు. అందులో భాగంగానే మూడు బిల్లులను ప్రవేశపెట్టామని తెలిపారు. లోక్ సభ స్థానాలను 50 శాతం పెంచేలా నిర్ణయం తీసుకున్నామని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో పార్లమెంటులో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుందని అన్నారు. లోక్ సభ స్థానాలు 815కు పెరుగుతాయని, అప్పుడు మహిళలకు 272 స్థానాలు వస్తాయని అన్నారు. మహిళల కోటాలోనే ఎస్సీ, ఎస్టీలకు ఉపకోటా లభిస్తుందని తెలిపారు.

# ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య కాల్పుల విరమణ.. ప్రకటించిన ట్రంప్

**అమెరికా వెలుతురు ఏప్రిల్ 16 :** ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య 10 రోజుల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ప్రకటించారు. ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరు దేశాల సరిహద్దుల్లో పెరిగిన ఘర్షణలను తాత్కాలికంగా చల్లార్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. వాషింగ్టన్ కాలమానం ప్రకారం గురువారం సాయంత్రం 5 గంటల నుంచి ఈ ఒప్పందం అమల్లోకి వచ్చింది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ అవున్‌లతో తాను మాట్లాడిన తర్వాతే ఈ అంగీకారం కుదిరిందని ఆయన వివరించారు. ఇరాన్ మద్దతున్న హెజ్బొల్లా మిలిటెంట్ సంస్థను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులు తీవ్రతరం చేయడంతో లెబనాన్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి.

ఈ కాల్పుల విరమణతో ఇజ్రాయెల్ తన దాడులను నిలిపివేయనుంది. లెబనాన్ నుంచి హెజ్బొల్లా కూడా దాడులు జరపకుండా సంయమనం పాటిస్తేనే ఈ ఒప్పందం నిలబడుతుంది. ఈ ఒప్పందానికి ముందు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, లెబనాన్ రాయబారులు వాషింగ్టన్‌లో సమావేశమయ్యారు. 1980ల తర్వాత ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష చర్చలు జరగడం ఇదే తొలిసారి. లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇప్పటివరకు 2,000 మందికి పైగా మరణించగా, పది లక్షల మందికి పైగా నిరాశ్రయులయ్యారు. కాగా, దక్షిణ లెబనాన్‌లో ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక దళంలో 642 మంది భారత సైనికులు కూడా సేవలందిస్తున్నారు. ఈ కాల్పుల విరమణను ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ స్వాగతించారు. ఇరు దేశాల మధ్య శాశ్వత శాంతి కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# 40ఏళ్లుగా ఇజ్రాయెల్ యుద్ధం కోసం ప్రయత్నిస్తోంది- ఇప్పుడు అమెరికాను ఒప్పించగలిగింది: ఇరాన్

**ఢిల్లీ, వెలుతురు ఏప్రిల్ 16 :** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలపై ఇరాన్ సుప్రీం లీడర్ భారత ప్రతినిధి డా. అబ్దుల్ మజీద్ హకీమ్ ఇలాహీ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పరిస్థితిని వ్యక్తిగత యుద్ధంగా అభివర్ణిస్తూ, ఇజ్రాయెల్ నాయకత్వం చాలా కాలంగా ఇరాన్‌పై సైనిక చర్యలకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బుధవారం జైపుర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ దశాబ్దాలుగా ఇరాన్‌పై యుద్ధాన్ని ప్రారంభించాలని కోరుకున్నారని తెలిపారు.

**వ్యక్తిగత యుద్ధంగా భావిస్తున్నాం!**

'ఇజ్రాయెల్ ప్రధాని గత 40 ఏళ్లుగా ఇరాన్‌పై యుద్ధాన్ని ప్రారంభించాలనే ఆలోచనతో ఉన్నారు. అయితే గతంలో అమెరికా అధ్యక్షులను ఒప్పించలేకపోయారు.

ఈసారి మాత్రం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఒప్పించగలిగారు. అందుకే ఈ యుద్ధాన్ని వ్యక్తిగత యుద్ధంగా మేము భావిస్తున్నాం' అని ఇలాహీ వ్యాఖ్యానించారు.

**40 రోజుల్లో వారు ఏ లక్ష్యాన్నీ సాధించలేకపోయారు!**

ప్రస్తుత ఘర్షణలో అమెరికాఉఇజ్రాయెల్ కూటమి వ్యవహారశైలిపై కూడా ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రారంభం నుంచే చర్చలపై వారు నిజాయితీగా లేరని ఇరాన్ భావించిందని చెప్పారు. "వారు చర్చలకు సీరియస్‌గా లేరని మేము మొదటి నుంచే చెప్పాము. మా దేశంపై దాడులు చేశారు. పౌరులను చంపారు. ఇళ్లు, ఆస్పత్రులు, విశ్వవిద్యాలయాలు వంటి ప్రజా వనరులను ధ్వంసం చేశారు. కానీ 40 రోజుల్లో వారు ఏ లక్ష్యాన్నీ సాధించలేకపోయారు" అని అన్నారు. యుద్ధం ద్వారా సాధించలేని లక్ష్యాలను చర్చల ద్వారా సాధించాలనే ప్రయత్నం జరుగుతోందని కూడా ఇలాహీ పేర్కొన్నారు. 'యుద్ధంతో సాధించలేనిదాన్ని చర్చల ద్వారా సాధించాలని వారు ప్రయత్నించారు. కానీ అది కూడా సాధ్యం కాదని వారికి అర్థమైంది. వారు ప్రతి విషయాన్ని వ్యాపారంలా చూస్తున్నారు' అని విమర్శించారు.

**భారత్– ఇరాన్ సంబంధాలు మరింత లోతుగా!**

ఇక భారత్– ఇరాన్ సంబంధాలపై కూడా ఆయన సానుకూల వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాల మధ్య వేల ఏళ్ల చరిత్ర, సాంస్కృతిక అనుబంధం ఉందని గుర్తుచేశారు. 'భారత్‌తో మా సంబంధాలు 5,000 సంవత్సరాల సాంస్కృతిక, విద్యా, తత్వశాస్త్ర సంబంధాలపై ఆధారపడి ఉన్నాయి. ఇది సాధారణ దౌత్య సంబంధం కాదు, నాగరికతల మధ్య బంధం. ఈ యుద్ధం తర్వాత భారత్‌ఉ ఇరాన్ సంబంధాలు మరింత బలపడతాయి, మరింత లోతుగా మారతాయి' అని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. ఒకవైపు సైనిక చర్యలు జరుగుతుండగా, మరోవైపు గోప్య చర్చలు కూడా సాగుతున్నట్లు సమాచారం. అంతర్జాతీయ వర్గాలు పరిస్థితిని శాంతియుతంగా పరిష్కరించాలని పిలుపునిస్తున్నాయి. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాఘర్ ఖలీబాఫ్ కూడా ఈ పరిణామాలపై స్పందించారు. లెబనాన్‌లో పూర్తి కాల్పుల విరమణ సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. హిజ్బుల్లా పోరాటం, ప్రతిఘటన శక్తుల ఐక్యత కారణంగా ఈ పరిస్థితి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

**ఇది ఒక తప్పు నిర్ణయం!**

'లెబనాన్‌లో సమగ్ర కాల్పుల విరమణ స్థిరపడటానికి ప్రతిఘటన శక్తుల పట్టుదల కీలకం. యుద్ధంలో కానీ, కాల్పుల విరమణలో కానీ ఇరాన్ మరియు ప్రతిఘటన శక్తులు ఒకటే' అని ఖలీబాఫ్ వ్యాఖ్యానించారు. అమెరికాపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. 'ఇజ్రాయెల్‌కు ప్రాధాన్యం ఇచ్చే విధానాన్ని అమెరికా విడిచిపెట్టాలి. ఇది ఒక తప్పు నిర్ణయం' అని హెచ్చరించారు. మొత్తంగా, పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు తగ్గే సూచనలు కనిపించకపోయినా, దౌత్యపరమైన ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ ప్రతినిధుల వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారాయి.

# 'అమెరికా నౌకలను హార్మూజ్‌లోనే ముంచేస్తాం- ఓడరేవులను ముట్టడిస్తే ఖబడ్దార్'

- ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్
- హార్మూజ్‌లో పోలీస్‌గా మారేందుకు ట్రంప్ యత్నం
- మా ఓడరేవులను ముట్టడిస్తే తీవ్ర పర్యవసానాలు
- మాపై భూతల దండయాత్ర చేస్తే మరీ మంచిది
- అమెరికన్ సైనికులను బంధించి బిలియన్ల వసూలు చేస్తామన్న ఇరాన్

**అమెరికా వెలుతురు ఏప్రిల్ 16 :** ఒకవేళ హార్మూజ్ జలసంధికి పహారా ఇవ్వాలని అమెరికా డిసైడ్ అయితే, ఆ దేశపు నౌకలను హార్మూజ్‌లోనే ముంచేస్తామని ఇరాన్ సుప్రీం లీడర్ ముజ్తబా ఖమేనీ సైనిక సలహాదారు మొహ్సిన్ రజా యీ హెచ్చరించారు. హార్మూజ్ మార్గంలో పోలీస్‌గా మారాలని ట్రంప్ భావిస్తున్నారని, అమెరికా ప్రెసిడె ంట్ చేయాల్సిన పని ఇదేనా అని ఆయన ప్రశ్నించారు. అమెరికా లాంటి శక్తివంతమైన సైన్యం చేసే పని ఇదేనా అని మొహ్సిన్ రజాయీ పేర్కొన్నారు. అమెరికా నౌకలు హార్మూజ్‌లోకి ప్రవేశించగానే వాటిని తమ మిస్సైళ్లు ముంచేస్తాయన్నారు. దీంతోపాటు గల్ఫ్‌లో అమెరికా సైన్యం తీవ్ర ముప్పును ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. కచ్చితంగా అమెరికా నౌకలను ధ్వంసం చేసే శక్తిసామర్థ్యాలు ఇరాన్ మిస్సైళ్లకు ఉన్నాయని తేల్చి చెప్పారు. సైనిక యూనిఫాంలో ఇరాన్ ప్రభుత్వ టీవీ ఛానల్‌తో మాట్లాడుతూ మొహ్సిన్ రజాయీ ఈ వ్యాఖ్యలు చేశారు.

**మాపై భూతల దండయాత్ర చేస్తే మరీ మంచిది**

"ఒకవేళ ఇరాన్‌పై అమెరికా భూతల దండయాత్రను మొదలుపెడితే, అది మరీ మంచి విషయం. ఎందుకంటే మేం వేలాది మంది అమెరికన్ సైనికులను బందీలుగా చేసుకుంటాం. అనంతరం ఒక్కో అమెరికన్ సైనికుడిని విడుదల చేయడానికి బిలియన్ల కొద్దీ డాలర్లను అమెరికా నుంచి వసూలు చేస్తాం. నేనైతే అమెరికాతో కాల్పుల విరమణను పొడిగించడానికి అస్సలు అనుకూలంగా లేను. అయితే ఇది నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే" అని మొహ్సిన్ రజాయీ వ్యాఖ్యానించారు.

**అతివాది మొహ్సిన్ రజాయీ**

ప్రస్తుతం ఇరాన్ సుప్రీం లీడర్ ముజ్తబా ఖమేనీకి సైనిక సలహాదారుగా వ్యవహరిస్తున్న మొహ్సిన్ రజాయీపై అతివాది అనే ముద్ర ఉంది. 1981 నుంచి 1997 వరకు ఆయన ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్‌కు సారథిగా వ్యవహరించారు.

అయతుల్లా అలీ ఖమేనీ కుటుంబంతోనూ మొహ్సిన్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అందుకే ఆయన్ను తన సలహాదారుగా ముజ్తబా నియమించుకున్నట్లు సమాచారం.

**తీవ్ర పర్యవసానాలుంటాయ్– ఓడరేవులను అమెరికా ముట్టడిస్తే ఖబడ్దార్ :**

తమ ఓడరేవులను ముట్టడించే కవ్వింపు చర్యకు పాల్పడుతున్నందుకు అమెరికా తీవ్ర పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చి హెచ్చరించారు. తాజాగా చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో టెలిఫోన్ సంభాషణలో ఈవిషయాన్ని ఆయన తెలిపారు. హార్మూజ్ జలసంధి మార్గం, పర్షియన్ గల్ఫ్‌లలో అమెరికా చేస్తున్న చర్యల వల్ల ఇప్పటికే సున్నితంగా ఉన్న పరిస్థితులు మరింత సమస్యాత్మకంగా మారే ముప్పు ఉందన్నారు. హార్మూజ్‌ను తెరిపించడంపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో అమెరికా ప్రతిపాదించిన తీర్మానం అహేతుకమైంది, ఏకపక్షమైందని అరాగ్చి స్పష్టం చేశారు. ఈ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేసినందుకు చైనా, రష్యాలను ఆయన కొనియాడారు. ఆ రెండు దేశాల వైఖరి పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు మరింత పెరగకుండా అడ్డుకుందన్నారు. ఈమేరకు వివరాలతో ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ బ్రాడ్‌కాస్టింగ్ (ఐఆర్ఐబీ) ఓ కథనాన్ని ప్రచురించింది.


**ఇరాన్ ప్రతిఘటనను కొనియాడిన చైనా**

ఐఆర్ఐబీ కథనం ప్రకారం, అమెరికా–ఇజ్రాయెల్‌లతో పోరాటంలో ఇరాన్ చూపిన సైనిక ప్రతిఘటనను, ఆత్మ విశ్వాసాన్ని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ కొనియాడారు. పశ్చిమాసియాలోని ఈ సైనిక ఉద్రిక్తతలను తగ్గించడానికి దౌత్యపరమైన సాయం చేసేందుకు చైనా సదా సిద్ధంగా ఉంటుందని ఆయన తెలిపారు.

ఇక మరో ఫోన్ కాల్‌లో జపాన్ విదేశాంగ మంత్రి తొషిమిత్సు మొతేగీతోనూ అబ్బాస్ అరాగ్చి సంభాషించారు. ప్రాంతీయ, ద్వైపాక్షిక అంశాలపై వారు చర్చించారు. పశ్చిమాసియా సైనిక ఉద్రిక్తతలతో ముడిపడిన భద్రతాపరమైన, ఆర్థికపరమైన పర్యవసానాలపై డిస్కస్ చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ దుందుడుకు వైఖరి వల్లే ఈ సైనిక ఉద్రిక్తతకు బీజాలు పడ్డాయని, వాటి వల్లే యుద్ధం మొదలైందని జపాన్ విదేశాంగ మంత్రికి అరాగ్చి తెలిపారు.

ఈ ఉద్రిక్తతలను తగ్గించడానికి అన్ని ప్రపంచ దేశాలు బాధ్యతాయుత వైఖరితో నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ ఉద్రిక్తతలను తగ్గించే దౌత్యంలో భాగం కావడానికి జపాన్ సిద్ధంగా ఉందని అరాగ్చికి తొషిమిత్సు మొతేగీ తెలిపారు.

కాగా, ఇరాన్ ఓడరేవులకు రాకపోకలను పూర్తిగా ఆపడంలో కేవలం 36 గంటల్లోనే తాము సఫలమయ్యామని పేర్కొంటూ బుధవారం రోజు అమెరికా ఆర్మీ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈనేపథ్యంలో ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చితో జపాన్, చైనా విదేశాంగ మంత్రుల సంభాషణ ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.



PONNAM PRABHAKAR
M.A., LL.B.
Minister for Transport, BC Welfare,
Government of Telangana

Off : Dr. B. R. Ambedkar Telangana State Secretariat, Room No. 27, 5th Floor, Hyd-22.,
Ph : 040-23459924/25
E-mail : transportministerpeshi@gmail.com
Res : Quarter No.5, Ministers Quarters, Road No.12, Banjara Hills, Hyd-34.,
Ph: 040-29553983

Lr.No. /M(T&BCW)/JN/2026, Date:16.04.2026

I wish to bring to your notice and place on record my strong objection to the remarks made by Hon'ble Member of Parliament, Tejasvi Surya, during the recent proceedings of Parliament.

During his intervention, the Hon'ble Member drew a comparison between the bifurcation of Telangana and Andhra Pradesh and the partition of India and Pakistan. This analogy is not only factually untenable but also deeply insensitive and inappropriate in the context of parliamentary discourse.

The formation of Telangana was the outcome of a democratic and constitutional process, reflecting the legitimate aspirations of its people. Equating this with the traumatic and violent Partition of India diminishes the sanctity of that process and disregards the sentiments of the people of Telangana.

Such statements have the potential to disturb public harmony, foster regional discord and misrepresent historical and constitutional realities. They also fall short of the standards of responsibility and decorum expected from public representatives.

In view of the above, I request your office to examine the matter and take appropriate action as deemed fit under the relevant provisions of law to prevent the spread of misinformation and to maintain public order and harmony.

(PONNAM PRABHAKAR)

To
The Director General of Police,
Government of Telangana,
Hyderabad

# డీజీపీ శివధర్ రెడ్డికి లేఖ రాసిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 16:** పార్లమెంట్ లో తెలంగాణ విభజన పై భారత్ పాకిస్థాన్ తో పోల్చుతూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య పై చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్న మంత్రి పొన్నం ప్రభాకర్.. తెలంగాణ ఏర్పాటు అనేది ఇక్కడి ప్రజల న్యాయమైన ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ, ఒక ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ ఫలితంగా జరిగింది. దీనిని భారతదేశపు బాధాకరమైన, హింసాత్మక విభజనతో పోల్చడం ఆ ప్రక్రియ యొక్క పవిత్రతను తగ్గించడమే కాక, తెలంగాణ ప్రజల మనోభావాలను విస్మరించినట్లు అవుతుందన్న మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటువంటి ప్రకటనలు ప్రజా సామరస్యాన్ని దెబ్బ తీయడానికి, ప్రాంతీయ కలహాలను పెంచడానికి, చారిత్రక మరియు రాజ్యాంగ వాస్తవాలను వక్రీకరించడానికి అవకాశం ఉందన్న మంత్రి పొన్నం ప్రభాకర్ తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి మరియు ప్రజా శాంతి, సామరస్యాలను కాపాడటానికి, ఈ విషయాన్ని పరిశీలించి, చట్టంలోని సంబంధిత నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డీజీపీ నీ కోరిన మంత్రి పొన్నం ప్రభాకర్.

# మాదిగ జాతి కోసం ప్రాణాలర్పించడానికి సిద్ధం





- రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ని అండగా 'మాదిగ మహా శక్తి'
- 10శాతం కమిషన్ తీసుకునే మంత్రి సంగతి తేల్చండి
- మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు

**హైదరాబాద్, వెలుతురు ఏప్రిల్ 16 :** మాదిగ సామాజిక వర్గం అభ్యున్నతికి అలుపెరగని పోరాటం చేస్తున్న తన మీద హత్య ప్రయత్నం జరిగిందని, మాదిగ జాతి కోసం ప్రాణం త్యాగం చేసేందుకు తాను సంసిద్ధంగా ఉన్నానని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు త్రివ స్వరంతో వ్యాఖ్యానించారు. మాదిగ జాతి ఓట్లు మాదిగ నాయకులకు వేసినప్పుడే మాదిగ జాతి సమగ్ర అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా మాదిగ జాతి ప్రజలు అగ్రవర్ణాలకు ఓటు బ్యాంకుగా మారిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా మాదిగ జాతి ఓటును సక్రమంగా వినియోగించుకుని రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని మోత్కుపల్లి పిలుపునిచ్చారు. మాదిగ మహా శక్తి అనే చైతన్య సంస్థను నెలకొల్పారు మోత్కుపల్లి. మాదిగ మహాశక్తి జెండా ముందు మిగిలిన రాజకీయ జెండాలు మట్టికరవాలని అన్నారు. మాదిగ మహాశక్తి జెండాలోని మూడు రంగులు కష్టాలకు, తిరుగుబాటుకు, ప్రేమకు చిహ్నాలని మోత్కుపల్లి తెలిపారు. జెండాలోని నీలం రంగు కన్నీళ్లు, కష్టాలకు గుర్తులని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కూడా ఇదే నీలి రంగును ఎంచుకుని చరిత్ర సృష్టించారని అన్నారు. ఇక పసుపు రంగు మాదిగ జాతికి చిరునామా అని, పసుపు రంగు తంగేడుపువ్వులా పవిత్రతకు, శుభాలకు గుర్తుగా ఉంటుందన్నారు. ఎరుపు రంగు విప్లవానికి, పరాక్రమానికి, పోరాటాలని చిహ్నమని, దశాబ్దాలుగా మాదిగ జాతి చేస్తుంది. అదే పోరాటమని మోత్కుపల్లి గుర్తు చేసారు. మూడు అద్భుత సందేశాలిచ్చే మాదిగ మహాశక్తి జెండా తెలంగాణలో ప్రతీ మాదిగ సోదరుడి ఇంటి మీద రెపరెపలాడాలని మోత్కుపల్లి పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల ప్రకారం 28 మంది మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు శాసనసభకు పోటీ చేయాల్సిందేనని, ముగ్గురు మాదిగ అభ్యర్థులు లోక్ సభకు పోటీ చేసి తీరాల్సిందేనని మోత్కుపల్లి అన్నారు. మాదిగ ప్రజల ఓట్లు మాదిగ నాయకులకే వేస్తే రాజ్యాధికారం తప్పకుండా సిద్ధిస్తుందని పేర్కొన్నారు. మాదిగ జాతిని గౌరవించి సముచిత స్థానం కల్పించిన రాజకీయ పార్టీలతోనే కలిసి నడుస్తామన్నారు. మాదిగ, మాలలకు సమాన హక్కులను స్వర్గీయ ఎన్టీఆర్ కల్పించారన్నారు. మాల, మాదిగ ఇద్దరూ ఎన్నికల పోటీలో ఉంటే మాదిగ జాతి ప్రజలు మాదిగ అభ్యర్థికే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. నాగర్ కర్నూల్ లోక్ సభ ఎన్నికల్లో మల్లు రవికి మాదిగలందరూ ఓటు వేస్తేనే గెలిచారని గుర్తు చేశారు. చుండూరు ఊచకోతకు బలైన మాలల తరుపున పోరాడి, ఏడు రోజులు శాసన సభను స్థంభింప చేసానని, మాలలకు న్యాయం జరగకపోతే ఆమరణ నిరాహరణ దీక్ష చేస్తానని ఆనాడు ప్రభుత్వాన్ని హెచ్చరించానన్నారు. చుండూరు బాధితులకు న్యాయం జరగాలని ఆనాడు ఉమ్మడి రాష్ట్రం మొత్తం పర్యటించానని గుర్తుచేశారు. ఐనప్పటికీ భట్టి విక్రమార్క గానీ, వివేక్ వెంకటస్వామి గానీ, మల్లు రవి గానీ ఎవ్వరూ తనకు సంఘీభావం తెలపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కమ్మ, రెడ్డి, వెలమ సామాజిక వర్గాలు చాలా వృద్ధిలోకి వచ్చాయని, మాదిగ జాతిలో కూడా చైతన్యం రావాల్సి ఉందన్నారు. రేవంత్ రెడ్డి తాను తెలుగు దేశం పార్టీలో కలిసి పనిచేసామని, కానీ రేవంత్ రెడ్డి అవకాశాలను అందిపుచ్చుకుని సీఎం అయ్యాడని, చిన్న కులంలో పుట్టిన తాను వెనకబడి పోయానని ఆందోళన వ్యక్తం చేశారు. ఐనప్పటికి వెకడుగు వేసేది లేదని, మాదిగ జాతిలో చైతన్యం వస్తే రాజ్యాధికారం తప్పదన్నారు. పవన్ కళ్యాణ్ చూసి కాపు సామాజిక వర్గం ఏకం ఐనట్టు మాదిగ మహాశక్తి ద్వారా మాదిగలందరూ ఏకం కావాలన్నారు. ప్రతి గ్రామంలో, ప్రతి మాదిగ ఇంటి మీద మాదిగ మహాశక్తి జెండా ఎగరాలన్నారు. మాదిగ జాతి ఇకనైనా ఐక్యంగా పోరాడాలని, మాదిగ జాతికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని అన్నారు. ఈ సమావేశంలో మాదిగ మహా శక్తి నాయకులు ముజ్జగుండ్ల విజయ్ కుమార్, డా.ప్రసాద్ సగరపు, అనిల్, సత్యనందం పాల్గొన్నారు.

సంపాదకీయం..

# పగ అనే జైలు నుండి మనసును విడిపించడం ఎలా?



నేటి వేగవంతమైన సమాజంలో, మానవ సంబంధాలు కేవలం వాట్సాప్ స్టేటస్‌లకే పరిమితమవుతున్న కాలంలో, ఒక పాత మానసిక రోగం మళ్ళీ తన వికృత రూపాన్ని ప్రదర్శిస్తోంది అదే పగ తెలుగు నేల మీద పగకు ఒక సుదీర్ఘ చరిత్ర ఉంది. మన పురాణాల్లో హిరణ్యకశిపుడి నుండి మొదలుకొని, పల్నాటి యుద్ధం వరకు, ఫ్యాక్షన్ సినిమాల వరకు పగ తీర్చుకోవడాన్ని ఒక వీరత్వంగా, ఒక పౌరుషంగా చిత్రించడం చూస్తూనే ఉన్నాం. కానీ, ఆనాటి సామాజిక స్థితిగతులు వేరు, నేటి వాస్తవాలు వేరు. పగ అనేది ఒక వ్యక్తిని లోపల లోపల తినేస్తున్న సజీవమైన నిప్పు వంటిది. దాన్ని పెంచుకునేవారికి తెలియకుండానే అది వారి హృదయాన్ని, ఆరోగ్యాన్ని, పవిత్రమైన సంబంధాలను, ఉజ్వలమైన భవిష్యత్తును బూడిద చేస్తోంది. సాధారణంగా ఎవరైనా మనకు హాని చేసినప్పుడు లేదా అవమానపరిచినప్పుడు కలిగే తాత్కాలిక కోపం వేరు. కానీ ఆ కోపం మనసు పొరల్లో పేరుకుపోయి, ప్రతికారం కోసం నిరంతరం పరితపించడాన్నే పగ అంటాం. ఈ పగను ఒక సంస్కృతి గా మార్చడం అంటే అది వ్యక్తిగత భావోద్వేగం స్థాయి దాటి, సమాజంలో ఒక ఆమోదయోగ్యమైన ప్రవర్తనగా చలామణి అవ్వడం.దెబ్బకు దెబ్బ తీర్చుకోకపోతే వాడు మగాడే కాదు,వంశ గౌరవం కోసం పగ తీర్చుకోవాల్సిందే అన్న అశాస్త్రీయమైన మాటలు నేటికీ మన సమాజంలో వినబడటం ఆందోళనకరం. పగ అనేది మనిషిలోని విచక్షణను చంపేస్తుంది. ఎదుటివాడిని నాశనం చేయాలనే తపనలో, తన చుట్టూ ఉన్న అందమైన ప్రపంచాన్ని పగవాడు కోల్పోతున్నాడు. ఒకప్పుడు పగ అంటే కత్తులు, కటార్లు లేదా భౌతిక దాడులు. కానీ సోషల్ మీడియా యుగంలో పగ సరికొత్త సైబర్ ముసుగు వేసుకుంది. ఒక వ్యక్తిని సామాజికంగా సమాధి చేయడానికి ఇప్పుడు ఒక స్క్రీన్‌షాట్ లేదా ఎడిట్ చేసిన వీడియో సరిపోతుంది. సైబర్ బుల్లీయింగ్, ఆన్‌లైన్ హరాస్‌మెంట్, ట్రోలింగ్ ఇవన్నీ నేటి పగ సంస్కృతి యొక్క ఆధునిక వికృత ముఖాలే. ముఖ్యంగా రివెంజ్ పోర్న్ అనే మాట ఈ పగ సంస్కృతిలో ఒక అత్యంత హేయమైన అధ్యాయం. ఎవరో ఒక వ్యక్తిపై ఉన్న కోపాన్ని లేదా విఫలమైన ప్రేమను ఆసరాగా చేసుకుని, యువతుల వ్యక్తిగత జీవితాలను సోషల్ మీడియాలో రచ్చ చేయడం ఏ రకమైన పౌరుషం? ఇది పగ కాదు, అత్యంత పిరికిపంద చర్య.పగకు ఇంధనం పోయడం అంటే శత్రువును కాల్చడం కాదు, మనల్ని మనమే కాల్చుకోవడం. ఎందుకంటే మనం మోస్తున్న ఆ నిప్పు మన అరచేతిలోనే ఉంటుంది. పగ అనేది ఒక రాత్రిలో పుట్టే మొలక కాదు. అది చిన్నతనం నుండి మనం వినే మాటల్లో, చూసే దృశ్యాల్లో పెరుగుతుంది.

నీవు పుట్టిందే ఆ పగ తీర్చుకోవడానికి అని తల్లులు చెప్పే డైలాగులు సినిమాలో చూడ్డానికి బాగుండొచ్చు కానీ, నిజ జీవితంలో అవి యువతను నేరస్థులుగా మారుస్తున్నాయి. కుటుంబ తగాదాలు, పొరుగువారిపై ఈర్ష్య, రాజకీయ విభేదాలు ఇవన్నీ పిల్లల మనసుల్లో ద్వేషాన్ని నూరిపోస్తున్నాయి.తెలుగు సినిమా పగ సంస్కృతిని గ్లామరైజ్ చేయడంలో తన వంతు పాత్ర పోషించింది. ప్రతీకారం తీర్చుకున్న హీరోను విజేతగా చూపించడం వల్ల, యువత పగను ఒక సానుకూల అంశంగా భావిస్తున్నారు. కానీ తెరపై కనిపించే ఆ ప్రతీకార నాటకాలు రెండు గంటల వినోదం మాత్రమే; వాస్తవ జీవితంలో పగ పెంచుకోవడం అంటే రెండు దశాబ్దాల విషాన్ని సేవించడమే.

2023-24 క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (NCRB) గణాంకాలు పరిశీలిస్తే, భారతదేశంలో జరుగుతున్న హత్యలలో దాదాపు 30% కంటే ఎక్కువ వ్యక్తిగత పగలు, కుటుంబ వివాదాల వల్లనే జరుగుతున్నాయి. ఈ అంకెలు మన నాగరికతకు పట్టిన తుప్పును సూచిస్తున్నాయి. శాస్త్రీయంగా చూస్తే, పగ అనేది దీర్ఘకాలిక ఒత్తిడి (Chronic Stress)కి ప్రధాన కారణం. మనం ఎవరి మీదైనా ద్వేషం పెంచుకున్నప్పుడు మన శరీరంలో కార్టిసాల్ (Cortisol) అనే హార్మోన్ స్థాయిలు విపరీతంగా పెరుగుతాయి. దీనివల్ల రక్తపోటు (BP) గుండె వేగం పెరిగి దీర్ఘకాలిక సమస్యలు వస్తాయి. ప్రతీకార ఆలోచనలు మనిషికి ప్రశాంతమైన నిద్రను దూరం చేస్తాయి. మానసిక అశాంతి శరీర సహజ రక్షణ వ్యవస్థను దెబ్బతీస్తుంది.మీ శత్రువు హాయిగా నిద్రపోతుండవచ్చు, కానీ మీరు మాత్రం వారిపై పగ పెంచుకుంటూ రాత్రంతా మేల్కొంటున్నారు. అంటే, వాస్తవానికి శిక్ష అనుభవిస్తోంది మీరు, మీ శత్రువు కాదు. పగ కేవలం రెండు వ్యక్తుల మధ్య సమస్య కాదు. ఇది తరతరాల వైషమ్యాలకు దారితీస్తుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో భూ వివాదాల వల్ల, ఫ్యాక్షన్ రాజకీయాల వల్ల ఎన్నో కుటుంబాలు సర్వనాశనమయ్యాయి. ఒక తరం చేసిన తప్పును మరో తరం పగగా కొనసాగించడం వల్ల అభివృద్ధి కుంటుపడుతోంది. ముఖ్యంగా రాజకీయాల్లో ఈ రివెంజ్ పాలిటిక్స్ మరింత ప్రమాదకరంగా మారాయి. అధికారం మారగానే ప్రత్యర్థులపై అక్రమ కేసులు పెట్టడం, గత ప్రభుత్వం చేపట్టిన ప్రజా ఉపయోగకరమైన పనులను కూడా కేవలం పగతో రద్దు చేయడం సమాజానికి తీరని నష్టం కలిగిస్తాయి. పగ ఉన్నచోట ప్రగతి ఉండదు, కేవలం విద్వేషం మాత్రమే రాజ్యమేలుతుంది.చాలామంది క్షమించడం అంటే ఓడిపోవడం అనుకుంటారు. కానీ నిజానికి క్షమించడం అనేది అత్యంత ఉన్నతమైన మానసిక బలం.క్షమ అంటే ఏమిటి? తప్పు చేసినవారికి శిక్ష పడకూడదని కోరుకోవడం కాదు, వారి వల్ల కలిగిన బాధను మన మనసులో నుండి తొలగించుకోవడం. ఎవరి కోసం? క్షమించడం అనేది ఎదుటివాడి కోసం కాదు, మన స్వంత మనశ్శాంతి కోసం.మన తెలుగు సంస్కృతిలోనే దీనికి గొప్ప ఉదాహరణలు ఉన్నాయి.

పోతనామాత్యుడు అవమానాలను పంటిబిగువున భరించి భాగవతం వంటి అమరకావ్యాన్ని అందించారు. రామదాసు చెరసాల కష్టాలను పగగా మార్చు కోకుండా, భక్తిగా మార్చుకుని చిరస్మరణీయుడయ్యా రు. మంచి చెడ్డలు మనలోనే ఉన్నాయి అన్న గురజాడ మాటలు పగను వీడమని చెప్పే జీవన సత్యాలు. మనస్తత్వవేత్తల అభిప్రాయం ప్రకారం, ఒక గాయం నుండి కోలుకోవడానికి మరియు ఒకరిని క్షమించడానికి కనీసం 6 నుండి 18 నెలల సమయం పడుతుంది. ఇది సులభం కాదు, కానీ ఈ ప్రయాణం చేసిన వారికి మాత్రమే విముక్తి అంటే ఏమిటో తెలుస్తుంది. మనం పగ లేని సమాజాన్ని నిర్మించాలంటే మార్పు మన ఇంటి నుండే మొదలవ్వాలి.

పిల్లలకు దెబ్బకు దెబ్బ నేర్పకండి. కోపం వచ్చినప్పుడు దాన్ని ఎలా నియంత్రించుకోవాలో (Emotional Regulation) నేర్పండి. పాఠశాలల్లో కేవలం మార్కుల కోసమే కాకుండా, నైతిక విలువల గురించి, క్షమ గుణాన్ని గురించి బోధించాలి. పగను ప్రేరేపించే సినిమాలను, వార్తలను ప్రోత్సహించకూడదు. పగ తీర్చుకున్నప్పుడు ఆ క్షణానికి విజయం సాధించామన్న భ్రమ కలగవచ్చు. కానీ ఆ విజయం తాత్కాలికం, దాని తర్వాత వచ్చే శూన్యం భయంకరమైనది. పగ పెంచుకోవడం మనిషిని చేస్తుంది, కానీ పగను వదిలేయడం మనిషిని మహా మనిషి గా మారుస్తుంది.నేటి నుండి ఒక్క నిర్ణయం తీసుకుందాం. గతంలో జరిగిన దాన్ని నేను మార్చలేను, కానీ నా భవిష్యత్తును పగతో పాడుచేసుకోను. పగను వదిలేయడం ఒక రాజకీయ నిర్ణయం కాదు, అది ఒక నైతిక బాధ్యత. ఒక తల్లిగా, తండ్రిగా, ఉపాధ్యాయుడిగా, పౌరుడిగా మనం పగ లేని సమాజం వైపు అడుగులు వేయాలి. లోపల రగులుతున్న మంటను ఆర్పేద్దాం.మానవత్వాన్ని వెలిగిద్దాం!



డా .సూర్యదేవర
రామకృష్ణ ,
9490754169

## దరువు జాతర - 25 ఏండ్ల సాంస్కృతిక యాత్ర,

# తెలంగాణ చైతన్య గాథ..!

తెలంగాణ సమాజ చరిత్రను పరిశీలిస్తే, ఉద్యమాలు కేవలం రాజకీయ నాయకత్వం చుట్టూ మాత్రమే తిరగలేదని స్పష్టమవుతుంది. సామాజిక, సాంస్కృతిక స్థాయిలో ప్రజలలో చైతన్యం రగిలించిన శక్తులే ఆ ఉద్యమాలకు అసలు ప్రాణం పోశాయి. అలాంటి సాంస్కృతిక శక్తులలో "దరువు" ఒక ప్రముఖమైన పేరు. ఒక చిన్న కళాబృందంగా ప్రారంభమైన ఈ సంస్థ, క్రమంగా ఒక ఉద్యమ స్వరంగా మారి, తెలంగాణ సమాజాన్ని ఆలోచింపజేసే శక్తిగా ఎదిగింది.

దరువు ప్రయాణం కేవలం పాటలతో, ప్రదర్శనలతో మాత్రమే పరిమితం కాలేదు. అది ఒక భావజాలాన్ని తీసుకెళ్లింది. సామాజిక అసమానతలు, కుల వివక్ష, ప్రాంతీయ అన్యాయాలపై ప్రశ్నలు లేవనెత్తింది. ప్రజల్లో ఆత్మగౌరవాన్ని పెంపొందించింది. ముఖ్యంగా అణగారిన వర్గాల స్వరాన్ని బలంగా వినిపించింది. ఒక కళారూపం ఎంతటి ప్రభావాన్ని చూపగలదో దరువు తన కార్యాచరణ ద్వారా నిరూపించింది. 25 సంవత్సరాల ప్రయాణం అంటే కేవలం కాల పరిమితి కాదు, అది అనుభవాల సమాహారం. ఆ ప్రయాణంలో ఎన్నో సవాళ్లు, ఎన్నో పోరాటాలు, ఎన్నో విజయాలు దాగి ఉన్నాయి. ఈ కాలంలో దరువు అనేక వేదికలపై తన స్వరాన్ని వినిపిస్తూ, సమాజంలో మార్పుకు కారణమైంది. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ సమయంలో దాని పాత్ర మరింత ప్రాముఖ్యత సంతరించుకుంది. విద్యార్థుల పోరాటాలకు సాంస్కృతిక బలం అందించింది. ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని పెంచింది.

ఇలాంటి గొప్ప ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ నిర్వహిస్తున్న "దరువు జాతర" ఒక సాధారణ వేడుక కాదు. అది ఒక చరిత్రను తిరిగి పిలుచుకునే ప్రయత్నం. ఒక తరం చేసిన త్యాగాలను మరో తరానికి పరిచయం చేసే వేదిక. ఒక ఉద్యమం వెనుక ఉన్న సాంస్కృతిక శక్తిని గుర్తు చేసే సందర్భం. ఇది కేవలం గతాన్ని స్మరించుకోవడమే కాదు, భవిష్యత్తుకు మార్గదర్శకత్వం ఇవ్వడం కూడా.

దరువు 25 సంవత్సరాల ప్రయాణం మనకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తుంది. సమాజంలో స్థిరమైన మార్పు రావాలంటే, రాజకీయ పోరాటంతో పాటు సాంస్కృతిక చైతన్యం కూడా అవసరం. ఆ చైతన్యాన్ని ప్రజలలో నాటిన దరువు, నిజంగా తెలంగాణ సమాజ చరిత్రలో ఒక ప్రత్యేకమైన స్థానం సంపాదించింది. ఇక 1999 డిసెంబర్ 20న సిద్ధిపేట డిగ్రీ కళాశాల వేదికగా "దరువు కళాబృందం"గా పురుడు పోసుకున్న ఈ సంస్థ, మొదటి నుంచే తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుంది, సామాజిక వివక్షలు, ప్రాంతీయ అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం. ఈ లక్ష్యం ఒక నినాదంగా మాత్రమే కాకుండా, దరువు ప్రతి కార్యక్రమంలో, ప్రతి పాటలో, ప్రతి కవితలో ప్రతిబింబించింది. ప్రారంభ సంవత్సరంలోనే విడుదల చేసిన "దళిత రత్నాలు" ఆడియో క్యాసెట్, దరువు సాంస్కృతిక ఉద్యమానికి బలమైన పునాది వేసింది.

ఆ క్యాసెట్‌లోని పాటలు కేవలం వినోదం కోసం కాదు, అవి చైతన్యానికి సంకేతాలు. డా. బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, నారాయణ గురువు , ఛత్రపతి సాహు మహారాజ్ వంటి మహనీయుల ఆలోచనలను ప్రజల హృదయాలకు చేరవేసిన ఆ పాటలు, గ్రామ గ్రామాన విస్తరించి ఒక సామాజిక మేల్కొలుపుకు కారణమయ్యాయి. ఆ కాలంలో ప్రతి వేదికపై "దళిత రత్నాలు" పాటలు వినిపించడమే దాని ప్రభావాన్ని తెలియజేస్తుంది.

దరువు ప్రయాణం అక్కడితో ఆగిపోలేదు. "కొట్లాట", "గజ్జెల మోత", "వరద కన్నీటి పాట", "తెలంగాణ విద్యార్థి పోరాట పాటలు", "ఉస్మానియా ఉద్యమం" వంటి ఆడియో-వీడియో రూపకల్పనలు, అలాగే "మాతొవ్వ", "వీరులారా వందనం", "ఓ యుద్ధం" వంటి పుస్తకాలు, ఇవన్నీ దరువు యొక్క విస్తృత సాంస్కృతిక కార్యకలాపాలకు నిదర్శనాలు. ప్రతి రచనలో ఒక సందేశం, ప్రతి పాటలో ఒక పోరాట గాథ, ప్రతి ప్రదర్శనలో ఒక చైతన్య జ్వాల దాగి ఉంది.సిద్ధిపేట నుండి ప్రారంభమైన ఈ యాత్ర, త్వరలోనే తెలంగాణ అంతటా విస్తరించింది. సదస్సులు, సెమినార్లు, చర్చాగోష్టులు, ప్రదర్శనలు, సభలు – – ఇలా అనేక రూపాల్లో దరువు ప్రజల మధ్యకు చేరుకుంది. ప్రత్యేకంగా "దరువు తెలంగాణ జాతరలు" ఆట, పాట, మాటల సమ్మేళనంగా ప్రజలలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించాయి. తెలంగాణ ఉద్యమం రెండో దశలో దరువు పాత్ర మరింత ప్రాముఖ్యత సంతరించుకుంది. ఉద్యమం కేవలం రాజకీయ నాయకుల చేతుల్లోనే కాకుండా, విద్యార్థుల చేతుల్లోకి వచ్చిన సమయంలో, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉద్యమానికి కేంద్రబిందువైంది. ఆ ఉద్యమానికి సాంస్కృతిక శక్తిని అందించినది దరువు.

ఉస్మానియా యూనివర్సిటీ కేవలం ఒక విద్యాసంస్థ కాదు, అది ఒక పోరాట భూమి. అక్కడ విద్యార్థులు చేసిన త్యాగాలు, ఎదుర్కొన్న హింస, చూపిన ధైర్యం, ఇవన్నీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి పునాది అయ్యాయి. ఆ పోరాటానికి స్వరం ఇచ్చినది దరువు. విద్యార్థుల అమరత్వాన్ని పాటల రూపంలో ప్రపంచానికి వినిపించింది. జైలు గోడల మధ్యన కూడా "చంచల్ గూడ జైలులోన చంద్రవంకలారా" అంటూ ప్రతిధ్వనించిన దరువు గీతాలు, ఉద్యమానికి అజరామరమైన గుర్తింపును తెచ్చాయి.

తెలంగాణ ఉద్యమ చరిత్రలో 1200 మందికి పైగా విద్యార్థుల స్వయం బలిదానాలు ఒక దారుణ వాస్తవం. ఆ త్యాగాలను గుర్తుచేస్తూ, ప్రజల హృదయాల్లో ఉద్యమ జ్వాలను రగిలించినది దరువు. లాఠీలు, తూటాలు ఎదురైనా వెనక్కి తగ్గని ఆ పోరాటానికి సాంస్కృతిక ఆయుధంగా నిలిచింది. దరువు కేవలం పాటలు పాడలేదు, అది ప్రశ్నించింది, అది ప్రతిఘటించింది, అది సమాజాన్ని ఆలోచింపజేసింది. సీమాంధ్ర పాలకుల అన్యాయ విధానాలపై నిప్పులు చెరిగిన పాటలు, స్వార్థ రాజకీయాలపై విమర్శలు, ఇవన్నీ దరువు యొక్క ధైర్యాన్ని, నిబద్ధతను ప్రతిబింబిస్తాయి.

ఇలాంటి గొప్ప చరిత్ర కలిగిన దరువు సంస్థకు 25 సంవత్సరాలు పూర్తవడం ఒక గొప్ప మైలురాయి. ఈ సందర్భంగా 2026 ఏప్రిల్ 20న హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా "దరువు జాతర" నిర్వహించడం, ఈ ప్రయాణాన్ని స్మరించుకునే ఒక గొప్ప సందర్భం.

ఈ జాతర కేవలం ఒక కార్యక్రమం కాదు, అది ఒక సాంస్కృతిక సమరోత్సవం. తెలంగాణ ఉద్యమ త్యాగాలను మరోసారి గుర్తుచేసుకుంటూ, ఆ పోరాట స్ఫూర్తిని కొత్త తరాలకు అందించడానికి ఈ వేదిక ఉపయోగపడుతుంది. రాజకీయ నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ఉద్యమకారులు, విద్యార్థి నాయకులు, కవులు, కళాకారులు, అందరూ ఒకే వేదికపై కలుసుకోవడం, దరువు ప్రభావాన్ని తెలియజేస్తుంది.

బోనాల పండుగ రోజున పోచమ్మ, మైసమ్మ, మల్లమ్మ దేవతల దగ్గరకు కుటుంబ సభ్యులతో వెళ్లినట్లే, ఈ దరువు జాతరకు కూడా ప్రజలు పెద్ద ఎత్తున హాజరవ్వాలి అనే పిలుపు, ఈ కార్యక్రమానికి ఉన్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను తెలియజేస్తుంది.అయితే, ఈ సందర్భం కేవలం సంబరాలకు మాత్రమే పరిమితం కావడం సరైంది కాదు. ఇది ప్రభుత్వానికి ఒక గుర్తు చేసే సందర్భం కూడా. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి కారణమైన విద్యార్థుల త్యాగాలను గౌరవించడానికి ఇంకా చాలా చేయాల్సి ఉంది.

ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థి అమరుల స్మారక స్థూపం నిర్మించడం అత్యవసరం. అది కేవలం ఒక నిర్మాణం కాదు, అది ఒక చరిత్రకు నివాళి. అలాగే, విద్యార్థి అమరుడు "సిరిపురం యాదయ్య" శ్రీకాంతాచారి, బలిదానం చేసిన ఫిబ్రవరి 21 తేదీని "విద్యార్థి అమరుల స్మారక దినోత్సవం"గా అధికారికంగా ప్రకటించడం ద్వారా, ఆ త్యాగాలను తరతరాలకు గుర్తుచేయవచ్చు.

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థుల చరిత్రలను సేకరించి, నెక్లెస్ రోడ్ లో ఒక స్మారక మ్యూజియం ఏర్పాటు చేయడం ద్వారా, భవిష్యత్ తరాలకు ఒక ప్రేరణగా నిలుస్తుంది. అలాగే, ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కవులు, కళాకారులు, నాయకుల విగ్రహాలను ట్యాంక్ బండ్ పై ప్రతిష్టించడం, అలాగే తెలంగాణ నలుమూలల అమరవీరుల స్తూపం తోపాటు సాంస్కృతిక ఆడిటోరియంలో పెట్టడం వల్ల కళాకారులకు ఉద్యోగాలు కల్పించడం వల్ల తెలంగాణ రాష్ట్ర ఉద్యమ పోరాటం గురించి ప్రజలకు తెలియజేయడం, టూరిజం ని పెంపొందించుకోవడం ప్రభుత్వ లక్ష్యంగా ఉండాలి , కళాకారుల వారి సేవలను గౌరవించడమే కాకుండా, సమాజానికి ఒక సందేశాన్ని అందిస్తుంది.

గద్దర్, అందెశ్రీ, కాళోజీ నారాయణరావు, ప్రొ. జయశంకర్, ప్రొఫెసర్ కేశవరావు జాదవ్,విమలక్క,
జయరాజు, గోరేటి వెంకన్న, పైలం సంతోష్,
వంటి మహనీయుల సేవలను పాఠ్యాంశాలలో చేర్చడం ద్వారా, విద్యార్థులు తమ చరిత్రను తెలుసుకునే అవకాశం కలుగుతుంది.

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నిజమైన నిరుద్యోగ కవులు, కళాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం, వారికి ఆర్థిక భద్రత ఇవ్వడం, రాజకీయ, వారి సేవలకు నిజమైన గౌరవం. అలాగే, సాంస్కృతిక సారథి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడం కూడా అవసరం.దరువు 25 ఏండ్ల ప్రయాణం మనకు ఒక పాఠాన్ని చెబుతుంది, ఒక సమాజాన్ని మార్చడానికి కేవలం రాజకీయ శక్తి సరిపోదు, సాంస్కృతిక చైతన్యం కూడా అవసరం. పాటలు, కవితలు, నాటకాలు, ఇవి కేవలం కళారూపాలు కాదు, ఇవి మార్పుకు ఆయుధాలు. ఈ దరువు జాతర, గతాన్ని స్మరించుకోవడమే కాకుండా, భవిష్యత్తుకు దారి చూపాలి. సమ సమాజ నిర్మాణం అనే లక్ష్యం ఇంకా పూర్తికాలేదు. ఇంకా వివక్షలు ఉన్నాయి, ఇంకా అసమానతలు ఉన్నాయి. వాటిని తొలగించడానికి దరువు వంటి సాంస్కృతిక శక్తులు మరింత బలంగా ముందుకు రావాలి. మొత్తానికి, దరువు 25 ఏండ్ల పండుగ ఒక సంబరం మాత్రమే కాదు, అది ఒక బాధ్యతను గుర్తు చేసే సందర్భం. ఆ బాధ్యత, సమాజాన్ని సమానత్వం వైపు నడిపించడం. ఈ దారిలో దరువు మరింత శక్తివంతంగా ముందుకు సాగాలని ఆశిద్దాం.



మన్నారం నాగరాజు.
తెలంగాణ లోక్సత్తా పార్టీ
మాజీ రాష్ట్ర అధ్యక్షులు.

# అంబేద్కర్ విగ్రహంపై ఆంక్షలు ఎందుకు..? రాజ్ బహదూర్ వెంకట్రాంరెడ్డి విగ్రహానికి మాత్రం మినహాయింపు ఎలా?



## చర్లపల్లిలో మహనీయుల విగ్రహాల తొలగింపుపై ఉద్రిక్తత -- ధర్నా, అరెస్టులు



**చర్లపల్లి, ఏప్రిల్ 16వెలుతురు:** చర్లపల్లి బస్టాండ్ వద్ద మహనీయుల విగ్రహాల తొలగింపు ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. ఇటీవల ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి తొలగించడం తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. గురువారం ఉదయం విషయం తెలిసిన వెంటనే దళిత సంఘాలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు సంఘటితమై బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమానికి దిగారు. ఈ నిరసనకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యం వహించారు. ఆందోళనకారులు పోలీసుల వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించారు. ముఖ్యంగా "రాజ్ బహదూర్ వెంకట్రాంరెడ్డి విగ్రహానికి లేని ఆంక్షలు అంబేద్కర్ విగ్రహానికి ఎందుకు?" అంటూ ప్రశ్నించారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టి, సోమశేఖర్ రెడ్డితో పాటు సుమారు 20 మంది ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టైన వారిలో నేమురి మహేష్ గౌడ్, డప్పు గిరిబాబు, కొమ్ము నర్సింగ్ రావు, కడియాల సురేష్, కేవీఎల్ఎన్ రావు, కొమ్ము సురేష్, కడియాల నాగేష్, కడియాల అనిల్ కుమార్, కొమ్ము రమేష్, బొజ్జ పవన్, ఎడ్ల సోమయ్య, పొన్నాల సురేష్, కొమ్ము శివరాజ్, విజయరాజ్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ, దళితుల ప్రతినిధిగా నిలిచిన డాక్టర్ అంబేద్కర్ పట్ల చిన్నచూపు చూపడం అన్యాయమని మండిపడ్డారు. అగ్రకులాలకు చెందిన నాయకుల విగ్రహాలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా ఉండగా, అంబేద్కర్ విగ్రహాలపై మాత్రమే ఆంక్షలు విధించడం వివక్షతకు నిదర్శనమని ఆరోపించారు. మహనీయుల విగ్రహాలను వెంటనే పునఃస్థాపించకపోతే ఆందోళనను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు సిద్ధమని హెచ్చరించారు. ఈ ఘటనతో చర్లపల్లి పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అరెస్టైన వారిని హెచ్‌బీ కాలనీ మాజీ కార్పొరేటర్ జగ్రిపోతుల ప్రభుదాస్ పోలీస్ స్టేషన్‌లో పరామర్శించి సంఘీభావం తెలిపారు. స్థానికంగా పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్న నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఫతేపూర్‌లో మహనీయుల విగ్రహాల ఆవిష్కరణకు సన్నాహాలు పూర్తి



**శంకర్‌పల్లి, వెలుతురు ఏప్రిల్ 16 :** శంకర్‌పల్లి మండలం ఫతేపూర్ గ్రామంలో ఈనెల 24న మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు స్థానిక నాయకులు వెల్లడించారు. గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలను అదే రోజు సాయంత్రం 6 గంటలకు ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తదితర ప్రముఖులు హాజరై విగ్రహాలను ఆవిష్కరిస్తారని మాజీ కౌన్సిలర్ రాములు, ఎమ్మార్పీఎస్ నేతలు నర్సింహులు, యాదయ్య, శ్రీకాంత్ తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డిని ఆయన నివాసంలో చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ భీం భరత్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ధర్మన్న గారి వెంకటరెడ్డి తదితరులు కలిసి కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రవీందర్, జంగయ్య, లక్ష్మణ్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సక్రమమైన మంచినీరు, మురుగునీటి రహిత వాతావరణాన్ని అందించే దిశగా చర్యలు చేపట్టాలి : బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్.



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 16:** గురువారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని డివిజన్లో, బస్తీలలో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ, త్రాగునీటి పైప్ లైన్ కనెక్షన్ల నిర్మాణము, పైప్ లైన్ మరమ్మతు పనులపై బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ జలమండలి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... సుమారు 2.04 కోట్ల రూపాయలతో నూతనంగా చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సరఫరా పైప్లైన్ పనులను త్వరగా ప్రారంభించి, పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి సుకురావాలన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలోని కాలనీలు, బస్తీలలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఇప్పటికే చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, రోజురోజుకు పెరుగుతున్న జనాభా వెలుస్తున్న కాలనీలలో భూగర్భ డ్రైనేజీ, త్రాగునీటి సరఫరా పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టేందుకు ప్రణాళికలు రచించి నూతన పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించే దిశగా ప్రజల అవసరాలకు అనుగుణంగా అవసరమైన చోట రిజర్వాయర్లను నిర్మించి భవిష్యత్తు అవసరాలకు సరిపోయే విధంగా త్రాగునీటిని అందించే వైపుగా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి కలగకుండా అధికారులు ప్రజలకు నీటిని సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిఎంలు మాధవి, పరిమళ, వివిధ సెక్షన్ల డీజీఎంలు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభలో తెలంగాణ స్వరం మరింత బలపడాలి : వేం నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు వెల్లువ..



**కూకట్ పల్లి ఏప్రిల్ 16 వెలుతురు:** కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభ సభ్యుడిగా నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్ రెడ్డి ని పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ, ప్రజాసేవలో అనుభవం కలిగిన నాయకుడైన వేం నరేందర్ రెడ్డి పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజల సమస్యలను బలంగా ప్రస్తావించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర హక్కులు, నిధుల సాధనలో ఆయన కీలక పాత్ర పోషిస్తూ, రాజ్యసభలో తెలంగాణ వాణిని మరింత శక్తివంతంగా వినిపించాలని సూచించారు. తెలంగాణ అభివృద్ధి దిశగా నిరంతరం కృషి చేస్తూ ప్రజలకు సేవ చేయాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన అభిలషించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, శాసనసభ్యులు మేడిపల్లి సత్యం కాంగ్రెస్ నాయకులు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# 9 క్వింటాళ్ళ రేషన్ బియ్యం పట్టివేత కేసు నమోదు

## మాడ్గుల సీఐ వేణుగోపాల్..



**మాడ్గుల వెలుతురు ఏప్రిల్ 16:** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని సిఐ వేణుగోపాల్ హెచ్చరించారు. గురువారం ఉదయము 6.00 గంటలకు మాడ్గుల్ పోలీసు సిబ్బంది నర్సంపల్లి గ్రామ శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గ్రామ శివారులో రోడ్ పక్కన ఒక వ్యక్తి నిలబడి ఉండి పోలీసు వాహనము చూసి అనుమానాస్పదముగా ఉండగా పోలీసు వారు పెట్రో మొబైల్ ను అతని పక్కన ఆపి చూడగా అతనికి పక్కన కొద్ది దూరములో కొన్ని మూటలు కనిపించినవి. పోలీసు వారిని చూసి అతను అట్టి మూటలు వదిలిపెట్టి పారిపోయినాడు. వాళ్ళు కిందికి దిగి మూటలు చూడగా అవి ప్రభుత్వము సరఫరా చేయుచున్న రేషన్ బియ్యము గా గుర్తించినారు. వెంటనే అక్కడే ఉన్న చుట్టుపక్కల వ్యక్తులను అట్టి బియ్యము వదిలిపెట్టి పారిపోయిన వ్యక్తి గురించి ఆరా తీయగా అతని పేరు నేనావత్ శంకర్ తండ్రి వెంకట్రామ్, వయసు: అందజా 40 సం.లు., నివాసం: గ్రా. మాన్య తండా నర్సంపల్లి అని తెలిసినది. తదుపరి ఇద్దరు పంచుల సమక్షములో అట్టి బియ్యమును సీజ్ చేసి పోలీసు స్టేషన్ కు తరలించారు. ప్రభుత్వము సరఫరా చేయుచున్న రేషన్ బియ్యమును అక్రమముగా నిల్వ చేసి,తన స్వంత లాభానికి అమ్ముకుంటున్న నేనావత్ శంకర్ పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నాము. ఇట్టి బియ్యము ప్రభుత్వము సరఫరా చేయు సంచులలో వుండడంతో అట్టి బస్తాలపై విచారణ చేసి అట్టి రేషన్ షాప్ పై తగు చర్యలు తీసుకోవలసిందిగా జిల్లా సివిల్ సప్లై అధికారికి సమాచారం అందజేసినట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

## ఆటో డ్రైవర్ చెరువులో దూకి ఆత్మహత్య



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 16:** ఆటో డ్రైవర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో, కట్ట మైసమ్మ లింగం చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యమయింది. సూరారం కాలనీ, దయానంద్ నగర్ కు చెందిన సాయిలు, వయస్సు 48, ఆటో డ్రైవర్, సొంత ఊరు ఎల్లారెడ్డి, ప్రస్తుతం సూరారం కాలనీ దయానంద్ నగర్ లో నివాసం ఉంటున్నాడు. ఒక కొడుకు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. అతడు ఎందుకు చనిపోయాడు బలమైన కారణాలే ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అతనికి ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు అవి భరించలేక ఆత్మహత్య చేసుకున్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# మంచాల మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ పాఠశాలకు శంకుస్థాపన చేసిన గ్రామ సర్పంచ్ ఏర్పుల మానస వినయ్



**మంచాల వెలుతురు ఏప్రిల్ 16:** మంచాల మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ పాఠశాల నిర్మాణానికి ను శంకుస్థాపన చేసి ప్రారంభించిన మంచాలగ్రామ సర్పంచ్ ఏర్పుల మానస వినయ్ ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ మాట్లాడుతూ మంచాల మండల కేంద్రంలో ప్రవేట్ పాఠశాలలకు దీటుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ పాఠశాల ను నిర్మించడం చాలా సంతోషంగా ఉంది అన్నారు ఈకార్యక్రమంలో గ్రామఉపసర్పంచ్ పందుల లింగంగౌడ్ తె లంగాణ పబ్లిక్ పాఠశాల కన్వీనర్ ఝూన్సీరాణి ఏఈ సాంకేత్ వార్డుసభ్యులు ఏరుకొండ మహేష్ ఎరుకల సా లయ్య గ్యార జంగయ్య మల్గా శ్రీశైలం గ్యార శేఖర్ నీళ్ల కృష్ణ గడ్డం బాబయ్య గ్యార జగన్ ఎస్ఎంసి సభ్యు కోడూరు వెంకటేష్ అశ్వాల బాలరాజు జక్కశేఖర్ బెల్లంపల్లి శ్రీనివాస్ రెడ్డి గడ్డం సుధాకర్ రావుల లింగం దేవరకొండ ఆంజనేయులు ఎలమొని గీత గ్యార సంకీర్తన అనిరెడ్డి విజయ బంగారు గల్లారాణి ప్రాథమిక పా ఠశాల ప్రధానోపాధ్యాయురాలు రుబియాన ఉపాధ్యాయులు సలీంఖాన్ నారాయణరెడ్డి సాయికుమార్ సు మలత జంగయ్య గ్రామస్తులు నరసింహ ఏర్పుల పసుల కృష్ణ గడ్డం మల్లయ్య ఏర్పుల అశోక్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## యువతలో క్రీడా జోష్‌కు నూతన దిశ -- 9కే స్పోర్ట్స్ క్లబ్ ప్రారంభం..



కూకట్ పల్లి ఏప్రిల్ 16 వెలుతురు: యువతలో క్రీడా ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా జేఎన్‌టీయూ అడ్డగుట్ట సొసైటీ పరిధిలో 9కే స్పోర్ట్స్ క్లబ్‌ను ఘనంగా ప్రారంభించారు. "క్రీడలు సాధారణం -- ప్రతిభ అసాధారణం" అనే నినాదంతో విల్సన్ ఆధ్వర్యంలో ఈ క్లబ్ ను ప్రారంభించడం విశేషం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కంటెస్టెడ్ కార్పొరేటర్ నర్సింగ్ యాదవ్ హాజరై క్లబ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక అభివృద్ధి సాధించవచ్చని పేర్కొన్నారు. ఇటువంటి క్రీడా వేదికలు యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడతాయని అన్నారు. 9కే స్పోర్ట్స్ క్లబ్ ద్వారా యువతకు శిక్షణ, మార్గదర్శనం కల్పిస్తూ క్రీడారంగంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నిర్వాహకులు తెలిపారు. ఈ క్లబ్ ప్రారంభంతో ప్రాంతీయ యువతలో క్రీడల పట్ల ఆసక్తి మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# వచన రచనకు ఆధ్యుడు కందుకూరి వీరేశలింగం



### తెలుగు సాహిత్య సంస్కర్త కందుకూరి వీరేశలింగం ఆచార్య పద్మశ్రీ ఇనాక్

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 16:** తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ,తెలుగు భాషా చైతన్య సమితి, సర్వేజనా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈరోజు రవీంద్రభారతిలో సమావేశ మందిరంలో సంఘసంస్కర్త

సాహిత్య సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు గారి జయంతి సభ మరియు వివిధ రంగాలలో విశేష కృషి చేసిన వ్యక్తులకు కందుకూరి స్మారక అవార్డు ప్రధానం చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులు కేశిరాజు రాంప్రసాద్ వహించగా కార్యక్రమ నిర్వహణ పి బడేసాబ్ చెయ్యగా ఈ కార్యక్రమం ముఖ్య అతిథి పద్మశ్రీ ఆచార్య కొలకనూరు ఇనాక్ మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం సంఘసంస్కర్త కాదు సాహిత్య సంస్కర్త ఆయన సాహిత్య శిఖరం కందుకూరి వారు మన మర్చిపోతే 200 సంవత్సరాల చరిత్ర మరచినట్టే సాహిత్య ప్రక్రియలో ఆయన అందవేసిన చెయ్యి నవల,నాటకం, నాటిక, కథ,కథానిక, వచన ప్రక్రియకు ఆధ్యుడు కందుకూరి అనేక ప్రక్రియలు చేపట్టిన వ్యక్తి కందుకూరి వీరేశలింగం, సమాజ మార్పు కోసం ఎన్నో పోరాటం చేసిన వ్యక్తి ఆ మహానుభావుడిని మరచిపోతే మనకి మనం ద్రోహం చేసుకున్నట్టే అని పద్మశ్రీ ఆచార్య ఇనాక్ అన్నారు మరో అతిథి ఐఏఎస్ రిటైర్డ్ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం స్త్రీల స్వేచ్ఛ కోసం పోరాడిన వ్యక్తి ఇల్లాలు చదువు ఇంటికి వెలుగు ఈయన ద్వారానే వచ్చిందని అనేక కార్యక్రమాలు సాహిత్య లోకానికి సమాజానికి ఎనలేని కృషి చేసిన వ్యక్తి కందుకూరి అని ఆయన కొనియాడారు. అంతేకాకుండా రోడ్ల భద్రత డ్రైవింగ్ గురించి కూడా మాట్లాడారు. డ్రైవింగ్ రాష్గా చేయకూడదు గా పోకూడదు హెల్మెట్ పెట్టుకుని వాహనాన్ని నడపాలి కారు నడిపేటప్పుడు కూడా సీట్ బెల్ట్ పెట్టుకుని నడపాలి అని వారు అన్నారు ఆత్మీయ అతిథి రామకృష్ణ చంద్రమౌళి మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం చేసిన సేవలు చినిగిన చొక్కా అయినా తొడుక్కో ఒక మంచి పుస్తకం కొనుక్కో అనే నినాదంని ఆయన చెప్పి మన కవులందరం కందుకూరి వీరేశలింగాన్ని స్ఫూర్తిగా తీసుకొని మంచి రచనలు సమాజానికి ఉపయోగపడే రచనలు రావాలని వారు కోరారు నేటి యువతరం కూడా కందుకూరి రచనలు చదవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఎయిర్ మార్షల్ చంద్రశేఖర్, గంటా మనోహర్ ఒడ్డి, శ్రీమతి సరోజినీ దేవి రాధాకుసుమ వనజ, సిద్దోజి రావు సర్వేజనా ఫౌండేషన్ సీఈఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు కందుకూరి వీరేశలింగ స్మార్ట్ అవార్డులు తీసుకున్న వారిలో పురాణం విజయదుర్గ, రామరాజు,ఎన్ సిద్దోజి, గుండ రామకృష్ణ పి పద్మావతి ఎస్ శాంతి గంటా మనోహర్ రెడ్డి అల్లూరి రవివర్మ, రామకృష్ణ చంద్రమౌళి,గజవెల్లి సత్యనారాయణ స్వామి,అడబాల శ్రీనివాసరావు, గతల శ్యామల రాజు,చంద్రభట్ల శ్రీనివాస్, చెరుకు మహేశ్వర్ శర్మ, శ్రీమతి రాధాకుసుమ,బొల్లు రామ్మోహన్,తుపాకుల శ్రీనివాస్,వడ్లమాను మురళీమోహన్, తురక రామకృష్ణ నాయుడు, వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని కందుకూరి వీరేశలింగం పంతులు స్మారక అవార్డులు తీసుకున్నారు

# మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళల వాటా తేలే వరకు పార్టీలకు అతీతంగా ఓబీసీ ఎంపీలు అందరూ మహిళా బిల్లును వ్యతిరేకించాలి

### బీసీ మహిళలకు సబ్ కోటా ఉండాల్సిందేనని ఢిల్లీలోనీ జంతర్ మంతర్ వద్ద జరిగినా దీక్షలో పాల్గొని ప్రసంగించిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్




**న్యూఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 16:** మహిళా రిజర్వేషన్ బిల్లుతో అగ్రకులాల మహిళలకే లాభం చేకూరుతుందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ తెలిపారు.మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కేటాయించాలని కోరుతూ ఈరోజు ఢిల్లీలోనీ జంతర్ మంతర్ వద్ద జరిగిన దీక్షా కార్యక్రమంలో బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ పాల్గొని మాట్లాడుతూ అగ్రకులాలకు మరో వంద సంవత్సరాలు రాజ్యాధికారం కట్టబెట్టడానికే మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువస్తున్నారని ఇప్పటికే పార్లమెంటు,అసెంబ్లీ (చట్ట సభలో) లో మెజార్టీగా ఉన్న ఓబీసీలకు ప్రాతినిధ్యం లేక రాజకీయంగా వెనుక బడి పోతుంటే తెర మీదకు మహిళా బిల్లు పేరుతో మళ్లీ అగ్రకులాలకు చెందిన మహిళలే చట్ట సభలకు వెళతారని బీసీ మహిళలు రాజకీయ అణచివేతకు గురవుతారని లింగం గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు.

# హయత్ నగర్, టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారుల పనితీరు లో మార్పు ఎక్కడ" !

### డొమెస్టిక్ అనుమతులతో ఓ.సి. జారీ.. కట్ చేస్తే కమర్షియల్ భవనంలోకి ఎంట్రీ



**హయత్ నగర్ వెలుతురు ఏప్రిల్ 16:** హయత్ నగర్ సర్కిల్ పరిధిలోని సర్వే నెంబర్ 11, ప్లాట్ నెంబర్ 9, నాలుగు అంతస్తులకు డొమెస్టిక్ తో కూడిన భవన నిర్మాణ అనుమతులు తీసుకున్నారు.. తీసుకున్న అనుమతుల మేరకు నిర్మాణం పూర్తి చేసారు.. అనంతరం ఎల్.బి.నగర్ జోనల్ కార్యాలయం నుండి ఓ.సి.( ఆక్యుపెన్సి సర్టిఫికెట్) దరఖాస్తు చేసుకున్నారు... అధికారుల పరిశీలించి ఓ.సి.జారీ చేసారు.. ఇక్కడి వరకు బాగానే ఉంది కానీ కట్ చేస్తే డొమెస్టిక్ అనుమతులతో ఓ.సి. జారీ అనంతరం ఇప్పుడు కమర్షియల్ భవనం లోకి ఎంట్రీ ఇస్తున్నారు.. ఇలా డొమెస్టిక్ అనుమతులతో ఓ.సి.లు జారీ చేయడం అలా కమర్షియల్ భవనంగా మార్చడం ఇక్కడ సర్వసాధారణంగా మారిపోయింది.. ఇలా ప్రభుత్వ నియమ, నిబంధనలు తుంగలో తొక్కి తమ ఇష్టానుసారంగా అక్రమ భవనాలు నిర్మిస్తూ ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని గండి కొడుతూ.. విధుల పట్ల తమ బాధ్యతను మరిచి , అక్రమార్కుల కొమ్ముకాసున్నారు... నిబంధన ఉల్లంఘించిన అక్రమార్కుల పట్ల చట్టపరమైన చర్యలు తీసుకుంటే..కుక్క కాటుకు చెప్పు దెబ్బ అన్నట్టు... కొన్ని భవన నిర్మాణాలను సీజ్ చేస్తే, లేదా జారీ చేసిన ఓ.సి.లను రద్దు చేస్తే సమాజంలో కొంతమేర మార్పు వస్తుందని...అధికారులు ప్రజలు కట్టిన పన్నులతో జీతం తీసుకుంటూ.. కనీసం కొన్ని సందర్భాలలోనైనా నిజాయితీ నిబద్ధతతో విధులు నిర్వహించి చట్టం ఎవరు చుట్టం కాదని నిరూపించాల్సిన సందర్భం ఇప్పుడు ఉందని, అధికారులు గుర్తుంచుకోవాలి. నేటి అధికారుల పనితీరు... సమాజంలో నిజాయితీ, నిబద్ధత, విధుల పట్ల బాధ్యత వంటి అంశాలపై అవగాహన సదస్సులు , పాఠ్యాంశాలలో చేర్చే రోజులు రాబోతున్నాయి... మరి ఈ అక్రమ నిర్మాణం పై అధికారులు చట్ట పరమైన చర్యలు తీసుకుంటారా మీడియాలో అక్రమ అక్రమ నిర్మాణాలపై కథనాలు షరా, మామూలే అని లైట్ తీసుకుంటారో మరో కథనంతో మీ ముందుకు.

# అక్రమ చొరబాటుకు అడ్డుకట్ట

### ఉద్యోగుల ఆత్మగౌరవ రక్షణ కోసం సైబరాబాద్ కమిషనర్‌కు టీఎన్జీవో విన్నపం



**మేడ్చల్ వెలుతురు ఏప్రిల్ 16:** టీఎన్జీవో మేడ్చల్ కార్యాలయ కాంపౌండ్ గోడను కూల్చి చొచ్చుకుని ప్రైవేట్ వ్యక్తులు కబ్జా ప్రయత్నం చేసిన ఘటనపై, టీఎన్జీవో సంఘం ప్రతినిధులు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి, ఐపీఎస్ గారిని కలిసి అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంబంధిత ప్రైవేట్ వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు.ఈ విషయాన్ని పై పోలీస్ కమిషనర్ గారు సమస్యను సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్ష కార్యదర్శులు మారాం జగదీశ్వర్, సయ్యద్ ముజీబ్ హుస్సైనీ, కోశాధికారి సత్యనారాయణ గౌడ్, అసోసియేట్ ప్రెసిడెంట్ కస్తూరి వెంకటేశ్వర్లు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షులు బి. రవి ప్రకాష్, కార్యదర్శి బి. భరత్ కుమార్ పాల్గొన్నారు.

### చలివేంద్రం ఏర్పాటు -- ప్రజల దాహార్తిని తీర్చేందుకు తోడ్పాటు : బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్.



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 16:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గురువారం 132 - జీడిమెట్ల డివిజన్ సుచిత్ర చౌరస్తాలో బిఆర్ఎస్ నాయకులు జలిగం రాకేష్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ఏసీపీ వెంకట్ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడితూ....చలివేంద్రం ఏర్పాటు ప్రజల దాహార్తిని తీర్చేందుకు తోడ్పాటు అని, చలివేంద్రాల ద్వారా ప్రజలకు సేవచేయడం ఆ దైవానికి సేవ చేసినట్టేనని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జీడిమెట్ల డివిజన్ సమన్వయ కమిటీ సభ్యులు, కుత్బుల్లాపూర్ డివిజన్ నాయకులు నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### డీలిమిటేషన్ బిల్లు ద్వారా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని సహించం

### బిఆర్ఎస్ ఉద్యమ నేత మల్లికార్జున్ యాదవ్



**బషీర్ బాగ్ వెలుతురు 16 ఏప్రిల్ :** కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ప్రవేశపెడుతున్న డీలిమిటేషన్ బిల్లు ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని , కేంద్రంలో ఉత్తరాది అజమాయిషిని కొనసాగించడానికి జరుగుతున్న కుట్రలో భాగమని బిఆర్ఎస్ ఉద్యమ నేత మల్లికార్జున్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశ ప్రగతి కోసం తమ కష్టార్జితాన్ని పణంగా పెడుతున్న దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే విధంగా మోడీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఈ బిల్లును తెలంగాణ రాష్ట్ర ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, ఈ బిల్లును వెనక్కి తీసుకోకపోతే ప్రత్యక్ష పోరాటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.దేశంలో ప్రజల మధ్య ఒక విభజనకు దారి తీసే విధంగా ఉన్న ఈ కుట్ర పూరితమైన బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని హెచ్చరించారు.

# వైభవంగా హనుమాన్, బొడ్రాయి వార్షికోత్సవ వేడుకలు



**పరిగి వెలుతురు ఏప్రిల్ 16:** దోమ మండలం బొంపల్లి గ్రామంలో హనుమాన్,బొడ్రాయి వార్షికోత్సవ వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు.ఆలయ అర్చకులు మనివర్ధన్, అనంతకృష్ణమూర్తి, లక్ష్మీనర్సింంహా,శ్రీకాంత్ ఆధ్వర్యంలో నాల్గొవ వార్షికోత్సవం సందర్భంగా హనుమంతుడికి చందనం, అభిషేకం, నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం నైవేద్యాలను సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమానికి గ్రామ పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### నేడే హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద 'భోజన విరామ నిరసన'

### ఉద్యోగుల సమీకరణకు వివిధ సంఘాల నేతల హామీ




**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 16:** తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఇజేఏసీ) పిలుపు మేరకు, నేడు శుక్రవారం, ఏప్రిల్ 17న హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించనున్న భోజన విరామ నిరసనను భారీ స్థాయిలో విజయవంతం చేయాలని టీజీఇజేఏసీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు విక్రమ్ కుమార్ మరియు కన్వీనర్ ఎం.బి. కృష్ణ యాదవ్ పిలుపునిచ్చారు.ఈ నిరసన కార్యక్రమ ఏర్పాట్లపై గురువారం రోజున నాంపల్లిలోని గృహకల్ప సముదాయంలో గల TNGOs హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్‌లుగా వ్యవహరిస్తున్న ఎచ్+ాం కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మరియు టీజీఇజేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్ డా. ఎస్. ఎం. హుస్సేనీ (ముజీబ్), తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మరియు టీజీఇజేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్ బి. శ్యామ్ హాజరై, రేపటి కార్యక్రమ నిర్వహణపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.సమావేశంలో పాల్గొన్న వివిధ ఉద్యోగ సంఘాల నాయకులందరూ తమ తమ సంఘాలకు చెందిన ఉద్యోగులను, ఉపాధ్యాయులను మరియు కార్మికులను పెద్ద ఎత్తున సమీకరించి, రేపటి నిరసనను విజయవంతం చేస్తామని ఈ సందర్భంగా ఏకగ్రీవంగా హామీ ఇచ్చారు.

ప్రధాన డిమాండ్లు:

- జూన్ 2, 2026 లోపు PRC ని అమలు చేయాలి.
- పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే విడుదల చేయాలి.
- ఉద్యోగులందరికీ వెంటనే హెల్త్ కార్డులు మంజూరు చేయాలి.
- పాత పెన్షన్ విధానాన్ని (OPS) పునరుద్ధరించాలి.

నల్ల బ్యాడ్జీలు ధరించి నిర్వహించే ఈ నిరసన కార్యక్రమంలో గెజిటెడ్ అధికారులు, నాన్-గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు మరియు క్లాస్-×ం ఉద్యోగులు విధిగా పాల్గొనాలని కోరారు. ఈ సన్నాహక సమావేశంలో ఖాదర్ బిన్ హసన్ (ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర క్లాస్-IV ఉద్యోగుల సంఘం), కురాడి శ్రీనివాస్ (కార్యదర్శి, TNGO హైదరాబాద్ జిల్లా), నర్సింగ్ (అధ్యక్షులు, తెలంగాణ ఉద్యోగుల సంఘం, హైదరాబాద్ జిల్లా), తిరుపతి రెడ్డి (PRTU అధ్యక్షులు), జి. రాజారావు (ూఖుఖీ అధ్యక్షులు), పి. రామసుబ్బారావు (ూఖ అధ్యక్షులు), వి. సత్యనారాయణ (క్లాస్-IV ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు), ఎన్. నరేందర్ రావు (సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు), జి. రామకృష్ణారావు (ణూూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు) మరియు నాయకులు శ్యామ్ సుందర్, వి. అశోక్, ఎం.వి. రమణ, సురేందర్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, శ్రీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. విక్రమ్ కుమార్‌చైర్మన్, టీజీఇజేఏసీ, హైదరాబాద్ జిల్లాఎం.బి. కృష్ణ యాదవ్, కన్వీనర్, టీజీఇజేఏసీ , హైదరాబాద్ జిల్లా

### Arrive Alive కార్యక్రమంలో భాగంగా

### ఆటో రిక్షా డ్రైవర్ల కోసం ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక డ్రైవ్




**బషీర్ బాగ్ వెలుతురు 16 ఏప్రిల్ :** ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు రహదారి భద్రతను మెరుగుపరచడానికి, అబిడ్స్ ట్రాఫిక్ పోలీసులు ఆటో రిక్షాలపై ప్రత్యేక తనిఖీలు, ఆటో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు మరియు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రయాణికుల భద్రత మరియు క్రమశిక్షణతో కూడిన ప్రయాణం కోసం ఈ క్రింది నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని అధికారులు ఆదేశించారు.తప్పనిసరి పత్రాలు ఉండాలన్నారు ప్రతి ఆటో డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ (=జ), ఇన్సూరెన్స్ మరియు కాలుష్య నియంత్రణ (PUC) పత్రాలను కలిగి ఉండాలి.డ్రైవర్లు తప్పనిసరిగా ఖాకీ యూనిఫాం ధరించాలి.ఆటోలో అనుమతించిన సంఖ్య కంటే ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించకూడదు. ముఖ్యంగా డ్రైవర్ సీటు పక్కన ప్రయాణికులను కూర్చోబెట్టుకోవడం చట్టరీత్యా నేరం.ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా ఉండటానికి, కేవలం కేటాయించిన ఆటో స్టాండ్‌లు లేదా సురక్షితమైన ప్రదేశాలలో మాత్రమే ప్రయాణికులను ఎక్కించడం లేదా దింపడం చేయాలి.మద్యం సేవించి వాహనం నడపడంపై ero Tolerance పాటించబడుతుంది.నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనం సీజ్ చేయడంతో పాటు లైసెన్స్ రద్దు చేయబడుతుంది.ఆటోలు ఎల్లప్పుడూ ఎడమ వైపు లేన్ లోనే ప్రయాణించాలి. రహదారి మధ్యలో అకస్మాత్తుగా ఆపడం లేదా జిగ్-జాగ్ డ్రైవింగ్ చేయడం చేయకూడదు.అదేవిధంగా ఆటో డ్రైవర్లకు అబిడ్స్ లోని నియో రెటీనా హాస్పిటల్ లో ఉచిత కంటి పరీక్షలు చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ మధుసూదన్, ఎస్.ఐ లు పాండురాజు, మహేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## భువనగిరి బస్టాండ్‌లో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం





**భువనగిరి, ఏప్రిల్ 16 (వెలుతురు న్యూస్):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో 19వ వార్డులోని బోనగిరి బస్టాండ్‌లో బుధవారం 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్, భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, డీఎస్పీ రవీందర్ యాదవ్, ట్రాఫిక్ సీఐ పాల్గొన్నారు చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ గారు మాట్లాడుతూ "రోడ్డు ప్రమాదాలను నివారించడం మనందరి బాధ్యత. హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా వాడాలి. 18 ఏళ్లు నిండి, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారే వాహనాలు నడపాలి. మీ భద్రత మీ కుటుంబానికి భరోసా" అని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్ గారు మాట్లాడుతూ "అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ ప్రాణాంతకం. ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రాణాలు కాపాడుకోండి" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రయాణికులు, ఆటో డ్రైవర్లు, స్థానిక ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కరపత్రాలు పంపిణీ చేసి, ప్రమాదాల వల్ల కుటుంబాలు ఎదుర్కొనే కష్టాలను వివరించారు. కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, స్థానిక కౌన్సిలర్ బండారి స్వర్ణలత, బర్రె ప్రవీణ్ మున్సిపల్ కమిషనర్, రవాణా శాఖ అధికారులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంద్రపాలనగరం గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనుల ప్రారంభం సర్పంచ్ గర్దాస విక్రమ్



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 16:** గత కొన్ని సంవత్సరాలనుండి సమస్య గా మారిన పశువుల దవాఖాన ముందు ఉన్న ప్రమాదకర డ్రైనేజీ,వడ్ల మార్కెట్ వద్దకు వెళ్లే రైతులకు వాహనాలకు ఇబ్బంది గా ఉండడం తో పాటు అనేక ప్రమాదాలు జరగుతున్న పరిస్థితి లను గుర్తించిన సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ శాశ్వత పరిష్కారం కోసం సిమెంట్ పైపులు తో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వేసే పనుల ను ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, వరికుప్పల స్వామి,పుట్టల లక్ష్మమ్మ ముత్యాలు,వడ్లకొండ లక్ష్మి మల్లేశం,కంబాలపల్లి సత్తయ్య, నల్ల ఎల్లేష్,చిన్నలచ్చి శంకరమ్మ, రేపాక పారిజాత, కప్పల మంగమ్మ రాజు సీనియర్ నాయకులు మందడి విధ్యాసాగర్ రెడ్డి,కాటపల్లి యాదయ్య మాజీ సర్పంచ్,ఈర్లపల్లి మల్లయ్య,సింగణబోయిన గణేష్,మంటిలింగస్వామి, రాస వెంకటేష్, రవ్వ నర్సింహా, మందడి శ్రీధర్ రెడ్డి,సింగణబోయిన జంగయ్య, సింగణబోయిన సత్యనారాయణ, కంబాలపల్లి శ్రీశైలం, జిట్టబోయిన వెంకటేష్,నల్ల రామస్వామి,మాధం నగేష్, గర్ధాస్ వెంకటేష్, గడ్డం సాయి, గర్ధాస్ శ్రీకాంత్, గాడ్డుల సత్యనారాయణ, నల్ల శివయ్య,చిన్నలచ్చి చంద్రయ్య, మల్లెబోయిన గణేష్,రాజన్నగారి మురళి, నీరుడు వెంకటేష్,వడ్లకొండ బిక్షం,నీరుడు నరేష్,పంచాయతీ సిబ్బంది అమినొద్దిన్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.


## పదివేల ఆర్థిక సహాయం అందించిన కందిమల్ల గోపాల్ రెడ్డి సర్పంచ్ నిర్నంల



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 16:** నీర్నంల గ్రామానికి చెందిన గంగుల శశికళ అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించినారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు 10,000 రూపాయల ఆర్థిక సహాయం అందించినారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగుల వెంకటరెడ్డి వార్డు మెంబర్స్ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ బీర్ల ను చర్చకు రమ్మనే స్థాయి కల్లూరికి లేదు

### వార్డు మెంబర్ గా గెలవలేని కల్లూరి రామచంద్రారెడ్డి పూటకో పార్టీ మార్చే వ్యక్తి అంటూ యాదగిరిగుట్ట కాంగ్రెస్ నేతల ఫైర్



**యాదగిరిగుట్ట , ఏప్రిల్ 16 వెలుతురు** ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ను చర్చకు రమ్మని పిలిచే స్థాయి బిఆర్ఎస్ నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి కి లేదని ఆయన బీర్ల ఐలయ్య పై అర్థం లేని విమర్శలు ఆరోపణలు చేస్తున్నారని యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం తీవ్రంగా ధ్వజమెత్తారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణంలోని బీర్ల నిలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. రాజపేట మండలం చల్లూరు క్రషర్ కంపెనీకి బీర్ల ఐలయ్యకు సంబంధం ఉందంటూ నిరాధారమైన ఆరోపణలు చేస్తూ బహిరంగ చర్చకు రమ్మని సవాలు విసిరే స్థాయి కల్లూరి రామచంద్రారెడ్డికి ఎక్కడిదని వారు ప్రశ్నించారు. బీర్ల ఐలయ్య పై ఏదో ఒక రకంగా బురద చల్లాలని చూస్తూ ఆరోపణలు చేయడం తగదని అన్నారు. కనీసం వార్డు మెంబర్గా కూడా గెలవలేని కల్లూరు రామచంద్రారెడ్డి పూటకో పార్టీ మార్చే వ్యక్తి అని వారు తీవ్రంగా విమర్శించారు. నారాయణ రావు అనే వ్యక్తి 2019 లోని క్రషర్ మైనింగ్ కంపెనీని రాజపేట మండలం చల్లూరు లో ఏర్పాటు చేశారని అన్నారు. అప్పట్లో ఆ కంపెనీకి పర్మిషన్ ఇచ్చింది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. ఆ కంపెనీకి అన్ని రకాల అనుమతులు, విద్యుత్ కనెక్షన్ ఇచ్చింది బిఆర్ఎస్ ప్రభుత్వం కాదా ? అని నిలదీశారు. 2023లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగా ఆలేరు ఎమ్మెల్యేగా బీర్ల ఐలయ్య గెలుపొందారని అన్నారు. బీర్ల ఐలయ్య ఎమ్మెల్యే కాకముందు నుండే ఆ కంపెనీ నడుస్తుందని అన్నారు. కావాలని బడుగు బలహీన వర్గాల నాయకుడు బీర్ల ఐలయ్య పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎలాంటి ఆధారం లేని పొంతనలేని విమర్శలు ఆరోపణలు చేయడం తగదని అన్నారు. బహిరంగ చర్చకు రమ్మని సవాలు విసిరే స్థాయి కల్లూరి రామచంద్ర రెడ్డి కి ఎక్కడిదని వారు అన్నారు. వార్డు మెంబర్గా కూడా గెలవలేని కల్లూరి రామచంద్రారెడ్డి అనేక పార్టీలు మారుతూ తన రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. ఏ పార్టీలో నిలకడ లేని ఆయన ఐలయ్య పై విమర్శలు చేయడం తగదని అన్నారు. కల్లూరి రామచంద్ర రెడ్డికి బుద్ధి చెప్పడానికి కాంగ్రెస్ కార్యకర్తలం సరిపోతామని అన్నారు . ఆయన ఎక్కడికి వస్తారో చెప్తే కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ వచ్చి ఆయన కు తగిన విధంగా బుద్ధి చెబుతామని అన్నారు. ఇకపై బీర్ల ఐలయ్య పై లేనిపోని విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు అంతా కలిసి కల్లూరి రామచంద్ర రెడ్డి ని తరిమికొడతామని అన్నారు. ఆయన ఎక్కడ తిరగకుండా అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇక ఎప్పటికీ అధికారంలోకి రాలేమని బిఆర్ఎస్ నాయకులకు భయం పట్టుకుందని, ఆ పార్టీ మళ్ళీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని అన్నారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ నిత్యం ప్రజల్లో ఉండే బీర్ల ఐలయ్య పై ఏదో ఒక విమర్శ చేయాలని ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తున్నారని అన్నారు . ఇకపై తమ నాయకుడు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పై ఇలాంటి ఆరోపణలు చేస్తే సహించబోమని గట్టిగా తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బరిగే రమ్య రామచందర్, మాజీ ఉపసర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుండ్లపల్లి భరత్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బంధారపు బిక్షపతి గౌడ్, కౌన్సిలర్ బూడిద మధు , గౌలి కార్ అరుణ రాజేష్, కాల్నే భాస్కర్ , మహమ్మద్ సలాం, గుడ్ల నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 99 రూపాయలు ఇవ్వకుండా 99 రోజుల ప్రోగ్రాం పెడితే ఎలా

### కంభంపాటి శ్రీనివాసులు గౌడ్ సర్పంచ్ పల్లివాడ

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 16:** 99 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయం నందు జరిగిన సమావేశంలో టిఆర్ఎస్ సర్పంచులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రామన్నపేట మండలానికి కేంద్ర ప్రభుత్వం నిధులతో మహిళా సంఘం బిల్డింగులు వస్తే కేవలం అధికార పార్టీకి చెందిన సర్పంచులు ఉన్న గ్రామాల్లో నిధులు కేటాయించారు. తప్ప ప్రతిపక్ష పార్టీలను టిఆర్ఎస్ సిపిఎం పార్టీలు గెలిచిన గ్రామాల్లో మహిళా సంఘం బిల్డింగులు కేటాయించకపోవడం చాలా విడ్డూరంగా ఉంది. అని తెలిపారు. పెద్ద గ్రామ పంచాయతీలో అయినా వెల్లంకి, సిరిపురం, బోగారం, ఇంద్రపాలనగరం, పల్లివాడ, లక్ష్మాపురం, దుబ్బాక, మునిపంపుల కుంకుడు పాముల గ్రామాలకు మొదటగా అధికారులు తీర్మానం కాపీ ఇవ్వవలసిందిగా కోరి తర్వాత ప్రతిపక్ష పార్టీలైన ఈ గ్రామాలకు నిధులు కేటాయించకపోగా తీర్మానం కాపీలు తీసుకొని ఎక్కడ పెట్టారో అర్థం కావడం లేదు. కేంద్ర ప్రభుత్వ నిధులు కేటాయించడంలో కూడా అధికారులు అలసత్వం వహించడం ఎలా సవతి తల్లి ప్రేమ చూపించడం ఎలా ఒక్కొక్క గ్రామంలో 30 నుంచి 100 సంఘాల పైన ఉన్నాయి. ఉద్దేశపూర్వకంగా నిధులు కేటాయించకపోవడం మంజూరైన గ్రామాల అలాట్మెంట్ కాపీలు ఇవ్వమని అడగగా నేటికీ ఇవ్వకపోవడం చాలా విడ్డూరంగా ఉంది. అని తెలిపినారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా 99 రూపాయలు ఇవ్వకుండా కార్యక్రమాలు చేయాలి. అంటే ఎలా సర్పంచులుగా బాధ్యతలు తీసుకొని నాలుగు నెలలు అవుతున్న గ్రామపంచాయతీ కుర్చీలనుంచి మొదలు టేబుల్ ల వరకు సొంత ఖర్చులతో భరించడం విడ్డూరంగా ఉందని 15 ఫైనాన్స్లో వచ్చిన నిధులు 95% గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాలపై వెళ్లినవి అని తప్పకుండా జీతాలు ఇవ్వాలని 15 ఫైనాన్స్ యొక్క రూల్ అని అధికారులు



తెలపడం చాలా విడ్డూరం. పల్లివాడ గ్రామపంచాయతీ 60 లక్షల కరెంటు బిల్లుతో ఉంది. అని గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో ఇచ్చిన వాటర్ ట్రాక్టర్ యొక్క ట్యాంకీలు శిథిలావస్థలో రావడం ప్రజలకు చావులకు బ్రతుకులకు సంబంధించిన వాటర్ సప్లై చేయాలి. అన్న వాటి రిపేరుకు నిధులు లేకపోవడం చాలా విడ్డూరం అని గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారని అధికారుల తీరు బిడ్డూరంగా ఉందని

తెలిపినారు. ఇంద్ర పాలనగరం సర్పంచ్ గర్దాస్ విక్రమ్ మాట్లాడుతూ సమావేశంలో గ్రామంలో కరెంటు సంబంధించిన సమస్య ఉంది. అని అధికారుల దృష్టికి తీసుకువచ్చినారు. అనంతరం గ్రామానికి సంబంధించిన ఐకెపి సెంటర్లలో ప్రారంభోత్సవానికి గ్రామ సర్పంచులను కూడా పిలవకపోవడం విడ్డూరంగా ఉందని గతంలో ఐకెపి సెంటర్కు కేటాయించిన స్థలాన్ని గ్రామంలో ఉన్న రైతులు అనుకూలంగా ఉంది. అధికారులు మాత్రం అక్కడ ఉన్న వడ్ల కుప్పలకు డబ్బులు రావు అని తెలపడం విడ్డూరంగా ఉంది. అని తెలిపినారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక గ్రామ సర్పంచికి తెలవకుండా స్పెషల్ అధికారి ఏ విధంగా లిస్ట్ ప్రిపేర్ చేస్తాడు. అని అందుకు మేము సర్పంచ్లుగా ఎలాంటి బాధ్యతల్లో ఉండాలి. అని ప్రశ్నించినారు. తక్షణమే సంబంధిత అధికారి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల కమిటీ చైర్మన్గా గ్రామ సర్పంచ్ ఉంటాడని గ్రామంలో ఉన్న ప్రతి అంశానికి సర్పంచ్ ద్వారా అధికారుల దృష్టికి రావాలి. తెలిపినారు.

అనంతరం స్పెషల్ అధికారి మాట్లాడుతూ సర్పంచ్ల లకు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం నిధుల పైన రాష్ట్ర ప్రభుత్వ నిధుల పైన అధికారులు వివక్ష చూపకుండా అందరికీ సమానంగా పంచాలి. అని అధికారులు జాగ్రత్తగా ఉండాలని తెలిపినారు.

అనంతరం స్పెషల్ అధికారి ప్రతి అంశాన్ని పరిగణలోకి తీసుకొని ఐకెపి సంబంధించిన అధికారిని ప్రశ్నించి తక్షణమే పరిష్కారం చూపాలని తెలిపినారు. అధికారి మాట్లాడుతూ గ్రామానికి వెళ్లి ఎంక్వయిరీ చేసి రైతులకు అనుకూలమైన స్థలాన్ని కేటాయిస్తానని తెలిపినారు. మహిళా సంఘానికి సంబంధించిన బిల్డింగుల నిధులు ఎంపీడీవో కార్యాలయం నందు ఎంపిక జరిగిందని తమ పరిధిలోకి రాని అంశమని తెలిపినారు. లక్ష్మాపురం సర్పంచ్ ఐకెపి సెంటర్ ఓపెనింగ్ కు పిలిచి తాను చేరేలోపే ఓపెనింగ్ చేశారని తెలిపినారు. బోగారం సర్పంచ్ మాట్లాడుతూ కోనూరు సాయికుమార్ గౌడ్ మాట్లాడుతూ ఐకెపి సెంటర్లలో ఓపెనింగ్ కార్యక్రమాకి గ్రామ సర్పంచిని

పిలువకపోవడం చాలా విడ్డూరంగా ఉందని తెలిపినారు. మునిపంపుల గ్రామ సర్పంచి బొడ్డుపల్లి వెంకట్ మాట్లాడుతూ,రెండో విడత ఇచ్చే ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో సర్పంచుల యొక్క ప్రమేయం ఏమైనా ఉంటుందా అని ప్రశ్నించినారు. గత సంవత్సరం కాలం నుంచి పింఛన్లకు సంబంధించిన అర్హులైన ప్రతివారు ఆన్లైన్లో అప్లై చేసుకుని తమ దృష్టికి తీసుకువచ్చారని అట్టి పత్రాలను భద్రపరుచుటకు మీ దగ్గర ఏమైనా సమాచారం ఉందా అని ప్రశ్నించినారు. తక్షణమే సంబంధిత అధికారి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి గ్రామ సర్పంచే చైర్మన్గా ఉంటాడని ఆయన ఆధ్వర్యంలో మాత్రమే జరుగుతుంది. అని పింఛన్లకు సంబంధించిన అంశం రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వగానే తక్షణమే అమలు చేస్తామని అప్లై చేసిన ప్రతి వారి డాటా తమ దగ్గర భద్రంగా ఉంది అని తెలిపినారు. ఏది ఏమైనా 99 రోజుల ప్రణాళిక జరిగిన కార్యక్రమంలో ప్రతిపక్ష పార్టీలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయడం కోసమేరుపు.

# రంగారెడ్డి జిల్లా కొండాపూర్ ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆరోగ్య శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ

**కొండాపూర్ వెలుతురు న్యూస్ ఏప్రిల్ 16:** రంగారెడ్డి జిల్లా కొండాపూర్ ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆరోగ్య శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ శ్రీమతి సంగీత సత్యనారాయణ గారు రంగారెడ్డి జిల్లా ఆసుపత్రి కొండాపూర్ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె తెలంగాణ డయాగ్నస్టిక్ జిల్లా హక్కు అందిస్తున్న పరీక్షలకు సంబంధించి క్షుణ్ణంగా వైద్యులచే సమీక్షించారు ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు 134 వైద్య పరీక్షలు సకాలంలో నిర్వహించి సరైన సమయంలో రిపోర్టులు అందించాలని ఆమె ఆదేశించారు అదేవిధంగా రంగారెడ్డి జిల్లాలోని ఆసుపత్రుల మాతా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ప్రతి గర్భిణీకి ఎం సి హెచ్ పోటోల్లో నమోదు చేసి వారిని ప్రత్యేక శ్రద్ధ వహించాలని మరియు జిల్లాలు అసంత్రి అసంక్రమిత వ్యాధులైన రక్తపోటు



మధుమేహం సంబంధించిన రోగులకు సరైన మందులు మరియు ఫాలోఅప్ నిర్వహించాలని వైద్యులను ఆదేశించారు అదేవిధంగా వికలాంగులు ఆస్పత్రులకు సౌకర్యంగా వెళ్లేందుకు రైలింగ్ ర్యాంపు మరియు వీల్ చైర్లు ఇదిగా ఉండాలని మరియు వర్షపునీటి సేకరణ గొయ్యి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఆదేశించారు బస్తీ దవఖానాల్లో ఏర్పడ్డ వైద్యుల కాళీ పోస్టులను మరియు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను యూపీఎస్సీలలో ఐసిటీ సెంటర్లలో వెంటనే భర్తీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఆదేశించారు అలాగే కొండాపూర్ లోని నిర్మాణంలో ఉన్న గ్రామకేర్ సెంటర్ ను కమిషనర్ పరిశీలించారు ఈ విధంగా కమిషన్ కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలోని 30% ఆసుపత్రులు జాతీయ నాణ్యతా ప్రమాణాలు ఆమోదం పొందాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి మరియు కొండాపూర్ డిసిహెచ్ఎస్ డాక్టర్ అనురాగిణి మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ చంద్ర కృష్ణ మరియు జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు మరియు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

# పార్లమెంట్‌లో తెలంగాణపై అవమానకర వ్యాఖ్యలు

### తేజస్వి సూర్యపై ఎమ్మెల్యే మాణిక్‌రావు ఘాటు విమర్శలు...

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 16:**పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్--పాకిస్థాన్ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలపై సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ శాసనసభ్యులు కొణింటి మాణిక్‌రావు తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ వ్యాఖ్యలు అవివేకపూరితమైనవని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేవిగా ఉన్నాయని ఆయన మండిపడ్డారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం భారత రాజ్యాంగానికి లోబడి, దేశ అత్యున్నత శాసనసభ అయిన పార్లమెంట్ ఆమోదంతో ఏర్పడిందని స్పష్టం చేశారు. ఇది ఎటువంటి



విద్వేషపూరిత విభజన కాదని, ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగా ఏర్పడిన రాష్ట్రం అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం లక్షలాది మంది ప్రజల దశాబ్దాల పోరాటం, అమరుల త్యాగాల ఫలితమని గుర్తుచేశారు.అలాంటి చారిత్రక ఉద్యమాన్ని పాకిస్తాన్--భారత్ విభజనతో పోల్చడం దుర్మార్గమని ఆయన తీవ్రంగా విమర్శించారు. బీజేపీ ఎంపీలు మిడిమిడి జ్ఞానం, అవగాహనా లోపంతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై అసత్య వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు.ఉద్దేశపూర్వకంగానే తెలంగాణ ఏర్పాటుపై దాడి చేస్తున్నారని అన్నారు.తెలంగాణ ప్రజల ఓట్లతో ఎంపీలుగా ఎన్నికైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీలు తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఖండించాలని మాణిక్‌రావు డిమాండ్ చేశారు. పార్లమెంట్ వేదికగా చేసిన ఈ వ్యాఖ్యలపై బీజేపీ పార్టీతో పాటు తేజస్వి సూర్య వెంటనే క్షమాపణ చెప్పాలని కోరారు.తెలంగాణ ప్రజల గౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, అవసరమైతే ప్రజాస్థాయిలో పోరాటం కొనసాగిస్తామని ఎమ్మెల్యే మాణిక్‌రావు స్పష్టం చేశారు.

# తెలంగాణపై అవమానకర వ్యాఖ్యలు... తేజస్వి సూర్యపై ఆగ్రహం

### -- సస్పెన్షన్, రాజీనామా కోరిన ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. నరోత్తం...

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 16:**బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విభజనను భారత్--పాకిస్థాన్ విభజనతో పోల్చిన వ్యాఖ్యలపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యాఖ్యలను ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. నరోత్తం ఘాటుగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనేది అన్ని వర్గాల ప్రజల సుదీర్ఘ పోరాటం, అమరవీరుల త్యాగాల ఫలితమని గుర్తుచేశారు. రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఏర్పడిన తెలంగాణను విద్వేషపూరిత భారత్--పాకిస్థాన్




విభజనతో పోల్చడం తీవ్రంగా అభ్యంతరకరమని అన్నారు.ఒక పార్లమెంట్ సభ్యుడిగా బాధ్యతతో వ్యవహరించాల్సిన తేజస్వి సూర్య, ప్రాంతీయ భావోద్వేగాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం సరికాదని విమర్శించారు. ఇటువంటి వ్యాఖ్యలు దేశ ఐక్యతను దెబ్బతీసేలా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన తేజస్వి సూర్యను వెంటనే బీజేపీ పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, ఆయన ఎంపీ పదవికి రాజీనామా చేసి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరారు.ఇలాంటి వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, తెలంగాణ ప్రజల గౌరవాన్ని కాపాడేందుకు అవసరమైన పోరాటం కొనసాగిస్తామని వై. నరోత్తం స్పష్టం చేశారు.

# విద్యుత్ ఆర్టిసన్ ఉద్యోగుల సమ్మెకు బీజేపీ సంపూర్ణ మద్దతు -- ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు...

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 16:**సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ చేపట్టిన సమ్మెకు భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబా జగన్నాథ్ మాట్లాడుతూ, ఆర్టిసన్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని తీవ్ర విమర్శలు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన సమయంలో విద్యుత్ ఆర్టిసన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ హామీలను విస్మరించడం బాధాకరమని ఆయన అన్నారు. ఆర్టిసన్ ఉద్యోగులను విద్యార్హతల ఆధారంగా కన్వర్షన్ చేయాలని, రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగానే వారికి కూడా రెగ్యులరైజేషన్ చేసి సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరి "సవతి తల్లి ప్రేమ"లా ఉందని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు పూల సంతోష్, సీనియర్ నాయకులు సుదీర్ బండారి, కౌన్సిలర్లు బొగ్గుల సంతోష్, అప్పం శ్రావణ్, వివిధ మండల అధ్యక్షులు




వైద్యనాథ్, మల్లేష్, బంటు విశ్వనాథ్ తదితర నాయకులు పాల్గొన్నారు.విద్యుత్ ఆర్టిసన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ప్రమాదాలకు అడ్డుకట్ట... రంజోల్‌లో వారాంతపు సంత మార్పు

### -- ట్రాఫిక్ సమస్యలకు చెక్...

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 16:**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత కార్యక్రమం కింద సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని రంజోల్ ప్రాంతంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రధాన రహదారిపై నిర్వహించే వారాంతపు సంత కారణంగా రోజురోజుకీ ట్రాఫిక్ సమస్యలు పెరిగి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రద్దీ సమయంలో ప్రమాదాల ముప్పు పెరుగుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా పాలిటెక్నిక్ రహదారిని చదును చేసి, వారాంతపు సంతను అక్కడికి మార్చారు. దీంతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గి, వాహనాల రాకపోకలు సులభతరం అవుతాయని అధికారులు తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయం ప్రమాదాల నివారణలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ కాశీనాథ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. రోడ్డు భద్రత కోసం తీసుకుంటున్న



చర్యలను స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ, ఇలాంటి నిర్ణయాలు మరింతగా అమలు చేయాలని కోరుతున్నారు.

# పాఠశాలలోని ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అంకిత భావంతో పని చేస్తూ ఉండడం అభినందించదగ్గ విషయం







**సరూర్నగర్ వెలుతురు ఏప్రిల్ 16:**గురువారం గౌరవ రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్ సరూర్నగర్ లోని వీ.ఎం.హోమ్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా మంత్రికి పాఠశాలలోని టీ.జ.జ విద్యార్థులు గౌరవ వందనంతో స్వాగతం పలికారు. పాఠశాలలోని క్రీడా ప్రాంగణం నందు క్రికెట్ కోర్టును మంత్రి ప్రారంబించడం జరిగింది.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ఈ పాఠశాలలోని ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అంకిత భావంతో పని చేస్తూ ఉండడం అభినందించదగ్గ విషయం అని పేర్కొన్నారు. ఈ పాఠశాల విద్యార్థులు విద్యారంగం లోను, క్రీడా రంగంలోను మంచి ఫలితాలను సాధిస్తూ రాష్ట్ర స్థాయిలో అభినందనలు పొందడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులతో మంత్రి ముఖముఖిగా మాట్లాడి విద్యాపరమైన విషయలలో ఉపాధ్యాయుల పనితీరును, మరియు అందుతున్న వసతులను తెలుసుకోవడం జరిగింది. పాఠశాల తరగతి గదులను, కంప్యూటర్ ల్యాబ్ ను, లైబ్రరీ సందర్శిచడం జరిగింది. వీ.ఏం. హోమ్ విద్యార్థినీ, విద్యార్థినిలతో కలిసి సంహ పంక్తి భోజనం చేయడం జరిగింది. బోజనం పట్ల, మెనూ పట్ల మంత్రి గారు సంతృప్తి చెందారు. ఇక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బందికి సంబందించిన సమస్యలను మంత్రికి వివరించగా సమస్యల పట్ల మంత్రి సానుకలంగా స్పందించడం జరిగింది."ఈ కార్యక్రమంలో వి.ఏం.హోమ్ పాఠశాల కార్యదర్శి/డిడి సోషల్ వెల్ఫేర్ జే రామారావు, పాఠశాల ప్రిన్సిపాల్ సి నరసింహారెడ్డి, పాఠశాల సూపరింటెడెంట్ శ లక్ష్మీపార్వతి, మరియు ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గోన్నారు.

# భూమి సుపోషణపై అవగాహన కార్యక్రమం

### -- మట్టి పరీక్షల ప్రాముఖ్యతపై రైతులకు మార్గనిర్దేశం...





**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 16:**సంగారెడ్డి జిల్లా రైకోడ్ మండలం నాగ్వర్ మరియు హుమ్నపూర్ గ్రామాల్లో డి.డి.యస్--కేవీకే ఆధ్వర్యంలో భూమి సుపోషణ మరియు సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భూసార పరీక్ష నిపుణులు ఈ. స్వామి రైతులకు మట్టి పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు.పొలం నుండి మట్టి నమూనాలను ఎలా, ఎప్పుడు సేకరించాలి అనే విషయాలపై ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. మట్టి పరీక్షల ద్వారా భూమిలోని పోషక విలువలు, ఉదజని సూచిక (జూ౨), నీటిలో కరిగే లవణాల శాతం, సేంద్రియ కార్బన్ స్థాయిలను తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ వివరాల ఆధారంగా సరైన యాజమాన్య చర్యలు చేపడితే పంటల దిగుబడులు మెరుగుపడతాయని సూచించారు.అదేవిధంగా రైతులకు సేంద్రీయ వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించారు. పచ్చిరొట్ట ఎరువులు, వేర్మికంపోస్ట్, ఘనజీవామృతం, పంచగవ్య, జీవామృతం వంటి సేంద్రీయ ఎరువుల ఉపయోగాలు మరియు వాటి పోషక విలువలను వివరించారు. పంట మార్పిడి, అంతర పంటలు, భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువుల వినియోగం వల్ల మంచి ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు.కార్యక్రమం ముగింపులో ముందుగా సేకరించిన మట్టి నమూనాల పరీక్ష ఫలితాలను స్థానిక సర్పంచుల చేత రైతులకు అందజేసి, వాటి విశ్లేషణను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, డి.డి.యస్ సూపర్‌వైజర్లు ప్రహ్లాద్, వినయ్, మహిళా రైతులు మరియు ఇతర రైతులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ లో ఘనంగా 'అరైవ్ అలైవ్' హెల్మెట్ బైక్ ర్యాలీ

### -- 500 మందితో జహీరాబాద్‌లో రోడ్డు భద్రత సందేశం....



**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 16:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా 'అరైవ్ అలైవ్' రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం జహీరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర డీజీపీ మరియు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా మహీంద్రా కంపెనీ నుండి మెథడిస్ట్ చర్చి వరకు భారీ హెల్మెట్ బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీ జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం పర్యవేక్షణలో, ఎస్ఐ వినయ్ కుమార్, గ్రామీణ ఎస్ఐ కాశీనాథ్, చిరగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో క్రమశిక్షణతో కొనసాగింది. రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 500 మందికి పైగా బైక్ రైడర్లు హెల్మెట్‌లు ధరించి పాల్గొని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా సీఐ శివలింగం మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ వంటి పత్రాలను ఎప్పుడూ వెంట ఉంచుకోవాలని సూచించారు. ప్రతి వాహనానికి ఇన్సూరెన్స్ ఉండడం అవసరమని, ప్రమాద సమయాల్లో అది ఆర్థిక రక్షణను కల్పిస్తుందని వివరించారు.ఈ భారీ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రైడర్లు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలకు పోలీస్ అధికారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ విభజనను భారత్-పాక్ విభజనతో పోల్చడమా?

### - తేజస్వి సూర్యపై నామ రవికిరణ్ నిప్పులు...



**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 16:**-తెలంగాణ ఏర్పాటుపై బీజేపీ నేతలు మరోసారి తమ అక్కసును వెళ్లగక్కారని బీఆర్ఎస్ నాయకుడు నామా రవికిరణ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంటు సాక్షిగా తెలంగాణ ఆవిర్భావంపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. తెలంగాణ విభజనను భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇది తెలంగాణ అస్తిత్వాన్ని అవమానించడమేనని రవికిరణ్ మండిపడ్డారు. తెలంగాణ లక్షలాది మంది ప్రజల సుదీర్ఘ పోరాటం, ఎంతోమంది బలిదానాల ఫలితం. అలాంటి పవిత్రమైన ఉద్యమాన్ని కించపరచడం బీజేపీ నాయకులకు అలవాటుగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అదే సభలో ఉన్న తెలంగాణకు చెందిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, తమ ప్రాంతాన్ని అవమానిస్తుంటే మౌనంగా ఉండటం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. కనీసం తోటి ఎంపీని అడ్డుకోవడంలో లేదా తప్పును సరిదిద్దడంలో వారు విఫలమయ్యారని ఎద్దేవా చేశారు.

తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడిన తేజస్వి సూర్య వెంటనే తెలంగాణ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని నామా రవికిరణ్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటును తక్కువ చేసి మాట్లాడటం అంటే.. ఇక్కడి ప్రజల ఆకాంక్షలను, అమరవీరుల త్యాగాలను అవమానించడమే. బీజేపీ తన వైఖరిని మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెప్తారని నామ రవికిరణ్ పేర్కొన్నారు

# కామారెడ్డి ఇండోర్ స్టేడియం పనులు పరిశీలించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్





## విద్యార్థులతో కబడ్డీ ఆడి ప్రోత్సహించిన కలెక్టర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) ఏప్రిల్ 16**జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియం పక్కన నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియం పనులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, జరుగుతున్న పనుల నాణ్యతను అంచనా వేసి, ప్రాజెక్టును నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి అవసరమైన మార్గదర్శకాలను సంబంధిత అధికారులకు అందించారు.అలాగే అక్కడ నిర్వహిస్తున్న కబడ్డీ సమ్మర్ కోచింగ్ క్యాంపును సందర్శించి, విద్యార్థులతో కలిసి కబడ్డీ ఆడి వారిని ప్రోత్సహించారు. ఈ ఇండోర్ స్టేడియంలో 4 షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు, యోగా హాల్, ఇండోర్ గేమ్స్ సదుపాయాలు, జిమ్, రైఫిల్ షూటింగ్, స్క్వాష్ కోర్ట్ వంటి ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. జిల్లాలో యువతకు క్రీడలు, వినోద కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని కలెక్టర్ తెలిపారు. ఇందిరాగాంధీ స్టేడియాన్ని అన్ని రకాల క్రీడా సదుపాయాలతో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఆర్డీవో ఎన్.వై. గిరి, పబ్లిక్ హెల్త్ డీఈ సంతోష్, కాంట్రాక్టర్ ఏజెన్సీ సభ్యుడు వెంకటరమణ, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఫస్ట్ మార్కులు కరీంనగర్ లోని కోట రెజోనెన్స్ విద్యార్థులకు రావడం గర్వకారణం





## విద్యార్థుల అభినందన సభలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

## కరీంనగర్లో కోట రెజోనెన్స్ జూనియర్ కళాశాల బ్రాండ్ ఇమేజ్ గా మారింది

## సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 16:** కరీంనగర్ లోని కోట ఇన్స్టిట్యూట్ వారి రెజోనెన్స్ జూనియర్ కాలేజ్ కరీంనగర్ కు ఇంటర్ ఫలితాల ద్వారా రాష్ట్ర స్థాయి గుర్తింపు తెచ్చి పెట్టిందని ఇది కరీంనగర్ కు గర్వకారణమని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు కరీంనగర్ లోని రేకుర్తి లో గల కెపిఎస్ హైస్కూల్లో కోట రెజోనెన్స్ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి ఫస్ట్ మార్కులు వచ్చిన సందర్భంగా బుధవారం ఏర్పాటుచేసిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు కరీంనగర్లో అనతి కాలంలోనే కార్పొరేట్ కళాశాలలను తలదన్నేలా గ్రామీణ ప్రాంతం నుండి మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలనే ఉద్దేశంతో ఉత్తమ పౌరులుగా తయారు చేయాలనే సంకల్పంతో కోట విద్యాసంస్థలను స్థాపించిన చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు ప్రపంచంలో చదువును మించిన ఆయుధం లేదని కష్టపడి చదువుకున్న వారే ఉన్నత స్థానాలలో ఉన్నారని కోట విద్యాసంస్థలు భవిష్యత్తులో మరిన్ని అద్భుత విజయాలు సాధించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆకాంక్షించారు మరో అతిథి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వచ్చిన అంజిరెడ్డి కరీంనగర్ కు రాష్ట్రస్థాయిలో కీర్తి తీసుకురావడం మనందరికీ గర్వకారణం అన్నారు ఫలితాలు రావడానికి ఇంకా టైం పడతది అనుకున్నా ఒక యజ్ఞంలా కృషిచేసి తొందరలోనే ఫలితం వచ్చేలా కృషిచేసిన డాక్టర్ డి అంజిరెడ్డి ఇదే స్ఫూర్తితో రాష్ట్రస్థాయి పరంపర కొనసాగించాలని కోరారు కోట ఇన్స్టిట్యూట్ అనేది ఇప్పుడు కరీంనగర్లో బ్రాండ్ ఇమేజ్ గా మారిందని కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు రాబోయే రోజుల్లో నెంబర్ వన్ గా కరీంనగర్ను తీర్చిదిద్దాలనే దానికి కోట విద్యాసంస్థలు బాటలు వేశాయని అన్నారు మరో అతిథి ట్రస్మ అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు మాట్లాడుతూ కోట విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి యొక్క క్రమశిక్షణ అతనిని బ్రాండ్ ఇమేజ్కు దగ్గరగా తీసుకు వెళ్లిందని అన్నారు కోట విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి మాట్లాడుతూ ఇక్కడి విద్యార్థులు ఎక్కడికో వెళ్లకుండా స్మార్ట్ క్లాస్ విద్యా విధానం ద్వారా స్థానికంగానే మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో కోట విద్యాసంస్థలను స్థాపించి తొలి ప్రయత్నం లోనే రాష్ట్రస్థాయి మార్కులు సాధించడం గర్వకారణంగా ఉందని అన్నారు విద్యార్థులు వారి తల్లిదండ్రులు అధ్యాపక బృందం ఇచ్చిన ప్రోత్సాహంతో భవిష్యత్తులో మరిన్ని సంచలనాలు నమోదు చేస్తామని డాక్టర్ డి అంజిరెడ్డి అన్నారు రాష్ట్రస్థాయిలో ఫస్ట్ మార్క్ సాధించిన ప్రథమ సంవత్సరం ఎంపీసీలో గాలి సౌమ్యశ్రీ 469, ద్వితీయ సంవత్సరం కే సహన శ్రీ 995 , ద్వితీయ సంవత్సరం బైపీసీలోజి రోషిని 993 , బైపిసి ప్రథమ సంవత్సరంలో పి శరణ్య438 లను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ట్రస్మా అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు లు అందించి పూల గుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో కోట విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి ప్రిన్సిపాల్ అధ్యాపక బృందం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# బాన్సువాడ పట్టణంలో జాబ్ మేళా విజయవంతం

# 40 మందికి ఉద్యోగ అవకాశాలు





## 40 మందికి ఉద్యోగ అవకాశాలు

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న

## బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి.

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) ఏప్రిల్ 16** కామారెడ్డి జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనలో తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఉత్తర తెలంగాణ జోన్ సెక్రెటరీ చెల్లాపురం శ్రీకాంత్ చేస్తున్న కృషి గొప్పదని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు.వారు మాట్లాడుతూ స్కిల్ ఉంటేనే జాబ్ లో ఏదైనా సాధించవచ్చునని ఉద్యోగాలలో మంచి స్థాయిలో ఎదగవచ్చునని తెలిపారు.అదే విధంగా కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళా విజయవంతం అయిందని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు.వారు మాట్లాడుతూ (టీ.టా) తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ వారి సహకారంతో నిర్వహించే జాబ్ మేళా లో నిరుద్యోగులకు 40 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించరని తెలిపారు. శ్రీ అక్షయ్ HR సర్వీసెస్ హైదరాబాద్,మీచీ ఫార్మా కంపెనీ, డాక్టర్ రెడ్డిస్ ఫౌండేషన్(Tech Jobs) ద్వారా టెన్త్,ఇంటర్,డిగ్రీ,ఎంబీఏ, బి.టెక్,బీఎస్సీ అగ్రికల్చర్,హోటల్ మేనేజ్ మెంట్,మీు పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించారనీ తెలిపారు.వయస్సు 18 నుండి 30 సంవత్సరాలు కలిగిన యువతి, యువకులకు IT కంపెనీలలో (AI/మీా)రంగంలో 7,మీచీ ఫార్మా లో 8 విజయ బయో అగ్రికల్చర్ 22, బ్యాంకింగ్ 4 వంటి తదితర విభాగాల్లో భాగంగా అన్ని రకాల సౌకర్యాలతో కూడిన ఉద్యోగలకు ఎంపిక కావడం గొప్ప విషయం అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ కంపెనీ ల ఎ= మేనేజర్లు బ్రహ్మానందరెడ్డి,శర్మ, కమలాకర్,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో గృహ అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) ఏప్రిల్ 16**అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో గృహ అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించబడింది. జిల్లా అగ్నిమాపక అధికారి ఆర్. సిద్ధాకర్ , ఇన్చార్జ్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఆర్. రవీందర్ రెడ్డి,అగ్నిమాపక సిబ్బంది కలిసి ఎన్ జీ ఓస్ కాలనీని సందర్శించి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ఇందు ప్రియా కాలనీవాసులు హాజరయ్యారు. గృహ అగ్నిప్రమాదాల నివారణ, వాటిని సమర్థంగా ఎదుర్కొనే విధానాలపై అవగాహన కల్పించబడింది. ముఖ్యంగా ఎల్పీజీ గ్యాస్ వంట గది అగ్నిప్రమాదాలు నూనెతో సంభవించే అగ్నిప్రమాదాలపై ప్రత్యేకంగా వివరించారు."స్టాప్, డ్రాప్ అండ్ రోల్" పద్ధతి, చిన్న అగ్నిప్రమాదాలను నియంత్రించేందుకు బ్లాంకెట్ ఉపయోగించే విధానం వంటి భద్రతా చర్యలను ప్రదర్శించారు. అలాగే ఎల్పీజీ సిలిండర్లను సురక్షితంగా వినియోగించే విధానం, అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై ప్రాయోగిక సూచనలు అందించారు.కాలనీ నివాసులు చురుకుగా పాల్గొని అగ్నిమాపక శాఖ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందించారు.అదేవిధంగా ఫైర్ సర్వీస్ వీక్ 2026 సందర్భంగా జిల్లాలోని ఇతర ఫైర్ స్టేషన్ల అధికారులు సిబ్బంది తమ తమ పరిధిలో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని జిల్లా అగ్నిమాపక అధికారి సుధాకర్ తెలిపారు.

## తెలంగాణ యూనివర్సిటీ పాలకమండలి సభ్యునిగా మహమ్మద్ ఘూజి నియామకం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) ఏప్రిల్ 16** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాలకు పాలకమండలి సభ్యులను నియమిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ గారి పేరు మీదుగా రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ యోగిత రాణ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ ఉత్తర్వుల్లో భాగంగా కామారెడ్డి జిల్లా చెందిన మహమ్మద్ ఘూజిని తెలంగాణ యూనివర్సిటీ పాలకమండలి (ఈసీ) సభ్యునిగా నియమిస్తూ జీవో విడుదలైంది.ఈ సందర్భంగా మహమ్మద్ ఘూజి తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ముఖ్యంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తెలంగాణ రాష్ట్రం పేరుతో స్థాపించబడిన తెలంగాణ యూనివర్సిటీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఉండటం గర్వకారణమని ఆయన అన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధి కోసం అన్ని రంగాలలో కృషి చేస్తూ, యూనివర్సిటీని ఉన్నత స్థానంలో నిలిపేందుకు అధికారులతో సమన్వయంగా పనిచేస్తానని తెలిపారు.అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వానికి, తెలంగాణ యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావడానికి తన శాయశక్తులా కృషి చేస్తానని మహమ్మద్ ఘూజి స్పష్టం చేశారు.

### పేద ప్రజలకు సేవలందించడమే ఆలయ ఫౌండేషన్ లక్ష్యం...!

### ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫౌండేషన్ సభ్యులు తీట్ల రమేష్.



**కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 16:**పేద ప్రజలకు అవసరమైన విద్య, వైద్య సదుపాయాలకు సంబందించిన సేవలందించడమే ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి మార్గదర్శనం లో నడుస్తున్న ఆలయ ఫౌండేషన్ లక్ష్యమని ఉమ్మడి కరీంనగర్ జిల్లా సభ్యులు తీట్ల రమేష్ బాబు పేర్కొన్నారు.తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామానికి చెందిన నక్క మొండయ్య భార్య లక్ష్మి కి గతంలో అనారోగ్యం వల్ల శస్త్ర చికిత్స ద్వారా మోకాలు పై వరకు తొలగించారు. ఆలయ ఫౌండేషన్ సిఈఓ కీర్తి నాగార్జున ద్వారా హైదరాబాద్ కు వెళ్లిన లక్ష్మికి ఇటీవల కృత్రిమ కాలు అమర్చడం జరిగింది.బుధవారం మొగిలిపాలెం వచ్చిన సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సల కోసం నరహరి బసంత్ నగర్ లో పెద్ద ఆసుపత్రి కట్టించినట్లు తెలిపారు. ఉన్నత చదువులతో పాటుగా ఉపాధి కల్పన లో పెద్ద, పెద్ద కార్పొరేటు కంపెనీ ల ద్వారా ఉద్యోగ అవకాశాలకోసం క్యాంప్ లు కూడా ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.కృత్రిమ కాలు అమర్చడం కోసంభాధితుల పక్షాన ఫౌండేషన్ ను సంప్రదించిన మాజీ వైస్ ఎంపిపి తుమ్మనపల్లి శ్రీనివాసరావ్ మరియు న్యాయవాది బీజేపీ మాజీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి లకు ధన్యవాదములు తెలిపారు. సర్పంచ్ తాట్ల తిరుపతి,కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి,వార్డు సభ్యులు చెన్నబోయిన రవి,పాశం రాఘవరెడ్డి, ఎల్కపల్లి స్వామి, జక్కుల శ్రీనివాస్, జనార్ధన్ రావు,రవికుమార్, వరుణ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా కిసాన్ నగర్ హిందూ సమ్మేళనం...



**కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 16:**కరినగర్ నగరంలో కిసాన్ నగర్ బస్తీలో చత్రపతి శివాజీ హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో ఘనంగా హిందూ సమ్మేళనం నిర్వహించారు. గోపూజతో కార్యక్రమం అనంతరం హిందూ సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళన కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన ఆర్ఎస్ఎస్ కరినగర్ విభాగ ప్రచార ప్రముఖ్ తడి గొప్పుల శంకరయ్య మాట్లాడుతూ సమాజంలో కులాల పేరుతో పెరుగుతున్న విభజన తో హిందువులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని , హిందూ సమాజం ఐక్యంగా ఉన్నప్పుడే దేశం , ధర్మం సుస్థిరంగా ఉంటుందన్నారు. ఐకమత్యత లేని కారణంగా నేడు ప్రపంచంలోని అనేక దేశాలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. హిందువులు ఐక్యంగా, సంఘటితశక్తిగా మారాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. హిందూ ధర్మం ఎంతో గొప్పదని,. సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రతి ఒక్కరు దేశభక్తి, జాతీయభావం పెంపొందించుకోవాలని సూచించారు. హిందూల ఐక్యతను బలోపేతం చేయడమే లక్ష్యంగా హిందూ సమ్మేళనాలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయని తెలిపారు. సంఘ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆర్ఎస్ఎస్ పిలుపునిచ్చిన మేరకు హిందూ సమ్మేళనాలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్లు దేశం, ధర్మం, సంస్కృతి , సాంప్రదాయాల పరిరక్షణ కోసం నిరంతరయంగా పని చేసిందన్నారు. నేడు శతాబ్ది ఉత్సవాలలో భాగంగా పంచ పరివర్ధన్ కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేసిందన్నారు. సంఘం దేశహితం కోసం ఎల్లవేళలా పనిచేస్తూ ముందు కొనసాగుతుందన్నారు. రాష్ట్ర సేవికాసమితి ప్రాంత శారీరక్ ప్రముక్ లెక్కల రమ మాట్లాడుతూ హిందూ ధర్మం ఎంతో పురాతనమైనదని, హిందూ ధర్మం విశిష్టమైన చరిత్ర కలిగి ఉందన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు. సనాత ధర్మ పరిరక్షణ మనందరికీ శ్రీరామరక్ష లాంటిదన్నారు. అనంతరం. ముఖ్యఅతిథిగా హాజరైన మంగళంపల్లి శ్రీనివాస్ శర్మ మాట్లాడారు.ఈ కార్యక్రమంలో సమ్మేళనము కార్యనిర్వహణ సమితి అధ్యక్షుడు పసుల మహిపాల్ ప్రధాన కార్యదర్శి , గాజుల కృష్ణ జన జాగరణ సమితి అధ్యక్షుడు , ఎన్నం శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శి మేంగని రాజయ్య , ఉపాధ్యక్షులు ఉప కార్యదర్శులు , బస్తీ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## రష్యా అధ్యక్షుడు పుతిన్

## భారత్ పర్యటన ఖరారు..!



**రష్యా వెలుతురు న్యూస్ ఏప్రిల్ 16** మారుతున్న ప్రపంచ రాజకీయ ముఖచిత్రంలో భారత్-రష్యా సంబంధాలు కేవలం చారిత్రక బంధం మాత్రమే కాదు, అవి కాలపరీక్షకు నిలబడిన ధృడమైన భాగస్వామ్యమని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ స్పష్టం చేశారు. ఇటీవల ఆయన ప్రముఖ మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో రక్షణ, ఇంధనం, వాణిజ్యం, దౌత్యపరమైన అంశాలపై ఆసక్తికర విషయాలను వెల్లడించారు.మారుతున్న ప్రపంచ రాజకీయ ముఖచిత్రంలో భారత్-రష్యా సంబంధాలు కేవలం చారిత్రక బంధం మాత్రమే కాదు, అవి కాలపరీక్షకు నిలబడిన ధృడమైన భాగస్వామ్యమని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ స్పష్టం చేశారు. ఇటీవల ఆయన ప్రముఖ మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో రక్షణ, ఇంధనం, వాణిజ్యం, దౌత్యపరమైన అంశాలపై ఆసక్తికర విషయాలను వెల్లడించారు. 2026 సెప్టెంబర్‌లో భారతదేశంలో జరగనున్న బ్రిక్స్ సదస్సుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హాజరవుతారని అలీపోవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రష్యా పర్యటన విజయవంతమైన నేపథ్యంలో, ఇప్పుడు పుతిన్ భారత్ పర్యటన కోసం ఇరు దేశాల ఉన్నత స్థాయి అధికారులు చర్చలు జరుపుతున్నారు. ప్రపంచ వేదికపై భారతదేశం పోషిస్తున్న నిర్ణయాత్మక పాత్రకు రష్యా పూర్తి మద్దతు ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు.రక్షణ రంగంలో ఇరు దేశాల మధ్య సహకారం కొత్త పుంతలు తొక్కుతోందని అలీపోవ్ తెలిపారు. మిగిలిన ఎస్-400 క్షిపణి వ్యవస్థను భారత్ త్వరలోనే అందుకోనున్నట్లు ఆయన తెలిపారు. మేక్ ఇన్ ఇండియా సత్తాతో ముడిపడిన బ్రహ్మోస్ క్షిపణులు, ఏకే-203 రైఫిల్‌ల తయారీని రష్యా-భారత్ విజయగాథలుగా ఆయన అభివర్ణించారు. అత్యాధునిక ఎస్‌యు-57 యుద్ధ విమానాలపై భారత్ ఆసక్తి కనబరిచిందని, అయితే భద్రతా కారణాల దృష్ట్యా రక్షణ ఒప్పందాల పూర్తి వివరాలను గోప్యంగా ఉంచుతున్నట్లు అలీపోవ్ తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, భారత్‌కు రష్యా ఒక నమ్మకమైన ఇంధన భాగస్వామిగా కొనసాగుతోందన్నారు. ముడి చమురు, ఎల్‌పిజి సరఫరాలను రష్యా నిరంతరం కొనసాగిస్తుందని రాయబారి అలీపోవ్ హామీ ఇచ్చారు. "భారత్-రష్యా మధ్య 100 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాము. ఇది కొంచెం కష్టమైనా, ఖచ్చితంగా సాధించదగినదే." అని డెనిస్ అలిపోవ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం చమురు కొనుగోళ్ల వల్ల వాణిజ్యం రష్యా వైపు మొగ్గు చూపుతోంది. దీనిని సమతుల్యం చేయడానికి వ్యవసాయ ఉత్పత్తులు, యంత్రాల ఎగుమతులను పెంచాలని భారత్‌ను రష్యా కోరుతోంది. ముఖ్యంగా, 95 శాతం వాణిజ్య లావాదేవీలు సొంత కరెన్సీల్లోనే జరుగుతుండటం వల్ల అమెరికా ఆంక్షల ప్రభావం గణనీయంగా తగ్గిందని ఆయన పేర్కొన్నారు.పశ్చిమ ఆసియాలో ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న ఉద్రిక్తతలపై అలీపోవ్ స్పందిస్తూ, అమెరికా -- ఇజ్రాయెల్ దాడులను ఖండించారు. ఇరాన్‌కు ఆత్మరక్షణ చేసుకునే హక్కు ఉందని, శాంతియుత అణుశక్తిని ఉపయోగించుకునే హక్కును గౌరవించాలని ఆయన పేర్కొన్నారు. పశ్చిమ దేశాల ఒత్తిడిని అధిగమిస్తూ, భారత్-రష్యా సంబంధాలు మరింత పటిష్టంగా ముందుకు సాగుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ పరిణామాలు చూస్తుంటే, భవిష్యత్తులో రక్షణ, ఆర్థిక మరియు దౌత్య రంగాల్లో భారత్-రష్యా బంధం ఒక కొత్త అధ్యాయానికి తెరలేపనుందని స్పష్టమవుతోంది.

## మహిళా రిజర్వేషన్: కేంద్రంపై ప్రియాంక గాంధీ ప్రశ్నల వర్షం.. డీలిమిటేషన్‌పై అనుమానాలు!

మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు తీరుపై కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ సంధించిన ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల వేదికగా ఆమె కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, ఈ బిల్లులోని చిక్కుముడులను ప్రశ్నించారు. మహిళలకు రావాల్సిన న్యాయాన్ని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తోందని ఆమె ఆరోపించారు.మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు తీరుపై కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ సంధించిన ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల వేదికగా ఆమె కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, ఈ బిల్లులోని చిక్కుముడులను ప్రశ్నించారు.మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యూహంపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మహిళా సాధికారత పేరిట ప్రభుత్వం తెచ్చిన ఈ బిల్లు, వాస్తవానికి అమలుకు నోచుకోని ఎన్నికల గారడీగా ఆమె అభివర్ణించారు. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజన జనాభా లెక్కల అంశాలను ముడిపెట్టడం ద్వారా మహిళలకు రావాల్సిన న్యాయాన్ని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తోందని ఆమె ఆరోపించారు.ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల్లోనే 33 శాతం రిజర్వేషన్లను తక్షణమే ఎందుకు అమలు చేయలేరని ప్రియాంక ప్రశ్నించారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన చేయడానికి ప్రయత్నించడం అర్థరహితమని, దీనివల్ల ఓబీసీ (ాదీజ) వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అస్సాంలో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనను ప్రస్తావిస్తూ, సరిహద్దులను ఏకపక్షంగా నిర్ణయించారని ఆమె మండిపడ్డారు. పార్లమెంటు సీట్లను 50 శాతం పెంచాలనే ఆలోచన ఉన్నప్పటికీ, దానికి సంబంధించిన స్పష్టమైన రోడ్ మ్యాప్ బిల్లులో లేకపోవడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు.పార్లమెంటులో రాహుల్ గాంధీని అధికార పక్షం తరచుగా ఎగతాళి చేస్తుందని, కానీ ఆయన ప్రజా సమస్యలపై మాట్లాడేటప్పుడు పూర్తి చిత్తశుద్ధితో ఉంటారని ప్రియాంక పేర్కొన్నారు. ప్రతిపక్షం మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించడం లేదని, అయితే దాని అమలులో ఉన్న పారదర్శకతను, కాలయాపనను మాత్రమే ప్రశ్నిస్తున్నామని ఆమె స్పష్టం చేశారు.మొత్తానికి, మహిళా రిజర్వేషన్ బిల్లు అనేది బీజేపీకి కేవలం "అధికారాన్ని నిలుపుకునే ఒక రాజకీయ ఎత్తుగడ" గానే కనిపిస్తోందని ప్రియాంక గాంధీ తన ప్రసంగం ద్వారా కుండబద్దలు కొట్టారు. మహిళల హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఓబీసీ రిజర్వేషన్లతో కూడిన మహిళా కోటాను సాధించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

## ఉస్మానియాలో విషాదం.. సీనియర్ వైద్యుల వేధింపులతో పీజీ వైద్య విద్యార్థి ఆత్మహత్య

**హైదరాబాద్ వెలుతురు న్యూస్ ఏప్రిల్ 16:** ఉస్మానియా ఆసుపత్రిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సీనియర్ వైద్యుల నుంచి వేధింపులు, కుల వివక్ష భరించలేక ఓ పీజీ వైద్య విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. జనరల్ సర్జరీ విభాగంలో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్న డాక్టర్ కాట్రావత్ సురేశ్ నాయక్ (29) గురువారం హాస్టల్ గదిలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జడ్చర్ల సమీపంలోని పాల్గడ్డ తండాకు చెందిన సురేశ్ మూడు నెలల క్రితమే పీజీ కోర్సులో చేరాడు. రిజర్వేషన్ కోటాలో సీటు సులువుగా వచ్చిందంటూ సీనియర్లు తనను కులపరంగా వేధించేవారని, అదనపు డ్యూటీలు వేస్తూ తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని సురేశ్ తన తల్లి నాగమణికి ఫోన్‌లో చెబుతూ బాధపడేవాడు. ఇటీవల సురేశ్ మేనమామ రవి హాస్టల్‌కు వచ్చి ధైర్యం చెప్పినా, సీనియర్లతో మాట్లాడితే వేధింపులు మరింత ఎక్కువవుతాయని సురేశ్ వారించినట్టు తెలిసింది.గురువారం ఉదయం సురేశ్ గది నుంచి బయటకు రాకపోవడంతో, తోటి విద్యార్థిని డాక్టర్ అమూల్య వెళ్లి చూడగా అతడు అపస్మారక స్థితిలో కనిపించాడు. అతని వద్ద నిద్రమాత్రలు, ఇంజెక్షన్ ఉండటంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. వెంటనే అత్యవసర విభాగానికి తరలించి చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.సురేశ్ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతికి కారణమైన సీనియర్లను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. పోలీసులు నచ్చజెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. "గొప్ప డాక్టర్‌గా మా తండాకు సేవ చేస్తానన్న కొడుకును పొట్టనబెట్టుకున్నారు" అంటూ సురేశ్ తల్లి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వడదెబ్బ తగలకుండా జిల్లా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

**మేడ్చల్ మల్కాజిగిరి వెలుతురు న్యూస్ ఏప్రిల్ 16:** రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా వడదెబ్బ తగలకుండా, వడగాలుల లో తీసుకోవలసిన నివారణ చర్యలకు సంబంధించి చేయవలసినవి మరియు చేయకూడని వాటి పై సూచనలను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో జారీ చేసారు. ఇట్టి అంశాలను జిల్లా ప్రజలు తెలుసుకొని తదనుగుణంగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

చేయవలసినవి:

సాధ్యమైనంత వరకు ఇంట్లోనే ఉండాలన్నారు. ఉల్లిపాయ సలాడ్ మరియు ఉప్పు, జీలకర్రతో కూడిన పచ్చి మామిడి వంటి సాంప్రదాయ నివారణలు వడదెబ్బను నివారించగలవని సూచించారు. పిల్లలను లేదా పెంపుడు జంతువులను మూసి ఉన్న వాహనంలో ఎప్పుడూ ఒంటరిగా వదిలిపెట్టవద్దని, ఫ్యాన్లను వాడుతూ, తరచుగా చల్లటి నీటితో స్నానం చేయాలని సూచించారు.మీ ఇంటికి లేదా కార్యాలయానికి వచ్చే అమ్మకందారులకు మరియు డెలివరీ చేసేవారికి నీటిని అందించాలని, ప్రజా రవాణాను, కార్-పూలింగ్‌ను ఉపయోగించాలని, తద్వారా భూతాపాన్ని, వేడిని తగ్గించడానికి సహాయపడుతుందని వివంచారు. ఎండు ఆకులు, వ్యవసాయ వ్యర్థాలు మరియు చెత్తను కాల్చవద్దని సూచించారు. జలాశయాలను సంరక్షించండి వర్షపు నీటిని సేకరించే పద్ధతులను పాటించాలన్నారు. మీకు తల తిరుగుతున్నట్లు అనిపించినా లేదా అనారోగ్యంగా ఉన్నా, వెంటనే వైద్యుడిని కలవాలని లేదా మిమ్మల్ని వెంటనే వైద్యుడి వద్దకు తీసుకువెళ్ళమని ఎవరికైనా తెలపాలని సూచించారు. రేడియో వినండి, టీవీ చూడండి; స్థానిక వాతావరణ



వార్తల కోసం వార్తాపత్రిక చదవండి మరియు టి-వెదర్ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి.దాహం వేయకపోయినా కూడా, తగినంత నీరు త్రాగుతూ ఉండాలని, మూర్ఛ వ్యాధి లేదా గుండె, మూత్రపిండాలు లేదా కాలేయ వ్యాధులు ఉండి, ద్రవపదార్థాల పరిమితి గల ఆహారం తీసుకుంటున్నవారు, లేదా శరీరంలో ద్రవాలు నిలిచిపోయే సమస్య ఉన్నవారు, ద్రవపదార్థాలు తీసుకోవడం పెంచే ముందు వైద్యుడిని సంప్రదించాలని సూచించారు.శరీరాన్ని డీహైడ్రేట్ కాకుండా ఉంచుకోవడానికి ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్), లస్సీ, తోరణి (బియ్యం నీరు), నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీరు మొదలైన ఇంట్లో తయారుచేసిన పానీయాలను తీసుకోవాలన్నారు.తేలికైన, లేత రంగు, వదులుగా ఉండే కాటన్ దుస్తులను ధరించాలన్నారు.

బయట ఉన్నట్లయితే, మీ తలను గుడ్డ, టోపీ లేదా గొడుగు తో కప్పి ఉండేలా చూసుకొవాలని, మీ కళ్ళను రక్షించుకోవడానికి సన్ గ్లాసెస్, మీ చర్మాన్ని రక్షించుకోవడానికి సన్‌స్క్రీన్ ఉపయోగించాలన్నారు.

చేయకూడనివి:

ముఖ్యంగా మధ్యాహ్నం 12:00 గంటల నుండి 3:00 గంటల మధ్యలో ఎండ తగిలే ప్రదేశాలలోకి వెళ్లకూడదని, మధ్యాహ్నం బయట ఉన్నప్పుడు శ్రమతో కూడిన కార్యకలాపాలను నివారించాలని, కాళ్లకు చెప్పులు లేకుండా బయటకు వెళ్లవద్దని సూచించారు. ఎండ ఎక్కువగా సమయాల్లో వంట చేయడం మానుకోవాలని, వంట చేసే ప్రదేశానికి తగినంత గాలి వచ్చేలా తలుపులు, కిటికీలు తెరిచి ఉంచాలని పేర్కొన్నారు. శరీరాన్ని నిర్జలీకరణం చేసే మద్యం, టీ, కాఫీ మరియు కార్బోనేటెడ్ శీతల పానీయాలకు దూరంగా ఉండాలని, గర్భిణీ స్త్రీలు మరియు అనారోగ్య సమస్యలు ఉన్న ఉద్యోగులపై అదనపు శ్రద్ధ వహించాలని సూచించారు. శరీరాన్ని నిర్జలీకరణం చేసే మద్యం, టీ, కాఫీ మరియు కార్బోనేటెడ్ శీతల పానీయాలకు దూరంగా ఉండాలని, అధిక ప్రోటీన్, ఉప్పు, కారం మరియు నూనెతో కూడిన ఆహారాన్ని తీసుకోకూడదని వివరించారు.కంప్యూటర్లు లేదా గృహోపకరణాల వలె అనవసరమైన వేడిని ఉత్పత్తి చేయగల ప్రకాశవంతమైన లైట్ బల్బులను ఉపయోగించకూడదని సూచించారు.పై విషయాలను దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుతం నెలకొన్న వేసవి కాలంలో ఎలాంటి విపత్తులు సంభవించకుండా నివారించడానికి అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వివరించారు.

## మహిళలందరూ అక్షరాస్యులు గా అభివృద్ధి చెందాలి -రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ దివ్య దేవరాజ్

**హైదరాబాద్ వెలుతురు న్యూస్ ఏప్రిల్ 16:** మహిళలందరూ అక్షరాస్యులు గా అభివృద్ధి చెందాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ దివ్య దేవరాజ్ అన్నారు99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం ఫరూక్ నగర్ మండలం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సమావేశంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ దివ్య దేవరాజ్, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకరయ్య తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి రాష్ట్ర గీతం తోమండల సభను ప్రారంభించారు. ఎంపీడీవో ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు.మండల సభ లో ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాల్ లు పంచాయతీ రాజ్ కమిషనర్, కలెక్టర్, స్థానిక శాసన సభ్యులు సందర్శించారు.









అనంతరం వివిధ శాఖల మండల అధికారులు వారి పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును క్షుణ్ణంగా వివరించారు.రైతు రుణ మాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సభ్యులకు మంజూరైన వడ్డీ లేని రుణాల వివరాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్ బుక్కులు, సన్న బియ్యం పంపిణీ, వైద్య సేవలు, తదితర పథకాలకు సంబంధించి లబ్ధిదారుల పూర్తి వివరాలను మండల ప్రజలకు తెలియజేశారు. అదే విధంగా నూతన పథకాలైన ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, మధ్యాహ్న భోజన పథకం - ఇంటర్మీడియట్ కు విస్తరణ, విభిన్న ప్రతిభావంతులైన ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటారు వాహనాలు, పంటల వైవిధ్యం, సహజ సేంద్రీయ వ్యవసాయం పథకాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా దివ్య దేవరాజ్ మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఇప్పటికి తెలంగాణలోని 558 మండలాలలో మహిళలను బస్సులకు యజమానులను చేసినట్లు వెల్లడించారు. కొత్త బస్సులను కొనుగోలు చేయాలన్న, కాంట్రాక్టు పద్ధతిలో బస్సులు తీసుకోవాలన్న ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కాబట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ బాధ్యతలను మహిళలకు అప్పగించి ఉపాధి దిశగా వారిని ముందడుగు వేయించడమే కాకుండా బస్సుల కొరత కూడా తీర్చే ప్రయత్నం చేస్తున్నారని వెల్లడించారు. కేవలం బస్సులు మాత్రమే కాకుండా సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులను కూడా మహిళలకు అందిస్తున్నామని వెల్లడించారు. మహిళా సంఘాల భవనాలను కూడా ప్రభుత్వం పెద్ద ఎత్తున నిర్మాణం తలపెట్టిందని. ఇందులో భాగంగా మూడు నెలల్లో 8000 భవనాలను నిర్మించేందుకు శ్రీకారం జరిగిందని అన్నారు. పలు గ్రామాలలో గ్రామపంచాయతీ ద్వారా మహిళా సంఘానికి స్థలాన్ని మహిళలు తమ హక్కుగా తీసుకున్నరని, మహిళలలో అక్షరాస్యతను పెంచే కార్యక్రమాలను కూడా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల ప్రగతిలో సర్పంచ్ ల పాత్ర చాలా కీలకమని, 15వ ఆర్థిక సంఘం నిధులను ఉపయోగించుకొని సర్పంచులు గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా పని చేయాలని అన్నారు. ఇటీవల వాహనాలు విపరీతంగా పెరిగి, ట్రాఫిక్ సమస్యల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని నివారించే దిశగా ప్రజలు, అధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, హెల్మెట్, సీటు బెల్ట్ ప్రతి ఒక్కరు విధిగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చునని, ప్రతి ఒక్కరు హెల్మెట్ వాడకం ద్వారా ప్రమాదాల నివారణకు సహకరించాలని, కోరారు. అదేవిధంగా మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగంగా వెళ్లడం వంటివి నివారించుకోవాలని అన్నారు. ఇలాంటివి చోటు చేసుకోకుండా పోలీసులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణ కార్యక్రమం యుద్ధప్రాతిపదికన కొనసాగుతుందని, వర్షాకాలం వస్తే ఇబ్బందులు ఎదురవుతాయని ఉద్దేశంతో వేసవిలోనే అన్ని ఇండ్లను పూర్తిచేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేలా అధికారులు పని చేయాలని సూచించారు.

స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కొరకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరాలని ఆ దిశగా అందరూ పని చేయాలని అన్నారు. జిల్లాలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యచరణ పక్కాగా అమలు చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు చాలా వరకు ఇప్పటికే పూర్తి కాగా మిగిలినవి చివరి దశలో ఉన్నాయని తెలిపారు. అతి త్వరలో మిగతా వాటిని కూడా పూర్తి చేస్తామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి ఎలాంటి సమస్యలు సర్పంచ్లు తన దృష్టికి తెచ్చిన వెంటనే స్పందిస్తున్నానని ఆయన వెల్లడించారు. అదేవిధంగా ప్రజా పాలనలో భాగంగా 99 రోజుల కార్యక్రమాన్ని మున్సిపాలిటీ పరిధిలో విజయవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. అనంతరం కళ్యాణ లక్ష్మి చెక్కులు, అంగన్వాడీ విద్యార్థులకు యూనిఫాంలు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్, డిపిఓ సురేష్ మోహన్, పిడి డి.ఆర్.డి. ఏ శ్రీలత, డిసిపి శిరీష, ఆర్డీవో సరిత ఎంపీడీవో బన్సీలాల్, ఏసిపి లక్ష్మీనారాయణ, తాసిల్దార్ నాగయ్య, సర్పంచులు, అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ పీఠంపై 'మానుకోట' విజయకేతనం

# రాజ్యసభ సభ్యుడిగా వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం

- భారత పార్లమెంట్‌లో ప్రతిధ్వనించిన తెలంగాణ గొంతుక: రాజ్యసభలో అడుగుపెట్టిన ప్రజానేత.
- తెలంగాణ భవన్‌లో వేం నరేందర్ రెడ్డిని శాలువాతో సత్కరించిన కాంగ్రెస్ నాయకుడు చిలువేరు సమ్మయ్య గౌడ్.
- కేసముద్రం నుంచి ఢిల్లీ దాకా జన జాతర దేశ రాజధానిలో కదం తొక్కిన కాంగ్రెస్ శ్రేణులు.
- సేవకు దక్కిన సమున్నత గౌరవం: అభివృద్ధి ప్రదాత ప్రస్థానంలో చారిత్రాత్మక మైలురాయి.










**న్యూఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 16:** దేశ రాజధాని నడిబొడ్డున మహబూబాబాద్ ఆత్మగౌరవ నినాదం మార్మోగింది. కేసముద్రం మట్టిలో పుట్టి, ప్రజా సమస్యలే ఊపిరిగా ఎదిగి, అంచెలంచెలుగా రాజకీయ శిఖరాలను అధిరోహించిన ధీశాలి, మాజీ శాసనసభ్యుడు, ముఖ్యమంత్రి రాజకీయ సలహాదారు వేం నరేందర్ రెడ్డి నేడు రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. భారత ప్రజాస్వామ్య దేవాలయం సాక్షిగా ఆయన బాధ్యతలు స్వీకరిస్తుంటే, తెలంగాణ రాజకీయ యవనికపై ఒక అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది.

అభివృద్ధి ప్రదాతకు నీరాజనం: చిలువేరు సమ్మయ్య గౌడ్ ఈ చారిత్రక వేడుక సందర్భంగా ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో పండుగ వాతావరణం నెలకొంది. సమ్మి గుడ్ ఫౌండేషన్ అధినేత, జిల్లా కాంగ్రెస్ అగ్ర నాయకుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ తన అభిమాన నాయకుడిని కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నరేందర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేస్తూ తన గౌరవాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ భావోద్వేగంతో కూడిన అద్భుతమైన ప్రసంగం చేశారు వేం నరేందర్ రెడ్డి కేవలం ఒక పేరు కాదు, అది ఒక నమ్మకం. కేసముద్రం అభివృద్ధికి నిరంతరం పరితపించే ఆయన వ్యక్తిత్వం, పట్టుదలే నేడు ఆయనను దేశ అత్యున్నత సభలో అడుగుపెట్టేలా చేశాయి. మహబూబాబాద్ గడ్డ రుణం తీర్చుకునేందుకు ఆయనకు దక్కిన సమున్నత గౌరవం ఇది. జాతీయ స్థాయిలో మన ప్రాంత సమస్యలను వినిపించే ఒక ధీర గొంతుక రాజ్యసభలో ప్రతిధ్వనించబోతుండటం మనందరికీ గర్వకారణం," అని సమ్మయ్య గౌడ్ కొనియాడారు. తమ ప్రియతమ నాయకుడి ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని కళ్లారా చూసేందుకు మహబూబాబాద్, కేసముద్రం మరియు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి కాంగ్రెస్ సైన్యం పోటెత్తింది. వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో ఢిల్లీ వీధులు కిక్కిరిసిపోయాయి. 'మన నరేందర్ రెడ్డి.. మన గర్వం' అంటూ చేసిన నినాదాలు ఢిల్లీ కోటను తాకాయి. తమ నేత జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించబోతుండటంతో అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అట్టడుగు స్థాయి నుంచి అగ్రస్థాయి వరకు నరేందర్ రెడ్డి సాగించిన ఈ రాజకీయ ప్రయాణం ఒక అద్భుత కావ్యం. ఈ రోజు ఆయన రాజ్యసభ సభ్యుడిగా అడుగుపెట్టడం తెలంగాణ రాజకీయ చరిత్రలో, ముఖ్యంగా మహబూబాబాద్ గడ్డపై ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోనుంది.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుగులోత్ దస్రు నాయక్,అల్లం నాగేశ్వర్ రావు,బానోత్ వెంకన్న నాయక్,నీలం దుర్గేష్,రావుల మురళీ,బండారు వెంకన్న, బండారు దయాకర్, అంబటి మహేందర్ రెడ్డి,పోలేపాక నాగరాజు, బండారు కృష్ణ,సతీష్, గుంజపొడుగు రాజశేఖర్, నవీన్ రెడ్డి తదితరులు.

---

## "మహిళా రిజర్వేషన్‌లో బిసి మహిళలకు ప్రత్యేక కోటా తప్పనిసరి"







- డా. రేఖ బోయలపల్లి వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్
- న్యూఢిల్లీ (జంతర్ మంతర్) జంతర్ మంతర్‌లో మహిళా కాంగ్రెస్ నిరసన

**న్యూఢిల్లీ, జంతర్ మంతర్ వెలుతురు ఏప్రిల్ 16:** మహిళా రిజర్వేషన్ బిల్లులో బిసి (ఓబీసీ ) మహిళలకు ప్రత్యేక ఉప-కోటా కల్పించాలని మహిళా కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు జంతర్ మంతర్ వద్ద గురువారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ డా. రేఖ బోయలపల్లి పాల్గొన్నారు. ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఆల్కా లాంబా నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా మహిళా కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. రేఖ బోయలపల్లి మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్‌కు తాము వ్యతిరేకం కాదని, అయితే అది సమగ్రంగా అమలుకావాలంటే బిసి మహిళలకు ప్రత్యేక కోటా తప్పనిసరి అని పేర్కొన్నారు. బిసి మహిళలకు వాటా లేకుండా రిజర్వేషన్ అమలు చేయడం సామాజిక న్యాయానికి విరుద్ధమని అన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియను జనగణనతో అనుసంధానం చేయడం వల్ల మహిళా రిజర్వేషన్ అమలు ఆలస్యమయ్యే అవకాశముందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని తెలిపారు.

మహిళా రిజర్వేషన్ బిల్లులో బిసి మహిళలకు ప్రత్యేక ఉప-కోటా కల్పించి నిజమైన సమానత్వాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డా. రేఖ బోయలపల్లి డిమాండ్ చేశారు.

## యువ గుండెను కాపాడుకుందాం



నిన్న మొన్నటి వరకు వృద్ధులకే పరిమితమైన గుండెపోటు సమస్య నేడు యువతకు గండంలా దాపురించింది. దీనికి ప్రధాన కారణం మన జీవనశైలిలో వచ్చిన మార్పులే. గుండె పదిలంగా ఉండాలంటే.. యుక్త వయసు నుంచే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

**ప్లాస్టిక్‌కు దూరంగా:** మనం వాడే ప్లాస్టిక్ కేవలం పర్యావరణానికే కాదు మన గుండెకు కూడా శత్రువే. ప్లాస్టిక్ కణాలు విచ్ఛిన్నమై మైక్రోప్లాస్టిక్స్, నానో ప్లాస్టిక్స్‌గా మారి మనం పీల్చే గాలిలో, తాగే నీటిలో చేరుతున్నాయి. ఇవి శరీరంలో చేరి దీర్ఘకాలిక వాపు కలిగిస్తాయి. దీనివల్ల ధమనుల్లో అడ్డంకులు ఏర్పడి గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. వీలైనంత వరకు ప్లాస్టిక్ బాటిళ్లు, డబ్బాల వాడకాన్ని తగ్గించాలి.

**సీఫుడ్ తీసుకోండి:** గుండె ఆరోగ్యానికి ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఎంతో అవసరం. ఇవి చేపల్లో పుష్కలంగా లభిస్తాయి. రక్తంలో ఒమేగా-3 స్థాయులు ఎకువగా ఉన్నవారిలో గుండె సంబంధిత సమస్యలు తకువగా ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి. వారానికి కనీసం రెండుసార్లు చేపలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల గుండె పనితీరు మెరుగుపడుతుంది.

**ఎండలో గడపండి:** మనలో చాలామంది ఏసీ గదులకే పరిమితమవుతున్నారు. కానీ, సూర్యరశ్మి సహజంగానే రక్తపోటును నియంత్రిస్తుంది. క్రమం తప్పకుండా ఎండలో గడపడం వల్ల ధమనుల్లో ఏర్పడే ప్లేక్ తగ్గుతుంది. తద్వారా పక్షవాతం, గుండెపోటు ముప్పు తప్పుతుంది.

**నిద్రతోనే ఆరోగ్యం:** చాలామంది నిద్రను విలాసంగా భావిస్తారు. కానీ, అది ప్రాథమిక అవసరం. శరీరం విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు గుండె కండరాలు తమను తాము మరమ్మతు చేసుకుంటాయి.

సరైన నిద్ర లేకపోతే శరీరంలో జీవక్రియలు దెబ్బతిని గుండెపై అదనపు భారం పడుతుంది. అందుకే ప్రతిరోజూ 7-8 గంటల నిద్ర తప్పనిసరి.

**శారీరక శ్రమ:** ఒకే చోట కూర్చుని పనిచేసే అలవాటు గుండెకు శాపం. రోజూ కనీసం 30 నిమిషాలపాటు నడక, హైకింగ్, సైక్లింగ్ వంటి వ్యాయామాలు చేస్తుండాలి. శరీర కదలికలు రక్త ప్రసరణను మెరుగుపరిచి గుండెను దృఢంగా ఉంచుతాయి.

**ఒత్తిడిని తగ్గించుకోండి:** వందలాది గుండెపోటు కేసుల్లో ఒత్తిడి ప్రధాన కారణంగా తేలింది. మానసిక ఆందోళన రక్తనాళాలపై ఒత్తిడిని పెంచుతుంది. యోగా, ధ్యానం వంటి పద్ధతుల ద్వారా ఒత్తిడిని నియంత్రించుకోవాలి.

**పరీక్షలు చేయించుకోండి:** గుండె ఆరోగ్యంపై అంచనాలతో కాకుండా, డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి. శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ లెవల్స్, హోమోసిస్టీన్, విటమిన్లు, మినరల్స్ స్థాయులను ఎప్పటికప్పుడు వైద్య పరీక్షల ద్వారా తెలుసుకోవాలి. దీనివల్ల ముప్పును ముందే పసిగట్టవచ్చు.

**ఈఎంఎఫ్ తగ్గించండి:** మొబైల్ ఫోన్లు, వై-ఫై నుంచి వచ్చే విద్యుదయస్కాంత కిరణాలు (EMF) గుండెలోని ఎలక్ట్రికల్ సిగ్నల్స్ పై ప్రభావం చూపే అవకాశం ఉందని కొన్ని పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి.

అందుకే రాత్రిపూట వై-ఫై స్విచ్ ఆఫ్ చేయడం, నిద్రపోయేటప్పుడు ఫోన్‌ను దూరంగా ఉంచడం వంటి చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకోవడం మన గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com